మే
2021

181

సంపుటి : 15 సంచిక : 12 వెల రు. 10/-

## ఈ సంచికలో........

పారిస్ కమ్యూన్ @ 150 : తొలి కార్మికవర్గ రాజ్యం అనుభవాలు, గుణపాఠాలు
కోవిడ్ నివారణలో అన్ని వ్యవస్థల వైఫల్యం
కమ్యూనిస్టు ఉద్యమ ఆటుపోట్లు: శాస్త్రీయ అవగాహన
శ్రామికుల శత్రువులెవరు?
ఇనుప యుగం
ప్రతిభ -సమర్ధత : రిజర్వేషన్లు
మహత్తర మేధావి ఫ్రెడరిక్ ఏంగెల్స్
పార్టీ అంతర్గత పోరాటం మొదలు

## నాల్గవ మహాసభ

# పార్టీ అంతర్గత పోరాటం మొదలు

**భా**షా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటు కమ్యూనిస్టు పార్టీ లేవనెత్తిన ప్రధాన డిమాండ్లలో ఒకటి. కమ్యూనిస్టు పార్టీ నాయకత్వం వహించిన అనేక రైతాంగ పోరాటాలలో కూడా ఇది ప్రధానమైన డిమాండ్. ఈ డిమాండ్‌ను అంగీకరిస్తే దేశం విచ్ఛిన్నం అవుతుందని స్వాతంత్రం పొందిన తరువాత కాంగ్రెస్ ప్రభుత్వం ఈ డిమాండ్‌ను అమలు చేయడానికి అంగీకరించలేదు. కమ్యూనిస్టులు ఈ వాదనను అంగీకరించక ప్రజలలో విస్తతంగా ప్రచారం చేసారు. అనేక పోరాటాలను నడిపారు.

ప్రజా సమూహం దేశ ఆర్థిక, రాజకీయ ప్రజాతంత్ర పునర్ నిర్మాణంలో సంపూర్ణంగా పాల్గనడానికి, దేశం అభివద్ధి వైపు, పురోగతి వైపు నడవడానికి భాషా ప్రయుక్త రాష్ట్రాలు తప్పనిసరిగా ఏర్పడాలని భావించింది. భారతదేశం ఐక్యంగా ఉండడానికి భాషా ప్రయుక్త రాష్ట్రాలే గట్టి పునాదిగా ఉంటాయని, దాని ఆధారంగానే ప్రజల ప్రజాతంత్రం, సమానత్వం సాధించ గలుగుతారని భావించింది. ప్రజా ఉద్యమం ద్వారా 1953లో ఆంధ్ర ప్రదేశ్ ఏర్పడడాన్ని స్వాగతించింది.

1954 ఏప్రిల్‌లో జరిగిన కేంద్ర కమిటీ సమావేశంలో కమ్యూనిస్టు పార్టీ రాష్ట్రాల పునర్వ్యవస్థీకరణ తీర్మానాన్ని అమోదించింది. రాష్ట్రాల పునర్వ్యవస్థీకరణకు కమిషన్‌ని ఏర్పాటు చేయడాన్ని స్వాగతించింది. అయితే కమిషన్ భాష ప్రాతిపదికకు, సంస్కతికి లోబడి ఉండనక్కరలేదన్న నిబంధనలలోని సూచనలను విమర్శించింది. అందుకు భిన్నంగా, ఆర్థికంగా నిలదొక్కుకోగలగడం, పరిపాలనకు వెసులుబాటే ప్రధాన గీటురాయిగా పరిగణనలోనికి తీసుకోవాలని కమిషన్‌కి సూచించడం జరిగింది. ప్రభుత్వం భాషా ప్రయుక్త రాష్ట్రాల నిర్మాణంలో జాప్యం చేయకూడదని, దానివలన వివిధ తరగతుల ప్రజలలో సత్సంబంధాలకు గండి పడుతుందని పార్టీ పేర్కొంది. 20 రాష్ట్రాల ఏర్పాటుకు నిర్దిష్ట సూచనలు చేసింది. 1954 సెప్టెంబర్ నాటికి కమిటీ మధ్యంతర రిపోర్ట్ ఇవ్వాలని డిమాండ్ చేసింది.

'రాజప్రముఖ్‌లకు, సంస్థానాధీశులకిచ్చే భత్తి, ఇదివరకటి రాజులకిచ్చే అన్ని సౌకర్యాలు 'రద్దు చేయాలనీ డిమాండ్ చేసింది. సంస్థానాధీశులు, రాజుల వద్ద ఉన్నవ్యక్తిగత ఆస్తులన్నీ ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని, వాటిని దేశ పునర్నిర్మాణానికి, అప్పులను తీర్చడానికి ఉపయోగించాలని డిమాండ్ చేసింది. భాష ప్రాతిపదికన ఏర్పడ్డ రాష్ట్రాలలో విద్య మాతభాషలో ఉండాలని కూడా డిమాండ్ చేసింది.

గిరిజన ప్రాంతాలను ఆయా ప్రాంతాలలోని గిరిజనుల భాష సంస్కతుల ఆధారంగా రాష్ట్రాలలో విలీనం చేయాలనీ కూడా డిమాండ్ చేసింది. ఆ ప్రాంతాలకు స్వయం ప్రతిపత్తిని కూడా ఇవ్వాలని డిమాండ్ చేసింది.

ప్రజల శక్తిని చిన్న చిన్న సరిహద్దుల తగాదాలతో కూరుకు పోకూడని, మొత్తం మీద భాషా ప్రయుక్త రాష్ట్రాల డిమాండ్‌కి కట్టుబడి ఉండాలని, గ్రామాన్ని ఒక యూనిట్‌గా పరిగణించాలని పిలుపునిచ్చింది. ఈ డిమాండ్ల పై పార్టీ కమిషన్‌కి ఒక విపులమైన నివేదిక అందచేసింది.

కేరళ, కర్ణాటక, మహారాష్ట్ర, గుజరాత్, తమిళనాడు రాష్ట్రాల ఏర్పాటును పార్టీ స్వాగతించింది. కానీ బంబాయిని ఒక కేంద్ర పాలిత ప్రాంతంగా ప్రతిపాదించడాన్ని విమర్శించింది. దానిని మహారాష్ట్ర నుండి విడగొట్టడాన్ని వ్యతిరేకించింది. అలాగే బీహార్‌ను బెంగాల్‌తో కలపడాన్ని కూడా వ్యతిరేకించింది. ఈ డిమాండ్లపై అనేక పోరాటాలు చేసింది. ఆ పోరాటాలలో అనేక మంది కార్యకర్తలు పోలీసుల దెబ్బలు తిన్నారు, అరెస్టు చేయబడ్డారు. ఈ నిరసనలలో ఆరుగురు కేంద్ర కమిటీ సభ్యులు అరెస్ట్ చేయబడ్డారు. కొన్ని ప్రదేశాలలో పోలీసులు కాల్పులు కూడా జరిపారు. ఈ కాల్పులలో అనేకమంది చనిపోయారు.

ఈ కాలంలో నెహ్రూ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు - భారతదేశ విదేశాంగ విధానం, పంచవర్ష ప్రణాళికలు- కాంగ్రెస్ పార్టీ మోసపూరిత 'సోషలిస్టు తరహా సమాజం' నిర్మించడం అనే పిలుపు- విశ్లేషించడంలో, పార్టీలో తీవ్రమైన చర్చ మొదలయింది. పార్టీ నాయకత్వంలోని ఒక తరగతి ఈ పిలుపులకు ఆకర్షితులై జాతీయ బూర్జువా వర్గం రెండుగా చీలిపోయింది - ఒకటి పూర్తిగా సామ్రాజ్య వాదులతో, భూస్వాములతో మిలాఖత్ అయి లంగిపోయిన గుత్తాధిపతుల తరగతి, రెండోది, నెహ్రూ ప్రాతినిధ్యం వహించే సామ్రాజ్యవాదాన్ని, భూస్వాములను వ్యతిరేకించే వామపక్ష వాదులమని చెప్పుకునే తరగతి. కేంద్ర కమిటీ వర్గ సామరస్య పంథాను తిరస్కరించినప్పటికీ ఈ వాదన కొనసాగుతూనే ఉన్నది.

1955 మార్చిలో జరిగిన ఎన్నికలలో ఆంధ్ర ప్రదేశ్ పార్టీ ఓడిపోయినా, తరువాత ఈ విభేధాలు మరింత తీవ్రతరమయ్యాయి. రాష్ట్రంలో పార్టీ గెలుస్తుందని అంచనా ఉండేది. పాలక వర్గాలు తీవ్రమైన దుష్ప్రచారాలు చేస్తున్నప్పటికీ, కాంగ్రెస్ పార్టీ విపరీతంగా భయభ్రాంతులను చేస్తూ, అసహ్యకమైన పావులు కదుపుతున్నప్పటికీ, ప్రజలనుండి వచ్చిన విశేష స్పందన, జరిగిన పెద్ద పెద్ద బహిరంగ సభలు, ప్రదర్శనలు, పార్టీ గెలుస్తుందన్నపొరపాటు అవగాహనను కలిగించాయి. కమ్యూస్టులను ఓడించడానికి ప్రభుత్వంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ డబ్బును విచ్చలవిడిగా ఖర్చు చేసింది. ఎన్నికల ఫలితాలు పార్టీని తీవ్రమైన దిగ్భ్రాంతికి గురిచేశాయి, నిరాశ పరిచాయి. చాలామంది సభ్యులు కేవలం అయిదు ఓట్ల కంటే తక్కువతేడాతో ఓడిపోయారు. 31% ఓట్లు వచ్చినా, పార్టీ కేవలం 7% సీట్లనే పొంద గలిగింది. దాదాపు వంద మంది కమ్యూనిస్టులకు ఎన్నికలలో 47% ఓట్లు వచ్చాయి. ఇందుకు భిన్నంగా కాంగ్రెస్ దాని మిత్ర పక్షాలు 74% సీట్లను సంపాదించాయి, కానీ 50% ఓట్లను మాత్రమే సంపాదించాయి.

(మిగతా 35వ పేజీలో)

# కరోనా సంక్షోభం

**న**రేంద్ర మోడీ నాయకత్వంలోని బిజెపి-ఆర్ఎస్ఎస్ ప్రభుత్వం భారత దేశాన్ని 'విశ్వ గురువు'గా మారుస్తుంది అని భావించిన వారందరికీ ఇప్పుడు తత్వం బోధపడి ఉంటుంది. ప్రపంచంలోనే కోవిడ్ కేసుల్లో, మరణాల్లో దేశాన్ని నెంబర్ 1 స్థానంలో నిలిపిందీ ప్రభుత్వం. కోవిడ్ మొదటి వెల్లువలో అతలాకుతలమైన అమెరికాలోగానీ, యూరప్‌లోగానీ చివరికి బ్రెజిల్, దక్షిణాఫ్రికా వంటి దేశాల్లోగానీ ఆక్సిజన్ అందక మరణించిన వారు లేరు. కానీ మోడీ ప్రభుత్వం ఆ విషయంలో కూడా మనల్ని నెంబర్ 1 స్థానంలో నిలబెట్టింది. సరైన సమయానికి తగిన ఆక్సిజన్ అందించి ఉంటే ఈ నాడు కోవిడ్ మరణాల్లో అత్యధిక శాతం నివారించబడి ఉండేవి. నిన్నటి వరకు భారత దేశాన్ని అగ్ర దేశాల సరసన నిలబెడుతున్నాం అని ప్రగల్భాలు పలికిన కుహనా దేశభక్తులకు నేడు అదుపులేకుండా పెరిగిపోతున్న కరోనా కేసులు, ఆక్సిజన్ అందక చనిపోతున్న రోగులు, ఆసుపత్రుల్లో పడకలు, వెంటిలేటర్లు లేక ఆక్రోసిస్తున్న ప్రజలు, చివరికి చనిపోయిన తరువాత శ్మశానాల్లో అంత్యక్రియలు చేయడానికి కూడా సదుపాయాలు లేని పరిస్థితులను చూసైనా జ్ఞానోదయం అవుతుందా?

మొదటి వెల్లవ వచ్చిన ఏడాది తరువాత కూడా కరోనా రెండవ వెల్లువకు దేశం ఎందుకు సిద్ధం కాలేకపోయింది? ప్రపంచానికంతటికీ వాక్సిన్ క్యాపిటల్‌గా మన దేశాన్ని కీర్తించిన నాయకమ్మన్యులు దేశ ప్రజలకు కనీస స్థాయిలో కావలసిన వ్యాక్సిన్‌లను ఎందుకు ఉత్పత్తి చేయలేకపోతున్నారు? ఈ ప్రశ్నలకు ప్రభుత్వం వద్ద, దాని సమర్థకుల వద్ద సరైన సమాధానాలు లేవు. కరోనా కలి నుండి ప్రజలను కాపాడగలిగే సామర్థ్యం దేశంలో ఉన్నప్పటికీ కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమవడానికి కారణం అది అనుసరిస్తున్న నయా-ఉదారవాద, మతోన్మాద విధానాలే. నయా-ఉదారవాదం ప్రజారోగ్య బాధ్యతలనుండి ప్రభుత్వం ఉపసంహరించుకుని దాన్ని ప్రయివేటు రంగానికి అప్పగించాలని నిర్దేశిస్తుంది. ప్రయివేటు రంగం లాభాల కోసం పనిచేస్తుందే తప్ప ప్రజాక్షేమం దానికి పట్టదు. నిజానికి ప్రజల్లో రోగాలు పెరిగితేనే దానికి లాభదాయకం. అందువల్ల అది రోగాలు రాకుండా నిరోధించదు, నిరోధించలేదు. మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న నయా-ఉదారవాద విధానాలే కరోనా కల్లోలం నుండి ప్రజలను కాపాడకుండా అడ్డుపడ్డాయి.

రెండోది, మతోన్మాదం నిండా తలకెక్కించుకున్న ప్రభుత్వాలకు ప్రజల ప్రాణాలు కాపాడ్డం కన్నా ప్రజలను మత ప్రాతిపదిక మీద సమీకరించడమే ప్రథమ ప్రాధాన్యమయింది. మోడీ ప్రభుత్వం రామ మందిరం, సెంట్రల్ విస్టా వంటి వాటి నిర్మాణం మీదా, కుంభమేళాల నిర్వహణ మీదా, భారీ విగ్రహాల మీదా పెట్టిన శ్రద్ధలో కనీస వంతు కరోనా నివారణ మీద పెట్టి ఉంటే నేడు దేశానికి ఈ దుస్థితి దాపురించేది కాదు. దీనికి తోడు కుహనా జాతీయవాద వాగాడంబరంతో ప్రజలను భ్రమల్లో ఉంచడానికి నిరంతరం ప్రయత్నిస్తూ వాస్తవాన్ని గుర్తించ నిరాకరించారు. దేశం మొత్తాన్ని కేంద్రీకృత పాలన కిందకు తేవడం ఆర్ఎస్ఎస్ లక్ష్యం. ఒకవైపు దేశంలో కరోనా విజృంభిస్తుంటే ప్రధాన మంత్రి, హోమ్ మంత్రి దృష్టి మొత్తాన్ని అయిదు రాష్ట్రాల ఎన్నికల మీద కేంద్రీకరించడం ఈ లక్ష్య సాధనకోసమే.

దారి తప్పుతున్న ప్రభుత్వాన్ని సరైన మార్గంలో పెట్టడంలో దేశంలోని ఉన్నత న్యాయస్థానాలు విఫలమయ్యాయి. పెద్ద ఎన్నికల సభలను నివారించడంలో ఎన్నికల సంఘం విఫలమయింది. కుంభ మేళాలు, ఎన్నికల సభలు, క్రికెట్ పోటీలు వంటి భారీ జనసమీకరణ కార్యక్రమాల వల్ల కరోనా విజృంభిస్తుందని ప్రభుత్వాన్నీ, ప్రజలనూ ముందస్తు హెచ్చరిండంలో మీడియా విఫలమయ్యింది. వెరసి ఈ దేశంలోని వ్యవస్థలన్నీ ప్రజలను రక్షించడంలో విఫలమయ్యాయి. ఆర్ఎస్ఎస్-బిజెపి పరివారం దేశంలోని రాజ్యాంగ వ్యవస్థలన్నిటినీ తన గుప్పెట్లో పెట్టుకోవడం వల్ల జరుగుతున్న నష్టమిది.

కరోనా వంటి మహమ్మారులు మళ్లీ మళ్లీ మానవాళి మీద దాడి చేస్తూనే ఉంటాయి. వాటిని తరిమికొట్టగలిగే శాస్త్ర-సాంకేతిక పరిజ్ఞానం, ఆర్థిక సామర్థ్యం మన దగ్గర ఉంది. ఆ సామర్థ్యాలను పూర్తిగా వినియోగంలో పెట్టాలంటే నయా-ఉదారవాద, మతోన్మాద మహమ్మారులను ముందుగా తరిమి కొట్టాలి. కరోనా సంక్షోభం మనకు నేర్పుతున్న పెద్ద గుణపాఠం అదే.

## ఈ సంచికలో...


1. పార్టీ అంతర్గత పోరాటం మొదలు ........ 2

2. పారిస్ కమ్యూన్ @ 150 : తొలి కార్మికవర్గ రాజ్యం అనుభవాలు, గుణపాఠాలు
ఎస్. వెంకట్రావు .......... 4

3. కోవిడ్ నివారణలో అన్ని వ్యవస్థల వైఫల్యం
దుష్యంత్ దావెతో కరన్ థాపర్ ఇంటర్వ్యూ...... 10

4. కమ్యూనిస్టు ఉద్యమ ఆటుపోట్లు: శాస్త్రీయ అవగాహన
తమ్మినేని వీరభద్రం ...... 14

5. శ్రామికుల శత్రువులెవరు?
ఎస్. వీరయ్య ....... 17

6. ఇనుప యుగం
ఎం. వి. ఎస్. శర్మ . 20

7. ప్రతిభ -సమర్థత : రిజర్వేషన్లు
ఎ. కోటిరెడ్డి....... 23

8. మహత్తర మేధావి ఫ్రెడరిక్ ఏంగెల్స్
వి.జ లెనిన్ ............. 28



సంపాదకుడు:

ఎస్. వెంకట్రావు

సంపాదక వర్గం:

పాటూరు రామయ్య

బి.వి. రాఘవులు

తమ్మినేని వీరభద్రం

ఎస్. వీరయ్య

తెలకపల్లి రవి

భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు)
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ తరపున

ప్రచురణ కర్త, ముద్రాపకుడు: బి.వి.రాఘవులు
సంపాదకుడు : ఎస్. వెంకట్రావు
ఫోన్: ఎడిటర్ : 9490099333

ముద్రణ: ప్రజాశక్తి ప్రింటర్స్ అండ్ పబ్లిషర్స్ ప్రై. లి., 14-12-19, కృష్ణనగర్, తాడేపల్లి(మ), గుంటూరు(జి)
మేనేజర్: కె.హరికిషోర్: 9490098977
email:venkataraosankarapu@gmail.com
email:marxistap@gmail.com

ఈ మాసం ముఖ్యాంశం

## ప్యారిస్ కమ్యూన్ @150

# తొలి కార్మికవర్గ రాజ్యం అనుభవాలు, గుణపాఠాలు


రచయిత 'మార్క్సిస్టు' సంపాదకులు

**ఎస్ వెంకట్రావు**

మానవ జాతి చరిత్రలో మొట్టమొదటి కార్మికవర్గ రాజ్యం ఏర్పడి ఈ ఏడాదికి 150 ఏళ్లు పూర్తవుతున్నాయి. ఫ్రాన్స్ రాజధాని పారిస్‌లో విప్లవం ద్వారా 1871 మార్చి 18న ఏర్పడిన కార్మికవర్గ రాజ్యాన్ని 'పారిస్ కమ్యూన్' అని పిలిచారు. యూరప్‌లో అనేక విప్లవాల ద్వారా అనుభవం గడించిన కార్మికవర్గం చివరికి పారిస్‌లో అధికారం చేజిక్కించుకుని 72 రోజుల పాటు పరిపాలన సాగించింది. బూర్జువా వర్గం సాగించిన విప్లవ-ప్రతీఘాత అంతర్యుద్ధంలో ఓటమిపాలు కావడంతో 1871 మే 28వ తేదీన పారిస్ కమ్యూన్ పతనం అయింది. కొద్దికాలమే సాగిన పారిస్ కమ్యూన్ ప్రపంచ విప్లవోద్యమాలకు అనేక విలువైన అనుభవాలను అందించింది. కారల్ మార్క్స్ సూచించిన విధంగా పారిస్ కమ్యూన్ ఏర్పడిన రోజున కాకుండా అది పతనమైన రోజున ఆ మహత్తర ప్రయోగం అందించిన అనుభవాలనూ, గుణపాఠాలనూ నెమరువేసు కోవడం జరుగుతోంది. పారిస్ కమ్యూన్ 150 వార్షికాన్ని కూడా అంతర్జాతీయంగా మే 28 జరుపుకుంటున్నారు. ఈ సందర్భంగా కమ్యూన్ పై చర్చలు, గోష్టులు జరుగుతున్నాయి. అంతర్జాతీయ స్థాయిలో వామపక్ష ప్రచురణకర్తలు పారిస్ కమ్యూన్‌పై ప్రచురించిన పుస్తకాన్ని ఈ ఏడాది మే 28న అనేక భాషల్లో విడుదల చేస్తున్నారు. తెలుగులో ఈ పుస్తకాన్ని ప్రజాశక్తి బుక్‌హౌస్, నవతెలంగాణా ప్రచురణ సంస్థ అదే రోజు సంయుక్తంగా విడుదల చేస్తున్నాయి. అన్ని భాషల్లోని పుస్తకాల్లో ఒకే రకమైన విషయం ఉండడమే కాదు ఒకే రకమైన ముఖ చిత్రం, ఒకే రకమైన లే-ఔట్ ఉంటుంది.

ఈ సందర్భంగా ప్యారిస్ కమ్యూన్ చరిత్ర, అది అందించిన అనుభవాలు, గుణపాఠాలను గురించి రేఖా మాత్రంగా తెలుసుకుందాం!

### పూర్వరంగం

1848 ఫ్రాన్స్‌లో జరిగిన విప్లవాన్ని అణచివేసిన తరువాత 1851 డిసెంబర్ 2న జరిగిన కుట్ర ద్వారా నెపోలియన్-3 అధికారంలోకి వచ్చాడు. ఏడాది తరువాత అతను తనకు తాను ఫ్రెంచ్ చక్రవర్తిగా ప్రకటించుకున్నాడు. నెపోలియన్-3 ఫ్రాన్స్‌లోని బడా-బూర్జువా వర్గం, బడా-భూ స్వాములు, క్యాథలిక్ చర్చికి ప్రాతినిధ్యం వహించాడు. 1850, 60 రెండు దశకాలు ఆయన నిరంకుశ పాలన కొనసాగింది. విదేశాంగ విధానంలో నెపోలియన్-3 వైఫల్యాలు ఫ్రెంచ్ బూర్జువా వర్గంలో అతని పట్ల వ్యతిరేకత పెంచాయి. ముఖ్యంగా జర్మనీని ఐక్య పరిచేందుకు ప్రష్యా చేస్తున్న ప్రయత్నాలను ఆయన నిలువరించలేక పోవడం, 1860లో ఫ్రాన్స్ బూర్జువా వర్గానికి నష్టదాయకమైన వాణిజ్య ఒప్పందాన్ని బ్రిటన్‌తో కుదుర్చుకోవడం ఫ్రెంచ్ బూర్జువా వర్గంలో అసంతృప్తిని రగిల్చింది.

పన్నులు, రుణ భారంతో ఫ్రెంచ్ రైతాంగం పూర్తిగా దివాళా తీసింది. వారు అసంతృప్తితో రగిలిపోతున్నారు. కార్మికవర్గం తీవ్రమైన నిరుద్యోగం, పేదరికంలో మునిగిపోయింది. దీనికి తోడు ధరలు పెరగడం, ఇంటద్దెలు పెద్ద ఎత్తున పెంచడంతో నిరసన తారాస్థాయికి చేరుకుంది. కార్మికులు రోజుకు 12 నుండి 16 గంటలు పనిచేసినా పూటగడిచేది కాదు. దాంతో ఫ్రాన్స్‌లోని అనేక నగరాల్లో కార్మికుల సమ్మెలు వెల్లువెత్తాయి. నిరసనలు అణచివేయడానికి నెపోలియన్ ప్రభుత్వం తీవ్ర నిర్బంధాలకు పూనుకుంది. అయినా నిరసనలు ఆగకపోగా ఇంకా పెరిగాయి. రాచరికపాలన అంతం కావాలని, "రిపబ్లిక్ వర్ధిల్లాలి" అంటూ దేశమంతటా కార్మిక ప్రజలు ప్రదర్శనలు ప్రారంభించారు. 1870 జనవరిలో పారిస్ నగరంలో 2 లక్షల మందితో బ్రహ్మాండమైన ప్రదర్శన జరిగింది.

### ఫ్రాంకో - ప్రష్యన్ యుద్ధం

దిగజారిపోతున్న తన ప్రతిష్టను పునరుద్ధరించుకోడానికి నెపోలియన్ ప్రష్యాతో (ప్రష్యా అనేది జర్మన్ రాజ్యం. 1932లో జర్మనీలో విలీనమైంది) యుద్ధానికి దిగాడు. యుద్ధంలో గెలిస్తే ప్రష్యా నాయకత్వంలో జర్మనీ విలీనాన్ని నివారించవచ్చు, తద్వారా ఫ్రెంచ్ ప్రజల్లో పోతున్న తన ప్రతిష్టను పునరుద్ధరించుకోవచ్చున్నది నెపోలియన్ భావన. ప్రష్యన్ రాచరికానికి నాయకత్వం వహిస్తున్న ఓట్టో వాన్ బిస్మార్క్ కూడా యుద్ధం కోసం వేచి చూస్తున్నాడు. ఫ్రాన్స్‌తో యుద్ధంలో గెలిస్తే ప్రష్యాకు ఇతర జర్మన్ రాజ్యాలపై ఆధిపత్యం లభిస్తుంది, రెండోవైపు దేశంలోని ప్రజల అసంతృప్తిని అణచివేయడం సులువవుతుంది. అందువల్ల ఇటు ఫ్రాన్స్, అటు ప్రష్యా పాలక వర్గాలు రెండూ యుద్ధాన్ని కాంక్షిస్తున్నాయి.

ఇలాంటి పరిస్థితుల్లో 1870 జులై 19న నెపోలియన్ ప్రష్యాపై యుద్ధం ప్రకటించాడు. నిజానికి ఫ్రాన్స్ తొలుత యుద్ధానికి దిగినా దాని సైనిక బలం ప్రష్యాకన్నా తక్కువే. పైగా అంతర్జాతీయ పరిస్థితులు కూడా ఫ్రాన్స్‌కు అనుకూలంగా లేవు. ఫ్రాన్స్ ప్రత్యర్థి అయిన బ్రిటన్, ప్రష్యాకు అనుకూలంగా ఉంది. జారిస్టు రష్యా కూడా ప్రష్యా పక్షాన నిలిచింది. తన అంతర్గత విషయాల్లో ఫ్రాన్స్ జోక్యాన్ని సహించని ఇటలీ కూడా ఫ్రాన్స్‌పై పగ తీర్చుకోడానికి సమయం కోసం వేచి చూస్తోంది. ఆ విధంగా ఫ్రాన్స్ అంతర్జాతీయంగా ఒంటరి పాటై ఉంది. ఇలాంటి సమయంలో అది ప్రష్యాపై దాడి చేయడం ద్వారా దురాక్రమణ దారుగా కూడా అప్రతిష్ట మూటగట్టుకుంది.

### ఫ్రాన్స్ ఓటమి

తన బలాన్ని చాలా పెద్దగా ఊహించుకుని యుద్ధంలోకి దిగిన ఫ్రాన్స్ ఘోరంగా ఓడిపోయింది. ఫ్రెంచ్ సైన్యానికి యుద్ధం చేయడానికి కావలసిన సదుపాయాలు లేవు. వ్యూహం లేదు. చివరికి కేంద్రీకృత నాయకత్వం కూడా లేదు. సైనిక బలంలోనూ, యుద్ధ వ్యూహం, ఎత్తుగడల్లోనూ, నాయకత్వ పటిమలోనూ ఫ్రాన్స్ కన్నా అన్ని విధాలా మెరుగైన ప్రష్యా

యుద్ధంలో ఫ్రాన్స్‌పై మొదటి నుండీ పై చేయి సాధించింది. ఫ్రెంచ్ సైనికులు ఎంతో వీరోచితంగా పోరాడినప్పటికీ అది ఓటమి మీద ఓటమిని ఎదుర్కొంది. తొలుత 'మెట్జ్' కోటలో ఫ్రెంచ్ సైన్యాన్ని ప్రష్యన్లు చుట్టు ముట్టారు. సెడాన్‌లో పోరాటానికి నెపోలియన్ స్వయంగా నాయకత్వం వహించాడు. అయినా అక్కడ వారికి ఓటమి తప్పలేదు. 1870 సెప్టెంబర్ 2న ఫ్రెంచ్ సైన్యం ఘోరంగా ఓడిపోయింది. మిగిలిన సైన్యంతో నెపోలియన్ సెడాన్ కోటలో చిక్కుకుపోయారు. అక్కడి సైన్యం ప్రష్యన్లను ఎదిరించే ధైర్యం చేయలేకపోయారు. దాంతో నెపోలియన్ తెల్ల జెండా ఎత్తి లొంగిపోయాడు. దాంతో నెపోలియన్ చక్రవర్తినీ, లక్ష మంది సైన్యాన్ని ప్రష్యన్లు యుద్ధ ఖైదీలుగా బంధించారు.

**1870 సెప్టెంబర్ 4 విప్లవం**

సెడాన్‌లో ఫ్రెంచ్ సైన్యాల ఓటమి, నెపోలియన్ లొంగుబాటు వార్త విన్న పారిస్ నగర ప్రజలు ఆగ్రహంతో రగిలిపోయారు. ప్రజలు వీధుల్లోకి వచ్చి నెపోలియన్ పాలనపై తిరుగుబాటు చేశారు. 1970 సెప్టెంబర్ 4న పారిస్ నగర ప్రజలు పెద్ద సంఖ్యలో పార్లమెంటు భవనానికి ప్రదర్శనగా వెళ్లారు. చక్రవర్తి పాలనను అంతం చేసి ఫ్రెంచ్ రిపబ్లిక్‌గా ప్రకటించాలని, దేశాన్ని విదేశీ ముట్టడి నుండి రక్షించుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజల ఒత్తిడితో పార్లమెంటు రాచరికాన్ని రద్దు చేసింది. పారిస్ నగరంలోని 'హోటల్ డి విల్లె' ఎదుట వేల సంఖ్యలో హాజరైన ప్రజల సమక్షంలో ఫ్రాన్స్‌ను రిపబ్లిక్‌గా ప్రకటించారు. దానికి "జాతీయ రక్షణ ప్రభుత్వం" అని పేరు పెట్టారు. ఈ జాతీయ రక్షణ ప్రభుత్వంలో ప్రధానంగా బూర్జువా రాజకీయ వేత్తలు ఉన్నారు. రాచరికవాదులు, వారితో ఒప్పందానికి వచ్చిన రిపబ్లికన్ పార్టీ నాయకులతో ప్రభుత్వం ఏర్పడింది. ఆ విధంగా సెప్టెంబర్ 4న విప్లవంలో ఫ్రాన్స్ ప్రభుత్వ నాయకత్వాన్ని బూర్జువా వర్గం చేజిక్కించుకుంది. ప్రజల ఒత్తిడితో బూర్జువా నాయకులు దేశాన్ని రిపబ్లిక్కుగా ప్రకటించారు. అందువల్ల ఈ విప్లవాన్ని బూర్జువా ప్రజాతంత్ర విప్లవంగా పరిగణించవచ్చు.

ఫ్రాన్స్ ఓటమి, బూర్జువా ప్రజాతంత్ర విప్లవం మొత్తం ఫ్రాంకో - ప్రష్యన్ యుద్ధ స్వభావాన్నే మార్చేశాయి. అప్పటి వరకు జర్మనీ ఐక్యత కోసం పోరాడుతున్న ప్రష్యాపై ఫ్రాన్స్ దండెత్తింది. కానీ ఫ్రాన్స్ ఓడిపోయిన తరువాత జర్మనీ విలీనం కోసం ప్రష్యా చేసే ప్రయత్నాలకు అడ్డంకులు తొలగిపోయాయి. అయితే జర్మన్

> **"ప్రజల నుండి వచ్చిన ఒత్తిడితో బూర్జువా ప్రభుత్వం కార్మికులకు ఆయుధా లిచ్చింది. కార్మికులు, వృత్తిదారులు, చిన్నస్థాయి అధికారులు, ఉద్యోగులతో 200 సాయుధ కార్మికవర్గ రక్షణ దళాలు ఏర్పడ్డాయి. ఈ దళాలను 'నేషనల్ గార్డ్స్' దళాలు అన్నారు. నేషనల్ గార్డుల్లో సుమారు 3 లక్షల మంది కార్మికులు, వృత్తిదారులు రిక్రూట్ అయ్యారు."**




**1871 మార్చి 18న పారిస్ నగరాన్ని ఆక్రమించుకున్న కార్మికవర్గ 'నేషనల్ గార్డులు'**

భూస్వామ్య, బూర్జువా వర్గాల ఒత్తిడితో ప్రష్యా యుద్ధాన్ని కొనసాగించింది. ఫ్రాన్స్‌కు చెందిన అల్సాస్ - లోరైన్ భూభాగాన్ని దురాక్రమణ చేయడానికి పూనుకుంది. దాంతో ప్రష్యన్లు దురాక్రమణదారులుగా మారారు. ఫ్రెంచ్ రిపబ్లిక్ ప్రజలు దేశ రక్షణ పోరాటాన్ని మొదలుపెట్టారు.

**పారిస్‌ను ముట్టడించిన ప్రష్యన్ సైన్యం**

సెడాన్‌లో నెపోలియన్ -3 సైన్యం ఓడిపోవడంతో ఫ్రెంచ్ రాజధానికి మార్గం తెరుచుకుంది. దాంతో ప్రష్యా సేనలు పారిస్ నగరం వైపు పురోగమించాయి. సెప్టెంబర్ 7వ తేదీన అవి పారిస్‌ను దిగ్బంధించాయి. దేశం పరాయి పాలకుల స్వాధీనం అవుతుందన్న ఆందోళనతో పారిస్ కార్మికవర్గం దేశ రక్షణ కోసం తమకు ఆయుధాలు ఇవ్వాలని డిమాండ్ చేసింది. ప్రజల నుండి వచ్చిన ఒత్తిడితో బూర్జువా ప్రభుత్వం కార్మికులకు ఆయుధాలిచ్చింది. కార్మికులు, వృత్తిదారులు, చిన్నస్థాయి అధికారులు, ఉద్యోగులతో 200 సాయుధ కార్మికవర్గ రక్షణ దళాలు ఏర్పడ్డాయి. ఈ దళాలను 'నేషనల్ గార్డ్స్' దళాలు అన్నారు. నేషనల్ గార్డుల్లో సుమారు 3 లక్షల మంది కార్మికులు, వృత్తిదారులు రిక్రూట్ అయ్యారు. అప్పటికే నెపోలియన్ - 3కి చెందిన బూర్జువా వర్గంతో ఏర్పడి ఉన్న 60 రెగ్యులర్ దళాలకు ఈ 200 కార్మికవర్గ దళాలు తోడయ్యాయి. బూర్జువా వర్గ రెగ్యులర్ దళాలకు జనరల్ ట్రోచు నాయకత్వం వహించాడు. కార్మికవర్గ 'నేషనల్ గార్డ్స్' దళాలు దేశ రక్షణ కోసం ఉద్యుక్తమయ్యాయి. రైతులు, మేధావులు కూడా వారికి తోడయ్యారు. "ప్రతి ఇల్లూ ఒక సైనికుని ఇవ్వాలి... ప్రతి పట్టణం ఒక సైన్యం కావాలి... గ్రామాలు ములుగర్రలు అందుకోవాలి... మనం రాత్రీ పగలు యుద్ధం చేయాలి. పర్వతాల్లో, అడవుల్లో, పొలాల్లో అన్నింటా మన యుద్ధం జరగాలి..." అని ప్రముఖ ఫ్రెంచ్ రచయిత విక్టర్ హ్యూగో ఫ్రాన్స్ ప్రజలకు పిలుపునిచ్చాడు. ఈ పిలుపు ఫ్రాన్స్ అంతా మార్మోగింది. ప్రష్యా ఆక్రమించిన భూభాగాలన్నిటా ఫ్రెంచ్ ప్రజలు దేశ రక్షణ దళాల్లో చేరారు.

**బూర్జువా ప్రభుత్వ దేశ ద్రోహం**

ఒకవైపు ఫ్రెంచ్ ప్రజలు ఆయుధాలు పట్టుకుని దేశాన్ని రక్షిస్తూ ఉంటే మరోవైపు వారి

> **ఆనాడు సుమారు 20 లక్షల జనాభా ఉన్న పారిస్ నగరంలో మొత్తం 20 వార్డులుండేవి. 20 వార్డుల్లో కార్మికులు, వృత్తిదారులు కలిసి 'రక్షణ కమిటీల్ని' ఎన్నుకున్నారు. ఈ రక్షణ కమిటీల ప్రతినిధులు ఒక కేంద్ర కమిటీని ఎన్నుకున్నారు. ఆ విధంగా పారిస్ నగర ప్రజలు ప్రభుత్వ విద్రోహ చర్యలపై కన్నేసి ఉంచడానికి సొంత విప్లవ సంస్థను ఏర్పాటు చేసుకున్నారన్నమాట.**

పరిస్థితి దారుణంగా తయారైంది. శత్రువు ముట్టడిలో ఉన్న పారిస్ నగరంలో ప్రజలు బయట నుండి ఆహారం, సరుకులు అందక తీవ్రమైన చలిలో ఆకలి చావులకు గురయ్యారు. ముఖ్యంగా అనేక మంది పిల్లలు చనిపోయారు. కానీ నగరంలోని కులీన వర్గాలు నివసించే ప్రాంతాల్లో మాత్రం విందులు, వినోదాలు యథాతథంగా సాగుతుండేవి.

1870 డిసెంబర్‌లో ప్రష్యా సైన్యం పారిస్ నగరంపై ఫిరంగి గుళ్లు కురిపించడం ప్రారంభించింది. కార్మికవర్గ దళాలు నగర రక్షణకు నడుం కట్టాయి. కార్మికుల దేశభక్తిని చూసి బూర్జువా శక్తులు భయపడ్డాయి. ఇప్పుడు శత్రువుమీద ఎక్కుపెట్టబడ్డ ఆ తుపాకులు రేపు తమను దోపిడీ చేస్తున్న బూర్జువాల మీద ఎక్కుపెట్టబడవన్న నమ్మకమేమిటి?

నిజానికి ఒక శతాబ్దం క్రితం, 1789లో ఫ్రెంచ్ విప్లవం తరువాత బూర్జువా వర్గం అధికారం చేపట్టినప్పటి నుండీ అది కార్మికుల మిలిటెన్సీ పట్ల భయపడుతూనే ఉంది. ఫ్యూడల్ దోపిడీ పోయి బూర్జువా దోపిడీ రావడం మినహా ఫ్రెంచ్ బూర్జువా విప్లవంతో కార్మివర్గానికీ, రైతాంగానికీ ఒనగూడిన ప్రయోజనం ఏమీ లేదు. ఆ తరువాత ఫ్రాన్స్‌లో జరిగిన విప్లవ పోరాటాలన్నిటిలోనూ బూర్జువా వర్గం కార్మికుల, రైతాంగ సహాయం తీసుకోవడం విఘ్నానంతరం ఆ పోరాటాలు మరింత ముందుకు పోకుండా అణచివేయడం చేస్తూ వచ్చింది.

ఇప్పుడు కూడా ఫ్రెంచ్ బూర్జువాలు అదే బాటపట్టారు. 'జాతీయ రక్షణ ప్రభుత్వం' పేరుతో ఉన్న ఫ్రెంచ్ బూర్జువా ప్రభుత్వం కార్మికవర్గానికి వ్యతిరేకంగా శత్రుదేశంతో ఒప్పందం చేసుకోడానికి సిద్ధమైంది. దాంతో ప్రజలు ప్రభుత్వానికి వ్యతిరేకంగా తిరగబడ్డారు. ఇది జాతీయ రక్షణ ప్రభుత్వం కాదు 'జాతీయ విద్రోహ ప్రభుత్వం' అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆనాడు సుమారు 20 లక్షల జనాభా ఉన్న పారిస్ నగరంలో మొత్తం 20 వార్డులుండేవి. 20 వార్డుల్లో కార్మికులు, వృత్తిదారులు కలిసి 'రక్షణ కమిటీల్ని' ఎన్నుకున్నారు. ఈ రక్షణ కమిటీల ప్రతినిధులు ఒక కేంద్ర కమిటీని ఎన్నుకున్నారు. ఆ విధంగా పారిస్ నగర ప్రజలు ప్రభుత్వ విద్రోహ చర్యలపై కన్నేసి ఉంచడానికి సొంత విప్లవ సంస్థను ఏర్పాటు చేసుకున్నారన్నమాట.

### ప్రజల కార్యక్రమం

పారిస్‌లోని 20 వార్డు కమిటీల ప్రతినిధులతో ఏర్పడిన కేంద్ర కమిటీ ప్రజా డిమాండ్లతో కూడిన ఒక కార్యక్రమాన్ని రూపొందించింది. ఈ డిమాండ్లను పోస్టర్లు వేసి పారిస్ నగరమంతటా అతికించారు. బహిరంగ సభల్లో వాటిపై చర్చించడం ప్రారంభించారు. పోలీసు వ్యవస్థను రద్దు చేసి దాని కార్యకలాపాలను ప్రజలకు బదిలీ చేయాలనీ, అధికారులను నియమించడం కాకుండా ప్రజలే ఎన్నుకోవాలనీ, సరిగ్గా పనిచేయని వారిని వెనక్కు పిలిపించే విధానం ఉండాలనీ, పత్రికా స్వేచ్ఛ, భావప్రకటనా స్వేచ్ఛ, సభలు, సమావేశాలు జరిపే స్వేచ్ఛ, సంఘాలను ఏర్పాటు చేసుకునే స్వేచ్ఛ కావాలని కార్యక్రమం డిమాండ్ చేసింది. ఆహారాన్ని ప్రజలందరికీ న్యాయవంతంగా పంచాలని డిమాండ్ చేసింది. ఈ కార్యక్రమం ఆధారంగా 'ప్యారిస్ కమ్యూన్' ఏర్పడాలన్న డిమాండ్ వెల్లువెత్తింది. ప్రభుత్వ విద్రోహాన్ని వారు తీవ్రంగా ఖండించారు. 'మీరు తప్పుకోండి ప్రజలే చూసుకుంటారు!' అని పోస్టర్లలో డిమాండ్ చేశారు.

ప్రజలు నిరసిస్తున్నా బూర్జువా పభుత్వం విద్రోహ చర్యలు మానుకోలేదు. అక్టోబర్‌లో మార్షల్ బజైన్ 'మెట్జ్' నగరాన్ని ప్రష్యన్లకు అప్పగించాడు. దాంతో పాటు 1.6 లక్షల మంది ఫ్రెంచ్ సైన్యాన్ని కూడా శత్రువుకు అప్పగించాడు. ఈ విద్రోహ చర్య ఫ్రెంచ్ ప్రజల్లో ఆగ్రహావేశాలు రగిల్చింది. అక్టోబర్ 31నాడు పారిస్ నగరానికి చెందిన వేలాది మంది కార్మికులు, వృత్తిపుణులు హోటల్ డి విల్లెకి పెద్ద ఎత్తున ప్రదర్శనగా వెళ్లారు. జోరున కురుస్తున్న వర్షాన్ని కూడా లెక్క చేయకుండా వారు జనరల్ ట్రోచుకు, విద్రోహ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు ఇచ్చారు. 'కమ్యూన్ వర్ధిల్లాలి' అంటూ ప్రజలు హోటల్ డి విల్లె లోకి చొచ్చుకుపోయారు. ప్రభుత్వం రాజీనామా చేసి కార్మికుల నాయకత్వంలోని కమ్యూన్‌ను ప్రకటించాలని డిమాండ్ చేశారు. ప్రదర్శనల్లోనూ, కమ్యూన్ కార్యక్రమ ప్రకటనలోనూ కారల్ మార్క్స్, ఫ్రెడరిక్ ఏంగెల్స్‌ల నాయకత్వంలోని మొదటి కార్మికవర్గ ఇంటర్నేషనల్ (ఫస్ట్ ఇంటర్నేషనల్)కు చెందిన పలువురు నేతలు చురుకుగా పాల్గొన్నారు. వారిలో లూయిస్ వర్లిన్, లియో ఫ్రాంకెల్ ముఖ్యులు. వీరితోబాటు లూయిస్ ఆగస్టె బ్లాంకి, పెలిక్స్ ప్యాట్, లూయిస్ చార్లెస్ డెలెస్‌క్లూజ్ తదితరుల నేతృత్వంలోని సోషలిస్టు గ్రూపులు కూడా సాయుధ ప్రదర్శనల్లో పాల్గొన్నాయి. అయితే ఈ ప్రజా వెల్లువను ప్రభుత్వ దళాలు ఎలాగోలా చల్లార్చగలిగాయి. మళ్లీ 1871 జనవరి 22న 'జాతీయ విద్రోహ' ప్రభుత్వాన్ని కూల్చి కమ్యూన్ ఏర్పాటు చేయడానికి మరో ప్రయత్నం జరిగింది. ప్రభుత్వం దీన్ని కూడా అణచివేసింది. ప్రభుత్వ దళాలు జరిపిన కాల్పుల్లో ఆరుగురు ప్రదర్శకులు మరణించారు. అనేక మందిని జైళ్లలో పెట్టారు. విప్లవకారుల నేతృత్వంలో నడుస్తున్న రెండు పత్రికలు 'లి రివీల్', 'లి కంబాట్' లను ప్రభుత్వం నిషేధించింది.

### శత్రువుతో రహస్య ఒప్పందం – ఎన్నికలు

శత్రువుతో సంధి కుదుర్చుకోడానికి ఫ్రెంచ్ జాతీయ అసెంబ్లీ (పార్లమెంటు)లో మితవాద నాయకుడైన అడోల్ఫ్ థియర్స్ 1870 సెప్టెంబర్, అక్టోబర్ నెలల్లో విశ్వ ప్రయత్నాలు చేశాడు. బ్రిటన్, రష్యా, ఆస్ట్రియాల్లో పర్యటించాడు. చివరికి నవంబర్ 1న ప్రష్యా ఛాన్సలర్ బిస్మార్క్‌ను కలుసుకున్నాడు. ఫ్రాన్స్‌కు చెందిన అల్సాస్ ప్రాంతాన్ని, లోరైన్‌లోని ప్రాంతాలను ప్రష్యాకు దారాదత్తం చేయడంతోపాటు, పెద్ద ఎత్తున నష్టపరిహారం చెల్లించాలని బిస్మార్క్ డిమాండ్ చేశాడు. చివరికి విద్రోహ ప్రభుత్వం 1871 జనవరి 28న ప్రష్యాతో రహస్య సంధి చేసుకుంది. వెనువెంటనే ఫ్రాన్స్‌లో ఎన్నికలకు పిలుపునిచ్చింది. ఫ్రెంచ్ గ్రామీణ ప్రాంత రైతాంగ వెనుకబాటును ఉపయోగించుకుని చర్చి వారిని ప్రభావితం చేయగలిగింది. ఒకవైపు చర్చి ప్రభావంతో గ్రామీణ ప్రాంతాలు, మరోవైపు విద్రోహ ప్రభుత్వంతో చేతులు కలిపిన ప్రష్యన్ల ప్రభావంతో ఆక్రమిత ప్రాంత ప్రజలు మితవాద అభ్యర్థులను పెద్ద ఎత్తున గెలిపిం

చారు. అందువల్ల ఫ్రెంచ్ జాతీయ అసెంబ్లీలోని 700 మంది సభ్యుల్లో 450 మంది రాచరిక వాదులు గెలుపొందారు. కొత్తగా ఎన్నికైన జాతీయ అసెంబ్లీ పచ్చి మితవాద నాయకుడైన థయర్స్ నేతృత్వంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. ఈ థయర్స్ అనేవాడు 1830లో పారిస్‌లో జరిగిన ప్రజా తిరుగుబాటుదారులపై కాల్పులు జరపడం ద్వారా తన రాజకీయ జీవితాన్ని ప్రారంభించాడు.

కొత్త ప్రభుత్వం విప్లవ పారిస్‌కు దూరంగా బోర్డాక్స్ నగరంలో ఏర్పాటైంది. తరువాత తన పీఠాన్ని వెర్సయిల్స్ నగరానికి మార్చింది. వెర్సయిల్స్‌లో కొలువుతీరిన బూర్జువా ప్రభుత్వం అక్కడి నుండి పారిస్ నగరంలోని నేషనల్ గార్డు దళాలమీద దాడి చేసి విప్లవ కార్మికవర్గాన్ని అణచివేయడానికి ప్రణాళికలు రచించింది. నేషనల్ గార్డులకు జీతాలు ఇవ్వకూడదని ఆదేశం జారీ చేసింది. పారిస్ దిగ్బంధనం సమయంలో రద్దు చేసిన ప్రజల ఇంటి అద్దెలను తిరిగి పునరుద్ధరించాలని ఆదేశించింది. అంటే అప్పటికే ఆకలి బాధలతో ఉన్న కార్మికులకు ఇళ్లు లేకుండా చేయాలని నిర్ణయించింది. పారిస్‌లో నడుస్తున్న ప్రజాతంత్ర పత్రికలను ప్రభుత్వం నిషేధించింది. విప్లవ నాయకులను అరెస్టు చేయడం ప్రారంభించింది. పారిస్ కార్మికులను ఈ చర్యలు భయపెట్టకపోగా వారిలో విప్లవేచ్ఛను పెంపొందించాయి. 1871 ఫిబ్రవరిలో నేషనల్ గార్డు దళాల ప్రతినిధులు సమావేశమై కేంద్ర కమిటీని ఎన్నుకున్నారు. ఈ కమిటీ పారిస్ రక్షణ కోసం పోరాడాలని ప్రజలకు పిలుపునిచ్చింది.

### 1871 మార్చి 18 కార్మికవర్గ విప్లవం

నేషనల్ గార్డు దళాలను నిరాయుధులను చేయడానికి థయర్స్ ప్రభుత్వం ప్రయత్నించడంతో విప్లవం ప్రారంభమైంది. 'మాంట్‌మార్టె' అనే ఎత్తైన ప్రదేశంలో పారిస్ రక్షణ కోసం కార్మికులు తమ సొంత నిధులతో సమకూర్చుకున్న ఫిరంగులను స్వాధీనం చేసుకోవడానికి థయర్స్ ప్రభుత్వం మార్చి 17 రాత్రి సైన్యాన్ని పంపింది. కార్మికులకు చెందిన నేషనల్ గార్డు దళాల ఆధీనంలో ఈ ఫిరంగులు ఉన్నాయి. డ్యూటీలో ఉన్న నేషనల్ గార్డులపై చీకటిలో సైన్యం కాల్పులతో విరుచుకుపడింది. అనేక మంది చనిపోయారు. కానీ సైన్యం ప్రయత్నాలు ఫలించలేదు. 'మాంట్‌మార్టె' కార్మికులు స్త్రీ, పురుషులు వీరోచితంగా పోరాడి సైన్యాన్ని అడ్డుకున్నారు. ఒక కార్మికుడు పేల్చిన ఫిరంగి శబ్దంతోనూ, గంటల మోత తోనూ మార్చి 18న పారిస్ నగరం మేల్కొంది. నేషనల్

> **❝ మార్చి 18 మధ్యాహ్నానికి నేషనల్ గార్డు కేంద్ర కమిటీ సమావేశమై పారిస్ నగర కేంద్రాన్ని స్వాధీనం చేసుకోవాల్సిందిగా పిలుపునిచ్చింది. సాయంత్రానికి నేషనల్ గార్డులు నగరంలోని ప్రభుత్వ కార్యాలయాలన్నిటినీ ఆక్రమించాయి. హోటల్ డి విల్లె మీద ఎర్ర జెండా ఎగురవేశారు. పారిస్ నగరం కార్మికవర్గం కైవశమైంది. చరిత్రలో మొట్టమొదటి సారి 1871 మార్చి 18న కార్మికవర్గ విప్లవం జయప్రదమైంది. చరిత్రలో మొట్టమొదటి కార్మిక రాజ్యం - పారిస్ కమ్యూన్ ఏర్పడింది. ❞**



అడోల్ఫ్ థయర్స్

గార్డుల నేతృత్వంలో 'మాంట్‌మార్టె', 'బెల్లివిల్లె' ప్రాంతాల కార్మికులు వేల సంఖ్యలో కిందికి దిగి పారిస్ నగరం నడిబొడ్డుకు నడవడం ప్రారంభించారు. నగర శివారులోని సెంట్ ఆంటోనియో ప్రాంత ప్రజలు కూడా వారిని కలిశారు. తిరుగుబాటుదారులు మహోగ్ర రూపంలో నడుస్తూ మార్గ మధ్యంలో తమను అడ్డుకోడానికి వచ్చిన పోలీసులను నిరాయుధులను చేసి నెట్టుకుంటూ పోయారు. మార్చి 18 మధ్యాహ్నానికి నేషనల్ గార్డు కేంద్ర కమిటీ సమావేశమై పారిస్ నగర కేంద్రాన్ని స్వాధీనం చేసుకోవాల్సిందిగా పిలుపునిచ్చింది. మధ్యాహ్నం రెండు గంటల కల్లా నేషనల్ గార్డులు నగరంలోని రైల్వే స్టేషన్‌నూ, ఇంకా అనేక ముఖ్యమైన స్థావరాలను స్వాధీనం చేసుకున్నారు. వెనువెంటనే సైనిక బారాక్‌లనూ, ప్రభుత్వ భవనాలనూ స్వాధీనంలోకి తెచ్చుకున్నారు. ఈ హఠాత్ పరిణామంతో థయర్స్ ప్రభుత్వం నిశ్చేష్టురాలైంది. మంత్రి వర్గం తొలుత విదేశీ వ్యవహారాల కార్యాలయానికి పారిపోయింది. అక్కడి నుండి పారిస్ నగరం విడిచిపెట్టి వెర్సయిల్స్‌కు పరారయ్యింది. థయర్స్ మూటా ముల్లె సర్దుకుని గుర్రపు బగ్గీలో తలుపులు మూసుకుని అశ్వీక దళం రక్షణతో వెర్సయిల్స్‌కు పలాయనం చిత్తగించాడు. థయర్స్ ఆదేశాలతో సైనిక జనరల్స్ పారిస్‌లో మిగిలి ఉన్న సైన్యాన్ని హడావిడిగా వెర్సయిల్స్‌కు ఉపసంహరించారు. సాయంత్రానికి నేషనల్ గార్డులు నగరంలోని ప్రభుత్వ కార్యాలయాలన్నిటినీ ఆక్రమించాయి. హోటల్ డి విల్లె మీద ఎర్ర జెండా ఎగురవేశారు. పారిస్ నగరం కార్మికవర్గం కైవశమైంది.

చరిత్రలో మొట్టమొదటి సారి 1871 మార్చి 18న కార్మికవర్గ విప్లవం జయప్రదమైంది. చరిత్రలో మొట్టమొదటి కార్మిక రాజ్యం – పారిస్ కమ్యూన్ ఏర్పడింది.

### విప్లవ కార్యాచరణ

నేషనల్ గార్డు కేంద్ర కమిటీ పారిస్ నగర ప్రభుత్వంగా మారింది. అది వెనువెంటనే విప్లవ కార్యాచరణకు దిగింది. ప్రజలందరికీ ఆయుధాలు ఇచ్చి నగర రక్షణకు పూనుకోవాలని పిలుపునిచ్చింది. పారిస్ కమ్యూన్ మండలికి వెంటనే ఎన్నికలకు పిలుపునిచ్చింది. మార్చి 26న ఎన్నికలు జరిగాయి. మండలిలో 85 స్థానాలకు సార్వత్రిక ఓటింగు ద్వారా ఎన్నికలు జరిపారు. ఎన్నికైన వాళ్లలో 21 మంది బూర్జువాలు నివసించే స్థానాల నుండి వచ్చారు. వారు వెనువెంటనే విప్లవాన్ని వ్యతిరేకిస్తూ మండలి నుండి తప్పుకున్నారు. మిగిలిన సభ్యుల్లో సగం మంది కార్మిక ప్రతినిధులు కాగా మిగిలిన వాళ్లు మేధావి వర్గం, ఉద్యోగులు, డాక్టర్లు, ఉపాధ్యాయులు, పాత్రికేయులు తదితరులు. అంటే మండలి పారిస్‌లోని శ్రామిక ప్రజల ప్రతినిధిగా మారింది. వారిలో సగం మంది కార్మికవర్గానికి చెందిన వారు. మార్చి 28న మండలి ప్రభుత్వ పాలనా వ్యవహారాలు చేపట్టింది. అప్పటి నుండి కొత్త ప్రభుత్వానికి 'పారిస్ కమ్యూన్' అని అధికారిక నామం లభించింది. మార్చి 28న పారిస్ ప్రజలు కొత్త ప్రభుత్వానికి స్వాగతం పలుకుతూ పెద్ద ఎత్తున సంబరాలు జరుపుకున్నారు. హోటల్ డి విల్లె ఎదుట జరిగిన ఉత్సవంలో నేషనల్ గార్డు కేంద్ర కమిటీ ప్రభుత్వాధికారాన్ని పారిస్ కమ్యూన్‌కు అప్పగించింది. 'కమ్యూన్ వర్ధిల్లాలి' అనే

**❝ ఈ కొద్ది కాలంలోనే పారిస్ కమ్యూన్ కార్మికుల విముక్తి కోసం అనేక చర్యలు తీసుకుంది.యజమానులు వదిలేసినందున మూతపడిన పరిశ్రమలను కార్మికులకు అప్పగించింది. యజమానుల చేతుల్లో ఉన్న పరిశ్రమ ల్లో కనీస వేతనాలను నిర్ణయించింది. వడ్డీ వ్యాపారుల వద్ద తాకట్టు పెట్టబడిన కార్మికుల వస్తువులను తిరిగి వారికి అప్పగించింది. ఇంటి అద్దెల చెల్లింపును నిలిపివేసింది. చర్చినీ, రాజ్యాన్ని వేరు చేసింది. వయోజనులందరికీ విద్య ఉచితం, నిర్బంధం చేసింది. ❞**

నినాదాలతో ఆ ప్రాంతం, మొత్తం పారిస్ నగరం మారుమోగింది.

**పాత ప్రభుత్వ యంత్రాంగానికి పాతర**

పారిస్ కమ్యూన్ నగరంలోని పాత సైన్యాన్ని, పోలీసు వ్యవస్థను రద్దు చేసి వాటి స్థానంలో ప్రజా రక్షణ, నగర రక్షణ కర్తవ్యాలను నేషన్ గార్డుకు అప్పగించింది. మార్చి 18 విప్లవం తరువాత పాత ప్రభుత్వంలోని అధికారులు పెద్ద ఎత్తున వర్సయిల్స్‌కు (బూర్జువా ప్రభుత్వ స్థావరానికి) పారిపోయారు. మిగిలి ఉన్న వారిలోనూ అత్యధిక శాతం కొత్త ప్రభుత్వం కింద పనిచేయడానికి నిరాకరించారు. అందు వల్ల కమ్యూన్ పాతదాని స్థానంలో తన సొంత రాజ్యాంగ యంత్రాన్ని నిర్మించుకోవాల్సి వచ్చింది. చాలా కొద్ది కాలంలోనే కమ్యూన్ ఈ పనిచేయ గలిగింది. కొత్త కౌన్సిల్‌కు ఎన్నికైన ప్రతినిధులంతా కార్మికులు, వృత్తిదారులు, విప్లవ మేధావి వర్గానికి చెందిన వారే. వారే కొత్త ప్రభుత్వ యంత్రాంగంగా మారిపోయారు. ఎన్నికైన ప్రతినిధులు ప్రజల విశ్వాసం పొందే విధంగా పనిచేయకపోతే వెనువెంటనే వారిని ఓటు ద్వారా తొలగించే అధికారం ప్రజలకిచ్చారు. పారిస్ కమ్యూన్ మండలి అనేక కొత్త చట్టాలు చేసింది. వాటిని అమలు చేయడానికి పది కమిషన్లు నియమించింది. ఈ కమిషన్ల పనిని కమ్యూన్ మండలి పర్యవేక్షిస్తుంది. ఆ విధంగా పారిస్ కమ్యూన్ చట్టాలు చేయడమే కాకుండా వాటిని అమలు చేసే పనిని కూడా భుజాన వేసుకుంది. బూర్జువా రాజ్యాంగ యంత్రంలో పార్లమెంటు (శాసన వ్యవస్థ) చట్టాలు చేస్తే కార్య నిర్వాహక వర్గం (ప్రభుత్వ యంత్రాంగం) అమలు చేసే పద్ధతికి ఇది పూర్తిగా భిన్నం. అంటే కమ్యూన్‌లో శాసన, కార్యనిర్వాహక అధికారాలు రెండూ విలీనమైనాయి. ప్రజా ప్రతినిధులకు సాధారణ కార్మికులకు ఇచ్చే వేతనాలనే నిర్ణయించారు.

సైన్యాన్ని, పోలీసు యంత్రాంగాన్ని రద్దు చేయడం ద్వారా పారిస్ కమ్యూన్ ప్రభుత్వ వ్యయాన్ని తగ్గించింది. కనీస వేతనాలనే కాకుండా గరిష్ట వేతనాలను కూడా నిర్ణయించడం ద్వారా ప్రజాప్రతినిధుల వేతనాలు కూడా దాదాపు కార్మికుల వేతనాలకు సమానంగా చేసింది. అలా కూడా ప్రభుత్వ వ్యయం బాగా తగ్గింది. ఆ విధంగా ప్యారిస్ కమ్యూన్ కొత్త రాజ్యాంగ యంత్రాన్ని రూపొందించింది. అది కార్మికవర్గ రాజ్యాంగ యంత్రం. అధికారాన్ని తమ చేతుల్లోకి తీసుకున్న కార్మికులు పాత యంత్రాంగాన్ని రద్దు చేయడం ద్వారా తమ సొంత వర్గ నిరంకుశత్వాన్ని అంటే కార్మికవర్గ నియంతృత్వాన్ని నెలకొల్పారు. పాత బూర్జువా నియంతృత్వం కొద్ది మంది బూర్జువా, భూస్వామ్య వర్గాల నియంతృత్వం. అది మెజారిటీ శ్రామిక ప్రజలను అణచి వేస్తుంది. కానీ శ్రామిక వర్గ నియంతృత్వం అనేది ప్రజల్లో 99 శాతం మంది శ్రామికులు కొద్దిమంది దోపిడీదారులను అణచి వేసే నియంతృత్వం.

**తొలి కార్మిక రాజ్యం ఆర్థిక, సామాజిక రంగంలో తీసుకున్న విప్లవాత్మక చర్యలు**

మానవాళి చరిత్రలో ఏర్పడిన ఈ తొలి కార్మిక రాజ్యం-పారిస్ కమ్యూన్- 72 రోజులు మాత్రమే అధికారంలో ఉంది. ఈ కొద్ది కాలంలోనే అది కార్మికుల విముక్తి కోసం అనేక చర్యలు తీసుకుంది. వాటిలో కొన్ని:

**1.** యజమానులు వదిలేసినందున మూతపడిన పరిశ్రమలను కార్మికులకు అప్పగించింది. నిరుద్యోగులను ఆ పరిశ్రమల్లో నియమించి ఉత్పత్తి ఆగకుండా చూసింది.

**2.** యజమానుల చేతుల్లో ఉన్న పరిశ్రమల్లో కనీస వేతనాలను నిర్ణయించింది. కార్మికులపై జరిమానాలు విధించడాన్ని రద్దు చేసింది.

**3.** వడ్డీ వ్యాపారుల వద్ద తాకట్టు పెట్టబడిన కార్మికుల వస్తువులను తిరిగి వారికి అప్పగించింది. ఇంటి అద్దెల చెల్లింపును నిలిపివేసింది. దాంతో ఇంటద్దెలు కట్టుకోలేక బాధపడుతున్న కార్మికులకు పెద్ద వెసులుబాటు వచ్చింది. చిన్న ఇరుకు గదుల్లో నివసిస్తున్న కార్మికులు పారిస్ వదిలి పారిపోయిన ధనికుల విలాసవంతమైన గృహాల్లోకి నివాసం మార్చడానికి అవకాశం కల్పించింది.

**4.** పారిస్ కమ్యూన్ చేసిన గొప్ప పని చర్చినీ, రాజ్యాన్ని వేరుగా ఉంచుతూ లౌకిక రాజ్యాంగాన్ని అమలుపరచడం. రాజ్యం నుండి చర్చికి ఆర్థిక వనరులు అందకుండా నిషేధించింది. అప్పటి వరకు చర్చిల్లో నమోదు అయ్యే జనన, మరణ, పెళ్లి రిజిస్ట్రేషన్లను ప్రభుత్వమే నిర్వహించడం ప్రారంభించింది. పాఠశాలల్లో మత బోధనలను నిషేధించింది. అనేక చర్చిలు, మోనాస్టరీలను స్వాధీనం చేసుకుని ప్రజల కమ్యూనిటీ హాళ్లుగా మార్చింది.

**5.** వయోజనులందరికీ విద్య ఉచితం, నిర్బంధం చేసింది. కొత్త పాఠశాలలు నెలకొల్పింది. కమ్యూన్ ఆధ్వర్యంలో నర్సరీలు, క్రెచ్‌లు ఏర్పాటు చేసింది.

కమ్యూన్ తీసుకున్న చర్యలకు ప్రజలు పెద్ద ఎత్తున మద్దతు తెలిపారు. కార్మికులు, వృత్తి చేసుకునే నేత పనివారు, కమ్మరులు, కుమ్మరులు, శిల్పులు, చిత్రకారులే కమ్యూన్‌లో పాలకులైనారు. వారిలో చాలా మంది మంచి ఆర్గనైజర్స్‌గా పేరుతెచ్చుకున్నారు. కమ్యూన్ మిలిటరీ కమిషన్ సభ్యుడు, నిత్యావసర సరఫరాల ఇంఛార్జి అయిన లూయిస్ వర్లిన్ 13వ ఏట నుండి పుస్తకాల బైండింగ్ కార్మికులుగా పనిచేసి పొట్ట గడుపుకున్నాడు. రోజుకు 12 నుండి 15 గంటలు పని చేస్తూనే పుస్తకాలు చదివి విజ్ఞానవంతుడయ్యాడు. 18వ ఏట నుండే కార్మికోద్యమంలో చురుగ్గా పనిచేస్తూ అనేక సార్లు జైలుకు వెళ్లాడు. మొదటి అంతర్జాతీయ కార్మిక సంస్థ సభ్యుడైన లూయిస్ వర్లిన్ కమ్యూన్‌లో కీలక పాత్ర పోషించాడు. మొదటి ఇంటర్నేషనల్‌లో సభ్యుడైన మరో కమ్యూన్ నాయకుడు లియో ఫ్రాంకెల్ ఆభరణాలు తయారు చేసే కార్మికుడు. బూర్జువా సైన్యానికి వ్యతిరేకంగా కమ్యూన్ పోరాటానికి నాయకత్వం వహించిన జరోస్లావ్ డొంబ్రోవ్స్కీ పోలెండ్ నుండి వలస వచ్చిన సైనిక నిపుణుడు. నేషనల్ గార్డు కేంద్ర కమిటీలో ఉన్న డొంబ్రోవ్స్కీ బూర్జువా ప్రభుత్వం కూడదీసుకోక ముందే వర్సయిల్స్‌పై సాయుధ దళాలతో దాడి చేయాలని సలహా ఇచ్చాడు. ఆయన సలహా పాటించక పోవడంతో కమ్యూన్ నష్టపోయింది. కమ్యూన్ సభ్యురాలైన లూయిస్ మిచెల్ అనే ఉపాధ్యాయురాలు పారిస్ రక్షణ కోసం బూర్జువా సైన్యంతో వీరోచితంగా పోరాడింది. ఆమె మంచి కవయిత్రి, రచయిత్రి. ఆమె శత్రు సేనలపై పోరాడ్డానికి మహిళలను పెద్ద ఎత్తున సమీకరించింది. రష్యన్ మహిళలు ఎలిజవెతా

దిమిత్రీవా, అన్నా పుస్తోవొయ్‌తోవాలు మిచెల్ తో కలిసి వీరోచితంగా పోరాడారు. పుస్తోవొయ్‌తోవా శత్రువుతో వీరోచితంగా పోరాడి "సోషలిస్టు రిపబ్లిక్ వర్ధిల్లాలి, ప్యారిస్ కమ్యూన్ వర్ధిల్లాలి" అనే నినాదాలు రాసిన ఎర్ర బ్యానర్ పట్టుకుని తుపాకి గుళ్లకు నేలకొరిగింది.

### ప్రతీఘాత-విప్లవం

పారిస్‌లో విప్లవం సందర్భంలో వెర్సయిల్స్ పారిపోయిన బూర్జువా ప్రభుత్వం త్వరలోనే కూడదీసుకుంది. మార్చి 18న కార్మికవర్గ విప్లవం జరిగినప్పుడు థయర్స్ నేతృత్వంలోని బూర్జువా ప్రభుత్వం వద్ద చాలా తక్కువ సైన్యం ఉండింది. కానీ త్వరలోనే అధి ఫ్రాన్స్ అంతటి నుండి సైన్యాన్ని సమీకరించుకుని వారి సంఖ్యను 40,000 కు పెంచుకుంది. ఈ సైన్యాన్ని ఉపయోగించుకుని ప్రతీఘాత-విప్లవం ప్రారంభించింది. ఏప్రిల్ 2న బూర్జువా ప్రభుత్వం పారిస్‌పై దాడికి దిగింది. దాంతో బూర్జువా సైన్యానికీ, కార్మిక ప్రభుత్వమైన కమ్యూన్‌కూ మధ్య అంతర్యుద్ధం ప్రారంభమైంది. కమ్యూన్ మద్దతుదారులైన నేషనల్ గార్డులు వీరోచితంగా పోరాడారు. కానీ వారి కమాండర్లు శిక్షణ పొందిన వారు కాదు. అందువల్ల శత్రుధాటికి నిలవలేక వాళ్లు పారిస్ నగరం చుట్టూ ఉన్న కోట గోడల్లోపలికి ఉపసంహరించుకున్నారు.

### కమ్యూన్ పొరపాట్లు

కమ్యూన్ చేసిన అనేక పొరపాట్లు బూర్జువా ప్రభుత్వం కూడదీసుకుని ప్రతీఘాత-విప్లవ దాడి చేయడానికి అవకాశాలు కల్పించాయి. అందులో థయర్స్‌ను పారిస్ నుండి పారిపోవడానికి అనుమతించడం మొదటి, కీలకమైన పొరపాటు. పారిపోయిన థయర్స్‌కి తిరిగి పారిస్‌కు వ్యతిరేకంగా సైన్యాన్ని, శక్తిని కూడదీసుకోడానికి కావలసినంత సమయం ఇవ్వడం రెండో పొరపాటు. విప్లవం జరిగిన వెంటనే కార్మికవర్గ సేనలు థయర్స్‌పై దాడి చేసి ఉంటే అతి తక్కువ సైనిక బలం ఉన్న థయర్స్ లొంగిపోయి ఉండేవాడు. అప్పుడు కార్మిక వర్గానికి ఫ్రాన్స్ మొత్తంపై ఆధిపత్యం చేజిక్కించుకునే అవకాశం లభించేది. డొంబ్రోవ్‌స్కీ లాంటివారు హెచ్చరించినా కమ్యూన్ నాయకత్వం ఈ పనిచేయలేదు. దాంతో థయర్స్ శక్తిని కూడదీసుకోవడమే కాకుండా ప్రష్యన్ ఛాన్సలర్ బిస్మార్క్‌తో సంధి చేసుకుని బలాన్ని పెంచుకున్నాడు. దాంతో పారిస్ కమ్యూన్ ఒంటరిపాటు అవడమే కాకుండా శత్రు ముట్టడికి అవకాశం లభించింది. మూడోది పారిస్‌లో అంతర్గతంగా కూడా శత్రువుల కదలికలపై కమ్యూన్ కన్ను

> "కమ్యూన్ చేసిన అనేక పొరపాట్లు బూర్జువా ప్రభుత్వం కూడదీసుకుని ప్రతీఘాత-విప్లవ దాడి చేయడానికి అవకాశాలు కల్పించాయి. అందులో థయర్స్‌ను పారిస్ నుండి పారిపోవడానికి అనుమతించడం మొదటి, కీలకమైన పొరపాటు. పారిపోయిన థయర్స్‌కి తిరిగి పారిస్‌కు వ్యతిరేకంగా సైన్యాన్ని, శక్తిని కూడదీసుకోడానికి కావలసినంత సమయం ఇవ్వడం రెండో పొరపాటు."



ప్రముఖ కమ్యూన్ నాయకులు వరుసగా: యూజిన్ వర్లిన్, జరోస్లావ్ డొంబ్రోవ్‌స్కీ, వీరనారి లూయిస్ మిచెల్, ప్రజా జర్నలిస్టు ఫెలిక్ ప్యాట్

వేయలేకపోయింది. దాంతో నగరం నిండా థయర్స్ ప్రభుత్వ గూఢాచారులు, విద్రోహులు ఎక్కడికి బడితే అక్కడికి, చివరికి కమ్యూన్ రక్షణ స్థావరాల్లోకి కూడా స్వేచ్ఛగా వెళ్లి సమాచారం సేకరించి శత్రువులకు చేర్చారు. పారిస్‌లోని గన్‌పౌడర్ గోడౌన్‌ను పేల్చేందుకు ప్రయత్నించారు. డొంబ్రోవ్‌స్కీ పై హత్యాయత్నం చేశారు. చివరికి ద్రోహులకు సహకరించే మితవాద పత్రికలను కూడా కమ్యూన్ నిషేధించలేదు. చాలా కాలం తరువాత, ప్రతిఘాత-విప్లవం ప్రారంభమయ్యాక మాత్రమే కమ్యూన్ నేతలు విద్రోహులను అరెస్టు చేయడం ప్రారంభించారు. నాల్గోది, విప్లవం జరిగిన వెంటనే థయర్స్ పారిపోయినప్పటికీ ఫ్రెంచ్ జాతీయ బ్యాంకు, దానిలోని అపార ధనరాసులు పారిస్‌లోనే ఉండిపోయాయి. ఆ బ్యాంకుకు వెళ్లిన నేషనల్ గార్డు దళాలు డబ్బు స్వాధీనం చేసుకోవడం పాపం అంటూ గుడ్లప్పగించి ఆగిపోయారే మినహా బ్యాంకును స్వాధీనం చేసుకోలేదు. దాంతో థయర్స్ ఏజెంట్లు బ్యాంకు నుండి డబ్బును విచ్చల విడిగా వెర్సయిల్స్‌కు తరలించుకుపోయారు. ఆ డబ్బు కమ్యూన్ స్వాధీనం అయి ఉంటే దాని సైనిక బలం పెంచుకోడానికి ఉపయోగపడేది. చివరిగా నేషనల్ గార్డు కేంద్ర కమిటీ చేసిన పెద్ద పొరపాటు అధికారం చేతికి రాగానే భద్రతను పటిష్టం చేసుకోవడం మీద కేంద్రీకరించకుండా హడావిడిగా కమ్యూన్ కౌన్సిల్ ఎన్నికలు జరపడం. అధికారం చేతిలోకి వచ్చిన తొలి రోజులు అత్యంత కీలకమైనవి. అందువల్ల ఆ రోజుల్లో అధికారాన్ని సుస్థిర పరుచుకోవడం మీద కేంద్రీకరించి విప్లవం సుస్థిరమైనాక ఎన్నికలు జరిపి ఉండాల్సింది.

### కమ్యూన్‌కు వ్యతిరేకంగా బిస్మార్క్‌తో సంధి

ఒకవైపు పారిస్‌పై దాడి చేస్తూనే థయర్స్ ప్రభుత్వం 1871 మే 10న ప్రష్యా ఛాన్సలర్ బిస్మార్క్‌తో అవమానకరమైన సంధి చేసుకుంది. ఈ సంధి ప్రకారం ఫ్రాన్స్‌కు చెందిన అస్సాస్ ప్రాంతాన్ని, లోరియాన్ తూర్పు ప్రాంతాన్ని ప్రష్యన్లకు అప్పగించాలి. దాంతోబాటు 500 కోట్ల ఫ్రాంకులను బంగారం రూపంలో పరిహారంగా చెల్లించుకోవాలి. దీనికి మారుగా కమ్యూన్ నేతృత్వంలోని పారిస్‌పై పోరాటంలో థయర్స్ ప్రభుత్వానికి సహకరించడానికి బిస్మార్క్ అంగీకరించాడు. నిజానికి ఫ్రాన్స్‌పై యుద్ధం చేస్తున్న బిస్మార్క్‌ను కూడా పారిస్ కమ్యూన్ భయపెట్టింది. మార్చి 18 కార్మికవర్గ విప్లవం తరువాత తనకు రాత్రిళ్లు నిద్ర పట్టలేదని బిస్మార్క్ తరువాత చెప్పాడు. కార్మికవర్గ విప్లవం సరిహద్దులు దాటి జర్మనీలోకి ప్రవేశిస్తుందని ఆయన భయం. అందుకనే ఆయన ప్రష్యా బందీలుగా ఉన్న లక్ష మంది ఫ్రెంచ్ సైనికులను గడువుకన్నా ముందుగానే విడిచిపెట్టి థయర్స్‌కు అప్పగించాడు. థయర్స్ ఆ సైన్యాన్ని పారిస్‌పై యుద్ధానికి పంపించాడు. అంతే కాకుండా

(మిగతా 33వ పేజీలో)

ఇంటర్వ్యూ

# కోవిడ్ నివారణలో అన్ని వ్యవస్థల వైఫల్యం

**(భారత దేశం ఈ రోజు అతి పెద్ద ఆరోగ్య సంక్షోభం ఎదుర్కొంటున్నది. దేశంలో రోజుకు 3 లక్షల మందికి పైగా ప్రజలు కరోనా మహమ్మారి బారిన పడుతున్నారు. రోజుకు మూడున్నర వేల మందికి పైగా చనిపోతున్నారు. నరేంద్ర మోడీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వంతో సహా దేశంలోని అన్ని సంస్థలు విఫలం కావడమే ఈ పరిస్థితికి కారణమని సుప్రీం కోర్టు బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు దుష్యంత్ దావె చెబుతున్నారు. ఈ అంశంపై ఆయనతో ప్రముఖ పాత్రికేయుడు కరన్ థాపర్ చేసిన ఇంటర్వ్యూను దిగువ ఇస్తున్నాం.... సంపాదకుడు)**




**కరన్ థాపర్:** స్వాతంత్ర్యం తరువాత మనం ఇటువంటి సంక్షోభం ఏనాడూ ఎదుర్కోలేదు. ఇలాంటి సంక్షోభ సమయంలో దేశంలోని అన్ని వ్యవస్థలూ ప్రజలను రక్షించడంలో విఫలమైనాయని మీరు చెబుతున్నారు. నేను ఒక్కో వ్యవస్థ గురించి అడుగుతాను. మీరు వివరిస్తారని భావిస్తున్నాను. ముందుగా మోడీ ప్రభుత్వంతో ప్రారంభిస్తాను. మోడీ ప్రభుత్వం ఇటువంటి తీవ్ర సంక్షోభ సమయంలో దేశ ప్రజలను రక్షించడంలో విఫలమైందని మీరు ఎందుకు భావిస్తున్నారు?

**దుష్యంత్ దావె:** దీనికి అనేక విధాలుగా సమాధానం చెప్పాల్సి ఉంది. ముందుగా నాకు ప్రధాని మోడీ మీద వ్యక్తిగతంగాఎటువంటి అగౌరవ భావం లేదన్న విషయాన్ని దృష్టిలో ఉంచుకోండి. కానీ చాలా బాధాకరమైన విషయమేమంటే ప్రధాన మంత్రి మోడీ ఈ దేశాన్ని పూర్తి అరాచకత్వంలోకి నెట్టేశారు. అంతే కాదు అన్ని విధాలా విఫమవడానికి కావలసిన అన్ని పనులనూ ప్రధాన మంత్రి మోడీ చేస్తున్నారని నేను ఖచ్చితంగా చెప్పగలను. ఇది నాకు చాలా ఆశ్చర్యం గొలుపుతోంది. ఎందుకంటే ఈ దేశానికి మంచి చేసే శక్తి ప్రధానికి ఉంది. ప్రజలకు మంచి చేయాలని ఆయనకు వారు అధికారం అప్పగించారు. కానీ ఆయనా, ఆయన మంత్రి వర్గం ఎందుకని వేలాది మంది అమాయక ప్రజలను మృత్యువు ఒడిలోకి నెడుతున్నారు? లక్షలాది మంది ప్రజలు ఈ రోజున మహమ్మారి వల్ల ఊహించని బాధలు పడుతున్నారు. ఈ బాధలు, మరణాలు సంభవించకుండా ఆపడం వారికి కష్టమేమీ కాదే! ఇది నన్ను చాలా బాధిస్తోంది. మనం బ్రిటిష్ పరిపాలనా వ్యవస్థను అనుసరిస్తున్నాం. ప్రధాన మంత్రి ఆయన కింద మంత్రి వర్గం సమిష్టి బాధ్యతతో పనిచేయాలి. ప్రధాని నేతృత్వంలోని మంత్రివర్గ ఆదేశాల కనుగుణంగా కార్యనిర్వాహక వర్గం పనిచేస్తుంది. అందువల్ల ఈ దేశంలో జరుగుతున్న, జరగకుండా ఉన్న కార్యాలకు ప్రధాని నేతృత్వంలోని మంత్రివర్గం సమిష్ట బాధ్యత వహించాల్సి ఉంటుంది.

**థాపర్:** 'అన్నింటా విఫలం అవడానికి ప్రధాని మోడీ అన్ని రకాలా ప్రయత్నిస్తున్నారు' అని మీరు చెప్పారు. ఆ పాయింటు మీద కేంద్రీకరించి నేను కొన్ని ప్రశ్నలు అడుగుతాను. మొదటిది, కరోనా రెండో వెల్లువ వస్తుందని పూర్తిగా తెలిసి కూడా ఏ్రతం ముందు జాగ్రత్త ప్రణాళికలు వేయకపోవడం ద్వారా మోడీ ప్రభుత్వం పూర్తి బాధ్యతా రహితంగా వ్యవహరించిందంటారా? ముఖ్యంగా మొదటి వెల్లువ కన్నా రెండవ వెల్లువ మరింత భయంకరంగా ఉంటుందని అమెరికా, యూరప్ అనుభవాలు చెబుతున్న తరువాత కూడా మోడీ ప్రభుత్వం ఎటువంటి జాగ్రత్తలు తీసుకోలేదు. పైగా మార్చి 8వ తేదీన కేంద్ర ఆరోగ్య మంత్రి హర్షవర్ధన్ మాట్లాడుతూ 'మనం కరోనా వైరస్ మీద తుది విజయం సాధించే స్థితిలో ఉన్నాం' అని పేర్కొన్నారు. ఇదంతా మోడీ ప్రభుత్వం కరోనా మహమ్మారి రెండవ వెల్లువను గమనించి ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవడంలో విఫలమైందని, బాధ్యతా రాహిత్యంగా వ్యవహరించిందని మీరు భావిస్తున్నారా?

**దావె:** ఇది మామూలు వైఫల్యం కాదు, సంపూర్ణమైన వైఫల్యం. ఇంకా చెప్పాలంటే నా దృష్టిలో ఇది నేరపూరితమైన వైఫల్యం. ఒక్క విషయం గమనించండి! ఇదే రకమైన బాధ్యతా రాహిత్యం ఏదైనా ఒక ప్రయివేటు రంగ పరిశ్రమలో జరిగిందను కోండి. ఏమవుతుంది? ఉదాహరణకు ఒక పెద్ద ఫ్యాక్టరీలో సరిపడ్డ అగ్నిమాపక యంత్రాలు లేకుంటే, పెద్ద అగ్ని ప్రమాదం జరిగి ప్రజలు చనిపోతే అప్పుడు మొత్తం బోర్డ్ ఆఫ్ డైరక్టర్లందరినీ అరెస్టు చేసి జైల్లో పెడతారు. కరోనా మహమ్మారి విషయంలో మన ప్రభుత్వానిది అటువంటి నేరపూరిత నిర్లక్ష్యం కాదా? గత ఏడాది మార్చి నెలలో దేశంలో 500 మందికి కరోనా ఉన్నప్పుడు మోడీ పెద్ద హడావిడి చేసి దేశమంతటా 21 రోజులు లాక్‌డౌన్ విధించారు. నిజానికి అనాడు లాక్‌డౌన్‌కు దేశాన్ని ఏమాత్రం సిద్ధం చేయకుండా ఆ పనిచేశారు. దాని వల్ల కోట్ల మంది ప్రజలు, లక్షలాది మంది వలస కార్మికులు ఎన్నో బాధలు పడ్డ విషయం మనకు తెలుసు. అందువల్ల నేను రెండు సార్లు మోడీ విఫలమయ్యారని అంటాను. మొదటి సారి తొలి కరోనా వెల్లువను నివారించడంలో విఫలమయ్యారు. రెండో సారి అన్ని విషయాలూ తెలిసి కూడా రెండో వెల్లువను ఎదుర్కోవడంలో విఫలమయ్యారు. దాంతో కోట్లాది మంది ప్రజలు తీవ్రమైన బాధల్లో పడ్డారు. అందువల్ల ప్రజలను ఈ విధమైన సంక్షోభంలోకి నెట్టడానికి పూర్తి బాధ్యత ప్రధాని మోడీది, ఆయన మంత్రివర్గానిదీ అనే విషయం నూటికి నూరుపాళ్లు వాస్తవం.

**థాపర్:** మీరు చెప్పినట్లు రెండవ వెల్లువను నివారించడంలో

ప్రభుత్వం నేరపూరిత నిర్లక్ష్యం వహించడమే కాదు,ఇప్పుడు ఒక వైపు కరోనా మహమ్మారి తీవ్రంగా విజృంభిస్తున్న తరుణంలో దేశంలోని అయిదు రాష్ట్రాల్లో పెద్ద పెద్ద ఎన్నికల సభలు నిర్వహించడం, కుంభ మేళాలు జరపడంలో కూడా ప్రభుత్వ నిర్లక్ష్యం కనిపించడం లేదా?

**దావే:** ఈ విషయం మీద నా అభిప్రాయం చెప్పే ముందు బిజెపి 2019 ఎన్నికల్లో 'సంకల్ప పత్రం' పేరుతో విడుదల చేసిన ఎన్నికల ప్రణాళికను గుర్తు చేస్తాను. అందులో ఇలా పేర్కొన్నారు: " భారత స్వాతంత్ర 75వ వార్షికోత్సం 2022లో జరుపుకుంటున్న తరుణంలో ....ప్రజల కలలు సాకారం చేయడం మన పవిత్ర కర్తవ్యం. గత అయిదేళ్ల పాలనకు కొనసాగింపుగా మేము పేద ప్రజలకు భద్రత కలించే వ్యవస్థను నిర్మిస్తాము.... అందరికీ ఆరోగ్యం సమకూరుస్తాము. ఆరోగ్య సదుపాయాలను బలోపేతం చేస్తాము." ఇటువంటి వాగ్దానాలతో ఓట్లు పొంది అధికారంలోకి వచ్చిన తరువాత ఈ ప్రభుత్వం ప్రజల ఆరోగ్యాన్ని రక్షించాల్సిన బాధ్యతను ఎలా మరిచిపోయింది? మనకు జాతీయ విపత్తుల చట్టం ఉంది. ఆ చట్టాన్ని అనుసరించేటట్లయితే ప్రభుత్వం ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరించేది కాదు. రెండో వెల్లువ నివారించడానికి జాతీయ ప్రణాళికను, కార్యాచరణను సిద్ధం చేసుకునేది. రాష్ట్రాలు కూడా వాటి వాటి ప్రణాళికలు, కార్యాచరణలను సిద్ధం చేసుకునేవి. నిజంగానే రెండో వెల్లువ నివారించాలనే తపన ఈ ప్రభుత్వానికి ఉండి ఉంటే అది దేశంలోని నిపుణులతో చర్చించి ఉండేది. నిపుణులంటే ప్రధాని చుట్టూ ఉండే వంధిమాగదులు కాదు. లేక టీవీల్లో చర్చోపచర్చలు జరిపేవారు కాదు. నిజమైన నిపుణులకు ఈ దేశంలో కొరత లేదు. ప్రభుత్వం వారిలో ఎవ్వరినీ సంప్రదించలేదు. కార్యాచరణ ప్రణాళిక రూపొందించలేదు. ప్రధాని మోడీ, ఆయన మంత్రివర్గం ఆ పని చేసి వుంటే మనకు ఈ రోజున ఆసుపత్రి పడకల సమస్య ఉండేది కాదు, ఆక్సిజన్ సమస్య ఉండేది కాదు, వ్యాక్సిన్ సమస్య ఉండేది కాదు, వెంటిలేటర్ల సమస్య ఉండేది కాదు. నిపుణులతో సంప్రదిస్తే వీటిని ముందుగానే ప్రణాళికా బద్దంగా సమకూర్చుకోవడం సమస్య కాదు.

**థాపర్:** దేశంలో రోజుకు 1600 మంది కరోనాతో చనిపోతుంటే మరోవైపు పెద్ద పెద్ద ఎన్నికల సభలు నిర్వహించడం నేర పూరితమైన చర్య కాదా?

**దావే:** అవును, ప్రధాన మంత్రి ఈ దేశ ప్రజలను ఇంతటి తీవ్రమైన ప్రమాదంలోకి నెట్టడానికి కారణం ఆయన పశ్చిమ బెంగాల్‌లో ఎలాగైనా గెలవాలన్న తలంపుతో అక్కడి ఎన్నికల మీద కేంద్రీకరించడమే. మమతా బెనర్జీని ఓడించాలన్న రందిలో ఆయనా, ఆయన హోమ్ మంత్రి అమిత్ షా వారి రాజ్యాంగ పరమైన విధులను పూర్తిగా మరిచిపోయారు. గత ఏడాది కరోనా మహమ్మారిని లెక్కచేయకుండా ఢిల్లీలోని నిజాముద్దీన్ బర్కజ్ సమావేశంలో పాల్గన్నందుకు వేలాది మందిని జైల్లో పెట్టారు. కానీ ఇప్పుడు అదే ప్రభుత్వం లక్షలాది మందితో కుంభమేళాలు నిర్వహించింది. ఈ మేళాల్లో పాల్గన్న వారంతా తమ ఊళ్లకు –దేశంలోని అన్ని గ్రామాలు, పట్టణాలు, గల్లీలకు గంగా జలంతో పాటు కరోనా వైరస్‌ను కూడా పట్టుకు వెళ్లారు.

**థాపర్:** మోడీ ప్రభుత్వం వ్యాక్సిన్ వ్యూహం గురించి ఒక ప్రశ్న అడగదలచుకున్నాను. గత ఏడాది జూన్–జులైలో అంటే నేటికి పది మాసాల ముందే ఫైజర్, ఆస్ట్రాజెనికా వంటి సంస్థలు



**కోవిడ్ సమయంలో లక్షలాది మందితో హరిద్వార్‌లో కుంభమేళా: బాధ్యత గల ఏ ప్రభుత్వమూ దీనికి అనుమతివ్వదు**

వ్యాక్సిన్ ఉత్పత్తి ప్రారంభించాయి. మన దేశంలో కనీసం 75 శాతం ప్రజలకు రెండు డోస్‌ల వ్యాక్సిన్ వేయాలంటే మనకు కనీసం 200 కోట్ల డోస్‌ల వ్యాక్సిన్ కావాలని ఆనాడే మనకు తెలుసు. కానీ మన దేశంలో రోజుకు 25 లక్షల వ్యాక్సిన్ డోస్‌ల ఉత్పత్తి సామర్థ్యం మాత్రమే ఉంది. అంటే 200 కోట్ల డోసులు ఉత్పత్తి జరగాలంటే మన ఉత్పత్తి సామర్థ్యం రోజుకు 5 లక్షల నుండి 10 లక్షల డోస్‌లకు పెరగాలని ప్రభుత్వానికి స్పష్టంగా తెలుసు. అయినా మన వాక్సిన్ ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచడంలో ప్రభుత్వం ఎందుకు ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరించింది?

**దావే:** ఈ విషయంలో ప్రభుత్వానిది నిర్లక్ష్యమే కాదు, పూర్తి బాధ్యతా రాహిత్యం అని నేను అంటాను. ఒక విషయం చెబుతాను వినండి! ఈ కాలంలో ప్రధాని మోడీ 70 నుండి 80 దేశాలకు పర్యటనలు జరిపారు. వెళ్లిన ప్రతి దేశంలోనూ నాయకులు తనకు ఆత్మీయ దోస్తులని ప్రకటించారు. కానీ ఈ అవకాశాన్ని ఉపయోగించుకుని వాక్సిన్‌ను సంయుక్తంగా తయారుచేయడానికి ఆయన ఆయా దేశాల నాయకులను ఒప్పించడానికి ప్రయత్నించి ఉండాల్సింది. 2020 జూన్–జులైలో ఈ పనిచేసి ఉంటే ఆయా దేశాల కంపెనీలను ఆహ్వానించి దేశంలో ఉత్పత్తి యూనిట్లు ప్రారంభించి ఉండేవారు. ఎందుకంటే భారత దేశం నేడు ప్రపంచంలోనే వ్యాక్సిన్ ఉత్పత్తి కేంద్రంగా ఉంది. కానీ ప్రధాని ఆ పనిచేయలేదు. నిజానికి ప్రభుత్వం దగ్గర అటువంటి ఒక ప్రణాళికే లేదు. ఉత్పత్తి ప్రణాళిక లేదు. వ్యాక్సిన్ కొనుగోలు ప్రణాళిక లేదు. చివరికి సరైన వ్యాక్సినేషన్ కార్యక్రమమే దాని దగ్గర లేదు. 130 కోట్ల మంది ప్రజల్లో 'సామూహిక రోగనిరోధక శక్తి' (హెర్డ్ ఇమ్యూనిటీ) కల్పించాలంటే కనీసం 75 శాతం ప్రజలకు వ్యాక్సిన్ వేయాలి. అలా చేయాలంటే దాని కోసం చాలా కాలం ముందుగానే ఆలోచించాలి, ప్రణాళిక వేసుకుని కార్యాచరణ ప్రారంభించాలి. ఈ పనిచేయకపోవడం ద్వారా మోడీ తనకు తాను హాని చేసుకున్నారు. ఎందుకంటే ప్రజల దృష్టిలో ఆయన చేతగానివాడుగా మారిపోయారు. మరోవంక లక్షలాది మంది ప్రాణాలకు హాని చేశారు.

**థాపర్:** మీరు పూనావాలా సంస్థ గురించి చెప్పారు గనుక దానికి సంబంధించిన ఒక ప్రశ్న అడుగుతాను. పూనా వాలా చాలా కాలం క్రితమే, అంటే ఇంకా వాక్సిన్ ట్రయల్స్ పూర్తికాక ముందే తన సంస్థలో స్వంత డబ్బు పెట్టుబడి పెట్టి ఆస్ట్రాజెనికా వ్యాక్సిన్, అంటే 'కోవీషీల్డ్' ఉత్పత్తికి పూనుకున్నారు. వాక్సిన్‌కు అనుమతి లభించిన వెంటనే సరిపడ్డా స్టాకు నిల్వ చేయవచ్చుననే ఉద్దేశ్యంతోనే ఆయన ఇదంతా చేశారు. ఒకవైపు అమెరికా, బ్రిటన్, ఐరోపా యూనియన్లు వ్యాక్సిన్‌కు అనుమతి లభించకముందే తమకు కావలసిన డోస్‌ల కోసం ముందుగానే



**ఢిల్లీలోని ఆసుపత్రి వద్ద కారులోనే ఆక్సిజన్ సిలిండర్ పెట్టుకుని వైద్యం కోసం కోవిడ్ రోగి పడిగాపులు: నేడు భారత దేశమంతటా ఇదే పరిస్థితి**

చెల్లింపులు చేశాయి. భారత ప్రభుత్వం కూడా ఆ దేశాల్లాగే చేసి ఉండాల్సింది కదా?

**దావె:** వాస్తవం ఏమిటంటే మన ప్రధాన మంత్రి మొత్తం అధికారాన్ని తన ఒక్కడి చేతుల్లో అంటే ప్రధాని కార్యాలయం గుప్పెట్లో పెట్టుకున్నారు. దాని వల్ల ఈ దేశంలో విపత్తు నివారణ విషయంలో గొప్ప గొప్ప నిపుణులున్నప్పటికీ వారి సలహాలు తీసుకోలేదు. అంటే ప్రధాన మంత్రి ఇటువంటి మహా విపత్తు వస్తుందని ఏనాడూ ఊహించి ఉండరు. అందువల్లనే ఆయన దానికి సిద్ధం కాలేదు. అందువల్లనే ఆయన మంత్రివర్గ సహచరులు, ఆయన సలహాదారులూ "భారత దేశం కరోనాపై గొప్ప విజయం సాధించింది" అని పోసుకోలు ప్రకటనలు చేశారు. నిజానికి ప్రధాన మంత్రి కూడా విదేశాలకు వెళ్లి మా దేశాన్ని చూడండి కరోనా రహితంగా ఎలా తయారయ్యిందో అని టాంటాం చేశారు. ఇటువంటి కబుర్లు కట్టిపెట్టి ప్రభుత్వం ముందుగానే ప్రణాళిక వేసి ఉండాల్సింది. మన దేశంలో ఉన్న మంచి వ్యాక్సిన్ ఉత్పత్తి సదుపాయాలను ఉపయోగించుకుని ముందుగానే కావలసినంత వ్యాక్సిన్ సిద్ధం చేసి ఉండాల్సింది.

**థాపర్:** ప్రధాన మంత్రి సమస్య తీవ్రతను గుర్తించలేదని అందువల్లనే సమస్యను ఎదుర్కొనడంలో విఫలమయ్యారని మీరు అన్నారు. మరి రాష్ట్ర ప్రభుత్వాల సంగతి ఏమిటి? కరోనా వ్యాధిగ్రస్తులను పరీక్షించి, గుర్తించి, వ్యాక్సిన్ వేసే పని రాష్ట్రాల స్థాయిలో జరగాలి. మరి రాష్ట్ర ప్రభుత్వాలు కూడా ఈ విషయంలో విఫలమయ్యాయి కదా!

**దావె:** కరోనా విషయంలో, ముఖ్యంగా కరోనా పరీక్షల విషయంలో అన్ని రాష్ట్ర ప్రభుత్వాలు ఘోరంగా విఫలమయ్యాయి. ముఖ్యంగా రాష్ట్రాల్లో ఎంతమందికి కరోనా పరీక్షలు నిర్వహించారన్న విషయంలో దేశంలో సరైన సమాచారమే లేదు. ఇదే భారత దేశంలో పెద్ద సమస్య. వాస్తవానికి మోడీ ప్రభుత్వ పెద్ద విజయం కూడా అదే. అది ప్రజలకు నిజమైన, కచ్చితమైన సమాచారం ఇవ్వదు. ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వంతోపాటు రాష్ట్ర ప్రభుత్వాలకు కూడా బాధ్యత ఉంది. ఫలితంగా వాస్తవ కరోనా పరీక్షలకు సంబంధించిన సమాచారం పూర్తిగా అర్థరహితంగా ఉంది. ఎవరూ దాన్ని నమ్మరు. వాళ్లు చెప్పిన వివరాలు నిజమేనని నమ్మినా కూడా దేశ జనాభాలో 10 నుండి 20 శాతానికి మించి పరీక్షలు నిర్వహించలేదు. సరైన కరోనా పరీక్షలు నిర్వహించకపోతే ఒకానొక దశలో ఎంతమంది కరోనా బాధితులు ఉన్నారో మనకు అర్థం కాదు. ఈ విషయంలో రాష్ట్రాలు పూర్తిగా విఫలమైనాయి. ప్రజల ఆరోగ్యం రాష్ట్రాలకు సంబంధించిన అంశం. ప్రకృతి విపత్తు అనేది కేంద్ర ప్రభుత్వానికి సంబంధించిన అంశం. అందువల్ల ప్రజలను రక్షించే విషయంలో మోడీ ప్రభుత్వంతోబాటు రాష్ట్ర ప్రభుత్వాలకు కూడా బాధ్యత ఉంటుంది.

**థాపర్:** ఎన్నికల ప్రచార సభలకు సంబంధించి ప్రధాని మోడీ పెద్ద పెద్ద సభలు జరపడం ద్వారా ప్రజల ప్రాణాలను ప్రమాదంలోకి నెట్టారన్న దాంట్లో సందేహం లేదు. కానీ అదే సమయంలో ఎన్నికలు జరిగిన రాష్ట్రాల్లో ఇతర రాజకీయ పార్టీలు కూడా పోటీగా అంతే పెద్ద సభలు నిర్వహించాయి కదా! ఈ విషయంలో వాటి బాధ్యత ఎంత?

**దావె:** మనలాంటి పెద్ద దేశంలో ఇటువంటి మహమ్మారిని ఎదుర్కోవాలంటే అన్ని రాజకీయ పార్టీలు ఒక చోట చేరి ఈ ప్రమాదాన్ని ఎలా ఎదుర్కోవాలో చర్చించి నిర్ణయాలు చేయాలి. అందువల్ల విపత్తులు ఎదుర్కొని, ప్రజల సంక్షేమం కాపాడే విషయంలో ఐక్య నిర్వహణ (యూనిటరీ గవర్నెన్స్) అవసరం. కానీ ఈ విషయంలో పాలక బిజెపితో పాటు అన్ని రాజకీయ పార్టీలు బాధ్యతా రహితంగా వ్యవహరించాయి. ఏ పార్టీ కూడా ఎన్నికలను వాయిదా వేయాలని కోరలేదు. గడువు ముగిస్తే కొన్నాళ్లు రాష్ట్రం గవర్నరు పాలన కింద ఉంటే ఏమవుతుంది? కానీ ఈ విషయంలో దేశానికి పెద్ద నష్టం కలిగించిన రాజ్యాంగ సంస్థ ఎన్నికల కమిషన్. ఇటువంటి విపత్తు సంభవించినప్పుడు ఎన్నికల కమిషన్ ఎన్నికలు వాయిదా అయినా వేసి ఉండాల్సింది, లేకుంటే సాధ్యమైనంత తొందరగా ఎన్నికలు ముగించాల్సింది. ఒకే దఫాలో ఎన్నికలు నిర్వహిస్తే సమస్య ఇంత తీవ్రతరం అయ్యేది కాదు. తమిళనాడులో ఒకే సారి ఎన్నికలు జరిపి, పశ్చిమ బెంగాల్, అస్సాంలలో మాత్రం అయిదుసార్లు, ఎనిమిది సార్లు జరపడం సమర్థనీయం కాదు. ఈ విషయంలో ఎన్నికల సంఘం అధికార పార్టీ చెప్పుచేతుల్లో నడుస్తున్నదనే భావించాలి.

**థాపర్:** మీరు చెప్పినట్లు ఎన్నికల సంఘం ఎన్నికలను వాయిదా అయినా వేసి ఉండాల్సింది, లేక ఒకే దఫాలో .జరిపి ఉండాల్సింది. కనీసం మమతా బెనర్జీ సూచించినట్లు చివరి మూడు, నాలుగు విడతల పోలింగును కలిపి ఒకే సారి నిర్వహించి ఉండాల్సింది. ఇప్పటికైనా ఎన్నికల సంఘం రాజకీయ పార్టీల సంకుచిత కోర్కెలతో కొట్టుకు పోకుండా యావద్దేశాన్ని దృష్టిలో ఉంచుకుని వ్యవహరిస్తుందంటారా?

**దావె:** ఎన్నికల సంఘం పూర్తిగా పాక్షిక దృష్టితో వ్యవహరిస్తున్నట్టు కనిపిస్తోంది గానీ దేశ విస్తృత ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని పనిచేయడం లేదు. ముఖ్యంగా కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీ కోరుకున్నట్లే అది పనిచేస్తోంది. బెంగాల్‌లో సాధ్యమైనన్ని ఎక్కువ విడతలు పోలింగ్ నిర్వహించడం వెనుక కేంద్రంలో అధికార పార్టీ ప్రయోజనాలు దాగున్నాయి. ఎక్కువ బహిరంగ సభలు నిర్వహించడానికి ఎన్నికల సంఘం ఆమోదం ఇచ్చింది. ఒక విధంగా చెప్పాలంటే ఈ దేశంలో ప్రాచుర్యం రీత్యా ఇతరులెవరూ తన దరికి కూడా చేరలేరని తెలిసి కూడా ప్రధాని మోడీ బెంగాల్‌లో అధికారం గుంజుకోడానికి 15 లేక 16 సార్లు ఆ రాష్ట్రం వెళ్లడం ఆయనకు తగని పని.

**థాపర్:** ప్రధాని మోడీ బెంగాల్‌కు 15, 16 సార్లు వెళ్లడమే కాదు, భారీ బహిరంగ సభల్లో పాల్గనడం, ఆ సభల్లో మాస్కులు ధరించకుండా పాల్గనడం, ప్రజలను పెద్ద ఎత్తున సమీకరించడం...ఇవన్నీ కూడా కరోనా మహమ్మారిని కావాలని వ్యాపింపజేయడమే కదా? ప్రధాని వైపు నుండి ఇది బాధ్యతా రాహిత్యం కాదా!

**దావె:** మోడీకి కేవలం రాజకీయాలే మినహా మిగతావేమీ పట్టవు. ప్రజల సంక్షేమం పట్టదు. ఉదాహరణకు చూడండి, 2020 ఆగస్టు 30 ప్రధాన మోడీ 'ప్రజలంతా మాస్కులు ధరించాలని' పునరుద్ఘాటించారు. కోవిడ్ మహమ్మారి నుండి రక్షించుకోవాలంటే



**దేశంలో కరోనా విలయతాండవం చేస్తుంటే బెంగాల్‌లో 8 దఫాలుగా ఎన్నికలు జరపడం, మోడీ, అమిత్ షాలు ప్రజలను భారీగా సమీకరించి బహిరంగ సభలు జరపడం బాధ్యతా రాహిత్యానికి పరాకాష్ట**

మాస్కులు తప్పక ధరించాలని కోరారు. 'రెండు మీటర్ల దూరం సరి, మాస్క్ తప్పని సరి' అని ఆయన నినాదం ఇచ్చారు. దాన్ని ఆయన ఎన్నికల రందీలో పూర్తిగా మరిచిపోయారు.

**థాపర్:** ఈ విషయంలో సుప్రీం కోర్టు కూడా విఫలమయిందంటారా?

**దావే:** కచ్చితంగా. ఈ విషయంలో రాజ్యాంగ నిర్మాతలు సుప్రీం కోర్టు మీద పెట్టిన బాధ్యతలు నిర్వహించడంలో అది పూర్తిగా బాధ్యతా రహితంగా వ్యవహరించిందని చెప్పవచ్చు. ప్రజా ప్రయోజన వాజ్యాలు, సుమోటో విచారణలను ఉపయోగించుకుని అది ప్రజల సంక్షేమాన్ని, ప్రజల ప్రాణాలను రక్షించవచ్చు. కానీ గత కొద్ది మాసాలుగా దేశంలో కరోనా విస్తరిస్తూ ఉంటే సుప్రీం కోర్టు ప్రేక్షక పాత్ర వహించింది. ఇదే సుప్రీం కోర్టు వలస కార్మికుల సమస్య వచ్చినప్పుడు సుమోటో విచారణ చేపట్టి కనీసం కొన్ని ఆదేశాలు జారీ చేసింది. అవి పెద్దగా పనిచేసే ఆదేశాలు కాకపోయినా కొన్ని చర్యలైతే తీసుకున్నారు. రెండో విషయం, ఇదే సుప్రీం కోర్టు ప్రధాని సంక్షేమ నిధిని సమర్ధించింది. అది కొంతమంది వ్యక్తులకు సంబంధించిన నిధి అని పేర్కొంది. ప్రధాని సంక్షేమ నిధికి ప్రజలు విరాళాలు ఇవ్వాలని కోరితే నేను కూడా రూ.50 లక్షలు విరాళం ఇచ్చాను. ఈ నిధి కోసం నాడు పెద్ద ఎత్తున వాణిజ్య ప్రకటనలు చేశారు. నిధితో అది చేస్తాం, ఇది చేస్తాం అని పెద్ద పెద్ద హామీలు ఇచ్చారు. కానీ గత ఏడాది కాలంగా ఈ ప్రధాని సంక్షేమ నిధిలోని వేల కోట్ల రూపాయలు ఏం చేశారో, దేనికి ఖర్చు చేశారో ఒక్క మాటైనా విన్నామా మనం? మరి సుప్రీం కోర్టు ఈ విషయంలో ఎందుకు మౌనంగా ఉంది? అందువల్ల సుప్రీం కోర్టు ప్రజలకు మేలు చేయడానికి తనకు లభించిన అవకాశాన్ని చేజార్చుకుందని నేను భావిస్తున్నాను. అంతేకాదు వారి గౌరవాన్ని పొందే అవకాశాన్ని కూడా అది చేజార్చుకుంది. ఆ విధంగా అది రాజ్యాంగానికీ, చట్టానికీ తీవ్రమైన నష్టం కలిగించింది.

**థాపర్:** మీడియా కూడా దేశ ప్రజలను సరిగ్గా పట్టించుకోలేదంటాను. కాదంటారా? కరోనా మహమ్మారి గురించి మీడియాలో తగినన్ని వార్తలు రాలేదని అనను. కానీ ఇక్కడ పరిమాణం (క్వాంటిటీ) గురించి మాట్లాడ్డం లేదు. వార్తల నాణ్యత (క్వాలిటీ) గురించి మాట్లాడుతున్నాను. మీడియాలో కరోనాకు సంబంధించి ప్రభుత్వ తీసుకున్న లేక తీసుకోకుండా ఉన్న చర్యలగురించి తగినంత లోతైన చర్చ జరగలేదంటాను. ప్రజలకు ప్రభుత్వాలు చేయాల్సిన వాటి గురించి, వాటి వైఫల్యాల గురించి మీడియా చర్చించలేదు. మీ అభిప్రాయం?

**దావే:** మీడియా కూడా ప్రజలను పట్టించుకోలేదని నేను భావిస్తున్నాను. మహమ్మారి విషయంలో మీడియా విమర్శనాత్మక పాత్ర వహించాల్సింది. ప్రభుత్వాలకు మార్గనిర్దేశం చేసే, ప్రజలకు సరైన సమాచారం చేరవేసే పాత్ర నిర్వహించాల్సింది. ప్రజలకు మేలు చేసేందుకుగాను ప్రభుత్వాలపై ఒత్తిడి తెచ్చే పాత్ర నిర్వహించాల్సింది. విమర్శనాత్మక పాత్ర నిర్వహించాల్సింది. ఇటువంటి పాత్ర ద్వారా అది ప్రభుత్వం మెడలు వంచి చర్యలు తీసుకునేట్టు చేయాల్సింది. ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని, కార్యశూన్యతనూ, వైఫల్యాలనూ ఎండగట్టాల్సింది. ఈ విషయాల్లో మన దేశంలో మీడియా విఫలమయింది. ఉదాహరణకు, నిజాముద్దీన్ మర్కజ్ ఘటన తీసుకోండి. మీడియాలో ఒక భాగం ఈ దేశంలో ముస్లింలను నడుస్తున్న ఉగ్రవాదులుగా పరిగణిస్తూ ప్రచారం చేసింది. వారి మీద ఎంతటి విష ప్రచారం జరిగిందో మనకు తెలుసు. సుప్రీం కోర్టు దీనిపై చర్య తీసుకోవాలని నేను ప్రధాన న్యాయమూర్తి బోబ్డే ధర్మాసనంలో వాదించాను. ఇటువంటి దుష్ప్రచారం చేస్తున్న మీడియాపై ప్రభుత్వం చర్య తీసుకోవాలని ఆదేశించాలని కోరాను. ఈ సెక్షన్ మీడియా ప్రభుత్వానికి అనుకూలమైనది. ప్రభుత్వ కొమ్ముకాసే మీడియా. ఆ విషయం అందరికీ తెలుసు. న్యాయమూర్తి చాలా ధర్మపన్నాలు చేశారు. కానీ ప్రభుత్వానికి ఒక్క ఆదేశం కూడా ఇవ్వలేదు. అందువల్ల కరోనా మహమ్మారి విషయంలో ఒక సెక్షన్ మీడియా మినహా ప్రధాన మీడియా పూర్తిగా విఫలమయిందనే చెప్పాలి. ఇప్పుడు కరోనా వ్యాప్తిగురించి మీడియాలో వస్తున్న వార్తలు కూడా చూడండి. కరోనా నిపుణులు అంటూ గుండె వ్యాధి నిపుణులతో మాట్లాడిస్తారు. గుండెవ్యాధి నిపుణులకు కరోనా గురించి ఏం తెలుస్తుంది. ఒక శ్వాసకోశవ్యాధి నిపుణుడితోనో, క్రిటికల్ కేర్ నిపుణుడితోనో లేకుంటే కనీసం జనరల్ ఫిజిషియన్‌తోనో మాట్లాడిస్తే ఒక చందంగా ఉంటుంది. ఒక ఏడాదిగా మాట్లాడుతున్న ఈ నిపుణుల్లో, దేశం కోవిడ్ మహమ్మారిని ఎదుర్కోడానికి ఏం చేస్తున్నది, ఏం చేయట్లేదు అని చెప్పేవాడు ఒక్కడూ లేడు. అందువల్ల మీడియాలో ఏనాడూ వాక్సిన్ ఎంతగా అందుబాటులో ఉంది, వ్యాధి నివారణ సదుపాయాలు ఎంత అందుబాటులో ఉన్నాయి, లేక అందుబాటులో లేవు అన్న అంశమీద చర్చే ఉండటం లేదు. ఒక రకంగా ఇటువంటి జాతీయ విపత్తు సమయంలో మీడియా ప్రజల పక్షాన ఉండాల్సింది పోయి ప్రభుత్వం పక్షాన నిలబడింది. ఇది నిజంగా విచారకరమైన విషయం. ఇప్పటికైనా అన్ని సంస్థలూ ముందుకు వచ్చి పరిస్థితి చక్కదిద్దకపోతే దేశాన్ని దేవుడు కూడా రక్షించలేడు. ❊

**ఉద్యమ గమనం**

# కమ్యూనిస్టు ఉద్యమ ఆటుపోట్లు: శాస్త్రీయ అవగాహన



రచయిత సిపిఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు, తెలంగాణా రాష్ట్ర కార్యదర్శి

**తమ్మినేని వీరభద్రం**

కమ్యూనిజానికి కాలం చెల్లింది! సోషలిజానికి భవిష్యత్తు లేదు! గతంలోలా కాకుండా ఇపుడు కమ్యూనిస్టు పార్టీలకు పోరాటతత్వం బలహీనపడింది! ఇటీవల ఇలాంటి మాటలు మనం తరుచుగా వినాల్సి వస్తోంది.

అవకాశం దొరికినపుడల్లా కమ్యూనిస్టులను ఆడిపోసుకోవటానికి కమ్యూనిస్టు వ్యతిరేకులు ఉపయోగించే మాటలు ఇవి. శత్రువుల విమర్శల సంగతి అలా ఉంచినా, ఇటీవలి కాలంలో కమ్యూనిస్టు ఉద్యమం బలహీనపడటం, సోషలిస్టు శిబిరం దెబ్బతినటం నిజంగానే జరిగిందిగాబట్టి, మన ఉద్యమానికి భవిష్యత్తు ఉండదేమో అని ఆందోళన చెందే కమ్యూనిస్టు అభిమానులు కూడా ఇపుడు అధికంగానే ఉంటున్నారు. ఈ నేపథ్యంలో మన శ్రేణుల్లో కూడా నిరాశా, నిర్లిప్తతలు చోటుచేసుకోవటానికి అవకాశం ఉంటుంది. కానీ కమ్యూనిస్టు ఉద్యమ చరిత్రను, ముఖ్యంగా ఉద్యమం ఎదుర్కొన్న ఆటుపోట్లను, వాటి కారణాలు, ఆటంకాలను అధిగమించిన తీరును గమనిస్తే ఉద్యమ భవిష్యత్తు పట్ల ఏర్పడుతున్న సందేహాలు పటాపంచలు కాక తప్పవు.

కమ్యూనిస్టు ఉద్యమం నేడు బలహీనపడిన మాట నిజం. అయితే ఇప్పటికీ మానవజాతి ఎదుర్కొంటున్న సమస్యలను శాస్త్రీయంగా పరిష్కరించగల సిద్ధాంతం కమ్యూనిజం తప్ప మరొకటేదీ లేదనేది కూడా అంతే నిజం. ఉద్యమంలో ఆటుపోట్లు సహజం. వాటిని సక్రమంగా విశ్లేషించుకుంటేనే కారణాలు అర్థమవుతాయి. భవిష్యత్తుకు మార్గం బోధపడుతుంది. కమ్యూనిస్టు ఉద్యమ చరిత్రను ఒకసారి పరికిస్తే ఇప్పటికి ఎన్నెన్ని ఆటుపోట్లను అది అధిగమించిందో, పడిపోయిన ప్రతిసారీ 'సముద్ర కెరటం' లాగా మళ్లీ ఎలా పైకెగిసిందో మనకు తెలుస్తుంది.

కమ్యూనిజం లేక సోషలిజం అనేవి మానవజాతి ఉన్నతిని కోరుకుంటూ కొందరు మహాపురుషులు కన్న కలలు కావు. సమ సమాజం అనేది ఒక ఆదర్శమానవుడి వూహాలోని అందమైన చిత్రం అంతకంటే కాదు. మానవజాతి పరిణామ క్రమంలో జరుగుతున్న నిరంతర వర్గ ఘర్షణలో అనివార్యంగా చేరుకోనున్న మహత్తర మజిలీలే సోషలిజం, కమ్యూనిజం. ఉనికిలోకి వచ్చిన ప్రతిజీవీ తన మనుగడకోసం పోరాడుతుంది. అలాగే మానవులు తమ మనుగడకోసం, మరింత మెరుగైన జీవనం కోసం నిరంతర ప్రయత్నాలు, పోరాటాలు చేస్తూనే ఉన్నారు. అదే మొత్తం మానవజాతి చరిత్ర. ఈ పోరాటాలూ, ప్రయత్నాలే (వర్గఘర్షణ) మానవ సమాజాన్ని ముందుకు నడిపిస్తున్నాయి. ఈ ఘర్షణలో మానవుల అభివృద్ధికి ఆటంకమయ్యే ప్రతిదీ నాశనంకాక తప్పదు. ఆ విధంగానే గతంలో బానిస సమాజాలూ, ఫ్యూడల్ రాజవంశాలూ నాశనమయ్యాయి. ఆ సమాజాలు కొంత కాలం మనుగడలో ఉన్నాయంటే అర్థం అవి ఆ 'కొంతకాలం' వరకూ మానవజాతి అభివృద్ధికి ఉపయోగపడినాయనే అర్థం. ఎప్పుడైతే అవి మొత్తం సమాజం ముందుకు సాగటానికి ఆటంకంగా తయారయ్యాయో, ఆటంకమనేది ప్రజల చైతన్యంలో భాగమయిందో – ఆ వ్యవస్థలు నాశనం కాక తప్పలేదు. ఈ విధమైన పరిణామక్రమంలోనే పాత వ్యవస్థలకు పాతరేసి, నేటి పెట్టుబడిదారీ వ్యవస్థ ఆవిర్భవించింది. పెట్టుబడిదారీ విధానం ప్రారంభంలో పాత వ్యవస్థల కంటే తప్పనిసరిగా అభివృద్ధికరంగానే ఉంది. కానీ రాను రాను అది అపరిమిత దోపిడీతో అసమానతలు పెంచుతుంది. సమాజాభివృద్ధికి ఆటంకంగా తయారౌతుంది. ఆ అంశం ప్రజాచైతన్యంలో భాగమౌతుంది.

పెట్టుబడిదారీ విధానం కూడా మానవ సమాజాభివృద్ధికి ఉపయోగపడిన మేరకే మనుగడ సాగించగలుగుతుంది. అభివృద్ధి చెందగలుగుతుంది. అలా కాకుండా సమాజాభివృద్ధికి అదే ఆటంకమయ్యే పరిస్థితిలో దాని వినాశనాన్ని ఎవరూ అడ్డుకోలేరు. కాకపోతే ఒకేసారి ప్రజల తిరస్కారానికి గురికాకపోవచ్చు. తిరస్కారభావం క్రమంగా పెరుగుతూ ఒక్కసారిగా విస్ఫోటనం జరుగుతుంది. బ్రిటిష్ వాళ్లు 200 సంవత్సరాలు మన దేశాన్ని పాలించారు. మన సంపదలన్నీ దోచుకున్నారు. 1947 నాటికి ప్రజలు ఈ పాలనకు వ్యతిరేకంగా తిరగబడి స్వాతంత్ర్యం సాధించుకున్నారంటే అర్థం... అంతకు ముందు రెండువందల సంవత్సరాలూ ప్రజలను బ్రిటిష్‌వాళ్లు సుభిక్షంగా పాలించారనా? మన దేశాన్ని దోచుకోలేదనా? కానేకాదు. అప్పుడూ దోచుకున్నారు. కానీ ప్రజలకు అర్థం కావటానికి సమయం పట్టింది. అంతేకాదు. బ్రిటిష్ వారి కంటే ముందు పాలించిన వారికంటే బ్రిటిష్ వారిలో తప్పకుండా ప్రజలు కొన్ని విషయాల్లో కొంత 'మంచి'ని చూశారు కాబట్టే వారి పాలన సాగింది. ఆ మంచి కరిగిపోయి చెడు పెరుగుతున్నకొద్దీ ప్రజల అసంతృప్తి పెరిగింది. ఈ భౌతిక పరిస్థితికి తోడు ప్రజలను ఆవరించే సిద్ధాంతం, సంఘటితపర్చే నిర్మాణం కూడా తోడవ్వాలి. కాంగ్రెస్ పార్టీ ఏర్పడటం, ప్రారంభ దినాలలో దాని బలహీనతలు, కమ్యూనిస్టుల ఆవిర్భావం తర్వాత వచ్చిన గుణాత్మకమైన మార్పు ఇవన్నీ స్వాతంత్రోద్యమంలో సబ్జెక్టివ్‌గా పనిచేసిన అంశాలు.

ఇక్కడ రెండు విషయాలపై మనం నిర్ధారణకు రావాల్సిఉంటుంది. మొదటిది, ఒక వ్యవస్థలో ప్రజలు అంతకు ముందుకంటే మెరుగైన జీవితం అనుభవించినంతకాలం వారు సంతృప్తిగా ఉంటారు. అయితే నిరంతరం తమ జీవన ప్రమాణాల అభివృద్ధిని కోరుకుంటారు. ఆ అభివృద్ధి ఒక దశకు చేరాక ఇంక అభివృద్ధి సాగనప్పుడు అసంతృప్తికి లోనవుతారు. తిరుగుబాటుకు సిద్ధమవుతారు. రెండోది, ప్రజల అసంతృప్తిని పోగుజేసి తిరుగుబాటును

జయప్రదం చేసే నిర్మాణం, దానిని నడిపించే సిద్ధాంతం ఉండాలి. అది లేకుండా ప్రజా తిరుగుబాటు జయప్రదం కాదు. మార్క్సిజం ఇంకా ప్రపంచానికి పరిచయం కాని రోజుల్లో కూడా ఇదే నిజం. ఎందుకంటే బానిసల తిరుగుబాటు కూడా ఒక నిర్మాణ వ్యవస్థా, బానిసలను ఉత్తేజపరిచి, దారిచూపే సిద్ధాంత ప్రతిపాదనా లేకుండా జయప్రదం కాలేదు. అవి లేని అనేక తిరుగుబాట్లు చరిత్రలో విఫలమైనాయనే విషయం మన గమనంలో ఉండాలి. అందువల్ల సమాజ మార్పుకు రెండు విషయాలు కీలకం. మొదటిది ఆ సమాజంలో ప్రజల అభివృద్ధిని ఆటంక పరిచే శక్తులతో ప్రజలు చేసే పోరాటం, ఘర్షణ. రెండోది ఆ ఘర్షణకు సరైన రూపమిచ్చి ముందుకు నడిపే సిద్ధాంతం, దాని ఆధారంగా సాగే నిర్మాణం. చరిత్రలో ఈ రెండు విషయాల సహజాతం ఎలా జరిగింది? వీటిలో ఎపుడు ఏ లోపం వల్ల కమ్యూనిస్టు ఉద్యమం వెనకబడింది? ఆ లోపాన్ని అధిగమించేందుకు జరిగిన ప్రయత్నాలేమిటి? వచ్చిన ఫలితాలేమిటి? అనేది తెలుసుకుంటే ఈనాడు కమ్యూనిస్టు ఉద్యమం వెనకబడటానికి కారణాలూ, భవిష్యత్తుకు ఉన్న అవకాశాలూ మనకు స్పష్టంగా అవగతమవుతాయి.


మొత్తం కమ్యూనిస్టు ఉద్యమాన్ని, ముఖ్యంగా అది ఎదుర్కొన్న ఆటుపోట్లను పరిశీలించటానికి 10 దశలుగా విభజించి పరిశీలించటం సౌలభ్యంగా ఉంటుంది. ప్రతి దశలో కూడా ఏ ఆటంకం వల్ల ఉద్యమం దెబ్బతిన్నదో, నష్టపోయిందో మనం పరిశీలించాలి. అలాగే ఆ ఆటంకాన్ని ఎలా అధిగమించగలిగిందో, ఆ తర్వాత మరింత వేగంగా ఉద్యమం ఎలా విస్తరించిందో అర్థం చేసుకోవాలి. అపుడే ప్రస్తుతం మనం ఎదుర్కొంటున్న ఆటంకం సరిగ్గా అర్థమౌతుంది. దాని పరిష్కారం ఎలా సాధ్యమో అవగతమై భవిష్యత్తు పట్ల ఆత్మవిశ్వాసం ఏర్పడుతుంది.

**❝ మొత్తం కమ్యూనిస్టు ఉద్యమాన్ని, ముఖ్యంగా అది ఎదుర్కొన్న ఆటుపోట్లను పరిశీలించటానికి 10 దశలుగా విభజించి పరిశీలించటం సౌలభ్యంగా ఉంటుంది. ప్రతి దశలో కూడా ఏ ఆటంకం వల్ల ఉద్యమం దెబ్బతిన్నదో, నష్టపోయిందో మనం పరిశీలించాలి. అలాగే ఆ ఆటంకాన్ని ఎలా అధిగమించగలిగిందో, ఆ తర్వాత మరింత వేగంగా ఉద్యమం ఎలా విస్తరించిందో అర్థం చేసుకోవాలి. అపుడే ప్రస్తుతం మనం ఎదుర్కొంటున్న ఆటంకం సరిగ్గా అర్థమౌతుంది. దాని పరిష్కారం ఎలా సాధ్యమో అవగతమై భవిష్యత్తు పట్ల ఆత్మవిశ్వాసం ఏర్పడుతుంది. ❞**

కమ్యూనిస్టు ఉద్యమంలో ముఖ్యమైన పది దశలు : ఎదురైన ఆటంకాలు

1. 1848 (మార్క్స్, ఎంగెల్స్) కంటే ముందు దశ – ఊహాజనిత సోషలిజం

1848 కంటే ముందు అంటే మార్క్స్, ఎంగెల్స్‌ల రంగప్రవేశం కంటే ముందు కూడా కార్మికుల, శ్రామిక ప్రజల సంక్షేమం కోసం అనేక ఆలోచనలు, ఉద్యమాలు సాగించబడ్డాయి. ఊహాజనిత సోషలిస్టు సిద్ధాంతాలు ఈ ఉద్యమాలకు ప్రేరణగా ఉండేవి. పెట్టుబడిదారీ వ్యవస్థను కూలదోసే



శాస్త్రీయ సోషలిస్టు సిద్ధాంత ప్రతిపాదకులు
కారల్ మార్క్స్, ఫ్రెడరిక్ ఏంగెల్స్

శాస్త్రీయ సోషలిస్టు సిద్ధాంతం రూపొందక పోవటం ఉద్యమ అభివృద్ధికి ముఖ్యమైన ఆటంకంగా ఉండేది. ఊహాజనిత సోషలిజం రూపంలో ఎదురైన ఈ ఆటంకాన్ని మార్క్స్, ఎంగెల్స్‌లు సమర్థవంతంగా పరిష్కరించారు. అప్పటికే ఇగ్లండ్‌లో ఇంకా కొన్ని ప్రాంతాలలో పరిశ్రమలు బాగా అభివృద్ధి చెందాయి. కార్మికుల పరిస్థితులు దుర్భరంగా తయారయ్యాయి. కార్మికుల పరిస్థితులు మెరుగుపడాలనే కోరికలూ, అందుకోసం అనేక కార్యాచరణలూ, ఉద్యమాలూ జరిగాయి. అనేక మంది ఊహాజనిత సోషలిస్టులు ఈ కాలంలో తమ కృషి సాగించారు. సెయింట్ సైమన్, చార్లెస్ ఫోరియర్, రాబర్ట్ ఓవెన్ లాంటి ఊహాజనిత సోషలిస్టులు ఈ కాలంలోనే ముందుకు వచ్చారు. వారు ఆదర్శ సమాజాలను వూహించారు. మానవుల ఆదర్శాలే సమాజాన్ని ముందుకు నడిపిస్తాయని నమ్మారు. అంటే మనుషుల ఆలోచనా విధానాన్ని మారిస్తే దోపిడీ పోతుందని, అందరూ సమానంగా జీవించవచ్చనీ భావించారు. అందుకు ప్రయత్నించారు. వర్గాలు, వర్గపోరాటం ద్వారా సమాజం అభివృద్ధి అవుతుందనే శాస్త్రీయ సిద్ధాంతం ఆనాటికింకా అభివృద్ధి కాలేదు. వర్గాలకతీతంగా ప్రజలందరూ స్వచ్ఛందంగా ఒకరికొకరు సహకరించుకోవాలనీ, ఆ విధమైన చైతన్యాన్ని కలుగజేస్తే సహకార సోషలిజం సాధ్యమనీ నమ్మారు. అందుకు ప్రయత్నించారు. మార్క్స్, ఎంగెల్స్‌లు వీరిని వూహాజనిత సోషలిస్టులు అన్నారు.

బహుశా మొదటి ఊహాజనిత సోషలిస్టు థామస్ మోరె (1478–1535). ఈయన తన పుస్తకం 'ఉటోపియా'లో ఒక సోషలిస్టు సమాజాన్ని ఊహించాడు. ఈ పుస్తకం 1516లో ప్రచురించబడింది. సెయింట్ సైమన్ (1760–1825) తన సోషలిస్టు ఆదర్శాలతో ఒక రాజకీయ, సామాజిక ఉద్యమాన్నే నిర్మించాడు. 'సెయింట్ సైమనిజం' పేర 19వ శతాబ్దం ప్రారంభంలో ఈ ఉద్యమం పెద్ద ప్రభావాన్నే కలిగించింది. మార్క్స్, స్టూవర్ట్ మిల్ లాంటి వారు కూడా దీనికి ప్రభావితులయ్యారు. రాబర్ట్ ఓవెన్ (1771–1858) ఒక మంచి వ్యాపారవేత్త. ఆయన తన లాభాలన్నింటినీ తన ఉద్యోగుల, కార్మికుల సంక్షేమం కోసం వెచ్చించేవాడు. ఆయన స్కాట్లాండ్‌లో ఒక ఫ్యాక్టరీ స్థాపించాడు. కార్మికులకు పనిగంటలు తగ్గించాడు. వారి పిల్లలకు స్కూళ్లు, కుటుంబాలకు ఇండ్లు కట్టించాడు. తన ఆలోచనలతో 'సమాజానికి ఒక కొత్త దృక్పథం' అనే పుస్తకం రాసి 1813లో ప్రచురించాడు. ఆయనో కమ్యూన్ కూడా స్థాపించాడు. అయితే ఆయన పార్టనర్ ఒకడు మోసం చేయటంతో అది మూసివేయబడింది. ఏమైనా ఓవెన్ చేసిన కృషిలో ముఖ్యమైనదేమంటే మానవుల సామాజిక స్వభావం స్థిరంగా ఏమీ ఉండదు. దానిని మార్చవచ్చు. వారికిష్టమైన సమాజాన్ని నిర్మించుకోవచ్చు అనేది. చార్లెస్ ఫోరియర్ (1772–1837) పారిశ్రామిక విప్లవాన్నీ, ఆధునిక పరిశ్రమల్నీ వ్యతిరేకించాడు. వాటి వల్లే కార్మికులకు ఈ బాధలు వచ్చాయనేది ఆయన వాదన.

**"1836లో స్థాపించబడిన 'లీగ్ ఆఫ్ జస్ట్' అనే విప్లవ సంస్థ మార్క్స్, ఎంగెల్స్‌ల నాయకత్వంలోని 'కమ్యూనిస్టు కరస్పాండెంట్ కమిటీ'తో 1847లో విలీనమై 'కమ్యూనిస్టు లీగ్' అనే సంస్థగా ఏర్పడింది. ఈ సంస్థ మార్క్స్, ఎంగెల్స్‌లకు ఊహాజనిత సిద్ధాంతాలన్నింటినీ పూర్వపక్షం చేస్తూ శాస్త్రీయమైన సోషలిస్టు సిద్ధాంతాన్ని ప్రపంచం ముందుంచే కర్తవ్యాన్ని అప్పగించింది. ఈ కృషి నుండి ప్రపంచం ముందుకు వచ్చిన శాస్త్రీయ సోషలిస్టు సిద్ధాంతంతో కూడిన కార్యాచరణ ప్రణాళికే 'కమ్యూనిస్టు మానిఫెస్టో'."**

వీరేగాక ఇంకా అనేకమంది ఇలాంటి అభ్యుదయ కాముకులు తమ ఆలోచనల ననుసరించి ప్రజలకు మంచి సమాజాన్ని అందించాలని కృషి చేసారు. ఫ్రాన్స్, ఇగ్లండ్, అమెరికా తదితర దేశాల్లో అనేక కమ్యూన్‌లు స్థాపించారు. ఆర్థిక ఫలాలను కార్మికులకు, ప్రజలకు అందించే ప్రయత్నం చేశారు. ఆదర్శాలను తమ రచనలు, కృషిద్వారా ప్రచారం చేశారు. ప్రస్తుత సమాజంలో కూడా మనం ఇలాంటి వ్యక్తులను, సంస్థలను అనేకం చూస్తున్నాం. ప్రజలకు సేవా కార్యక్రమాలు ద్వారా, దానధర్మాల ద్వారా, ధనికులకు హితబోధల ద్వారా సమాజాన్ని క్రమంగా మార్చవచ్చునీ, మనసు మార్చటం ముఖ్యమైన మార్గమనీ నమ్ముతుంటారు. అలాంటి కృషి సాగిస్తుంటారు. అలాంటి కృషి తప్పు అనేదేమీ లేదు. ప్రజలకు కొంత మేలు, సహాయం కూడా జరుగుతుంది. కానీ సమాజం అలా మారుతుందని ఆశించటం భ్రమ అవుతుంది. సారాంశంలో ఈ భ్రమలు సోషలిస్టు ఉద్యమానికి ఆటంకం తప్ప ప్రజలకు అంతిమంగా మేలు చేయవు. ఇప్పటికీ మన సమాజంలో అనేక మంది నుండి వ్యక్తమయ్యే ఈ ఆలోచనలు ఈ నాటివేం కావు. మార్క్స్, ఎంగెల్స్‌ల కంటే చాలా ముందుగానే ఇవి గొప్ప సిద్ధాంతాలుగా ముందుకు వచ్చాయి. అనేక ప్రయత్నాలు, ప్రయోగాలు జరిగాయి. విఫలమయ్యాయి. ఇంకా విఫలమవుతూనే ఉన్నాయి.

ఈ ఊహాజనిత సోషలిస్టు సిద్ధాంతాలు ఎంత మంచి ఉద్దేశాలతో ముందుకు వచ్చినా, అవి తాత్కాలికంగా కొద్ది మంది ప్రజలకు ఊరట కలిగించినా అవే సోషలిస్టు ఉద్యమానికి ఆటంకంగా తయారయ్యాయి. ఈ తప్పుడు సిద్ధాంతాలను విమర్శించటం, వాటి స్థానంలో శాస్త్రీయ సోషలిస్టు సిద్ధాంతాలను కార్మిక వర్గానికి అందించటం ఆనాటి ముఖ్యావసరం. ఇది జరగకుండా ఆనాటి ఉద్యమం ముందుకు సాగటం సాధ్యం కాదు. ప్రపంచ సోషలిస్టు ఉద్యమాన్ని అడ్డుకుంటున్న ఈ ఆటంకాన్ని తొలగించటానికి మార్క్స్, ఎంగెల్స్‌లు పూను కున్నారు. కమ్యూనిస్టు మానిఫెస్టో, ఇంకా ఇతర గ్రంథాలతో విప్లవ సిద్ధాంతాన్ని కార్మికవర్గానికి అందించారు.

1836లో స్థాపించబడిన 'లీగ్ ఆఫ్ జస్ట్' అనే విప్లవ సంస్థ మార్క్స్, ఎంగెల్స్‌ల నాయకత్వంలోని 'కమ్యూనిస్టు కరస్పాండెంట్ కమిటీ'తో 1847లో విలీనమై 'కమ్యూనిస్టు లీగ్' అనే సంస్థగా ఏర్పడింది. ఈ సంస్థ మార్క్స్, ఎంగెల్స్‌లకు ఊహాజనిత సిద్ధాంతాలన్నింటినీ పూర్వపక్షం చేస్తూ శాస్త్రీయమైన సోషలిస్టు సిద్ధాంతాన్ని ప్రపంచం ముందుంచే కర్తవ్యాన్ని అప్పగించింది. ఈ కృషి నుండి ప్రపంచం ముందుకు వచ్చిన శాస్త్రీయ సోషలిస్టు సిద్ధాంతంతో కూడిన కార్యాచరణ ప్రణాళికే 'కమ్యూనిస్టు మానిఫెస్టో'. ఈ గ్రంథం 1848 ఫిబ్రవరిలో ప్రకటించబడింది. కమ్యూనిస్టు మేనిఫెస్టో అనేది ప్రపంచ కమ్యూనిస్టుల కార్యక్రమం. నేటి వర్గ ప్రపంచాన్ని విశ్లేషించి, శ్రామిక వర్గాలకు కార్యాచరణ నిర్దేశించిన దిక్సూచి. ఈ గ్రంథంలోని వర్గపోరాట ప్రతిపాదనలు 'సర్వేజనా: సుఖినో భవంతు' అనే ఊహాజనిత సోషలిస్టు సిద్ధాంతాలను తుత్తునియలు చేశాయి. విప్లవ కార్యాచరణను కార్మికవర్గానికి, శ్రామిక ప్రజలకు అందించాయి.

కమ్యూనిస్టు మానిఫెస్టో సారాంశం : 'ఇంతవరకూ సాగిన చరిత్రంతా వర్గపోరాటాల చరిత్రే' అనే వాక్యంతో ఈ గ్రంథం ప్రారంభమౌతుంది. సమాజం ఏఏ దశల్లో ఏఏ వర్గాలుగా చీలిపోయిందో, ఆ వర్గాల ఘర్షణ ఫలితంగా సమాజం ఎలా ముందుకు సాగిందో మార్క్స్, ఎంగెల్స్‌లు వివరిస్తారు. పెట్టుబడిదారీ సమాజంలో బూర్జువాలూ, కార్మికులూ ప్రధాన వర్గాలుగా ఆవిర్భవిస్తారు. మిగతా అనేక వర్గాలు ఉన్నా అవి క్రమంగా కనుమరుగై అటు బూర్జువాల్లోనో, ఇటు కార్మికుల్లోనో కలిసిపోతారని వివరిస్తారు. పెట్టుబడి విస్తరిస్తున్న కొద్దీ అంతకు ముందున్న సమాజంలోని విలువలు, వృత్తులు ఎలా పరిణామం చెందుతాయో వివరిస్తారు.

బూర్జువావర్గం ఆర్థికంగా పురోగమించటంతోపాటు, రాజకీయంగానూ పురోగమించింది. ఒకనాడు ఫ్యూడల్ ప్రభువర్గం క్రింద పీడితులుగా ఉన్న ఈ వర్గం, పీడకవర్గంగా మారుతుంది. బూర్జువావర్గం చారిత్రకంగా అత్యంత విప్లవకరమైన పాత్రను పోషించింది. బూర్జువావర్గం పైచేయి సాధించిన ప్రతిచోటా మొత్తం పితృస్వామిక, ఫ్యూడల్ సంబంధాలన్నింటినీ ఖతం చేస్తుంది. మనిషిని 'పుట్టుకతోనే అధికులైనవారితో' బంధించిన అమాంబాపతు సంబంధాన్నింటినీ తెంచివేస్తుంది. ఇంతకు ముందు గౌరవాన్ని పొందిన వృత్తులన్నింటినీ వైద్యుడినీ, న్యాయవాదినీ, పురోహితుడినీ, కవినీ, శాస్త్రవేత్తనీ అది జీతగాళ్ళుగా మార్చుకుంటుంది. కుటుంబ సంబంధాలలోని ప్రేమానురాగాల్ని అన్నింటినీ తుంచివేసి, వాటన్నింటినీ డబ్బు సంబంధాలుగా మారుస్తుంది. పవిత్రం అనుకున్న ప్రతిదీ మైలబడుతుంది. పెట్టుబడిదారీ సమాజంలో చివరికి మనిషి తన భ్రమలను తొలగించుకోక తప్పదు. తన నిజమైన పరిస్థితులనూ తనలాంటి వారితో తనకుగల సంబంధాలనూ గ్రహించక తప్పదు.

తన ఉత్పత్తులకు మార్కెట్ కావాలి గనుక, ఆ అవసరం బూర్జువావర్గాన్ని ప్రపంచం నలుమూలలకూ తరుముతుంది. అది ప్రతిచోటా గూడుకట్టుకుని నివసించాల్సిందే. ప్రతిదేశంలోనూ జరిగే ఉత్పత్తికీ, వినిమయానికీ అంతకు ముందున్న జాతీయ స్వభావాన్ని తొలగిస్తుంది. నగరాలకు గ్రామసీమలు లోబడేలా చేస్తుంది. బూర్జువావర్గం పాలన ప్రారంభమైన కొద్దికాలంలోనే అంతకు ముందుకంటే అనేక రెట్లు విస్తారమైన, బ్రహ్మాండమైన ఉత్పత్తి శక్తుల్ని అది తన పాలనలో సృష్టించింది.

ఇంతవరకూ జరిగిన ఉద్యమాలన్నీ అల్పసంఖ్యాక ఉద్యమాలే. కానీ పెట్టుబడిదారీ సమాజంలో జరిగే శ్రామిక ఉద్యమం అలాంటిది కాదు. అధిక సంఖ్యాకుల ప్రయోజనాల కోసం, అధిక సంఖ్యాకులు నడిపే స్వతంత్రమైన, బుద్ధిపూర్వకమైన ఉద్యమం. ఈనాటి సమాజంలో శ్రామికవర్గం అట్టడుగు పొరల్లో ఉంటుంది. అది కదలాలన్నా, లేచి నిలబడాలన్నా తనపై ఉన్న పొరలన్నింటినీ పైకి గాలిలోకి విసరాల్సిందే.

(మిగతా 34వ పేజీలో)

ఈ మాసం ప్రత్యేకం

# శ్రామికుల శత్రువులెవరు?



రచయిత సిపిఐ(ఎం) కేంద్రకమిటి సభ్యులు

**ఎస్.వీరయ్య**

పార్లమెంట్ ఎన్నికలు, దుబ్బాక ఉప ఎన్నిక, జిహెచ్ఎంసి ఎన్నికల్లో సాధించిన విజయాలతో తెలంగాణలో బిజెపి దూకుడు పెంచింది. ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షునికి పట్ట పగ్గాల్లేవు. ఈ ఫలితాలతో కంగుతిన్న టిఆర్ఎస్ నాయకత్వం ఎంఎల్సి ఎన్నికల్లో సర్వశక్తులూ ఒడ్డి విజయం సాధించింది. హైదరాబాదు, రంగారెడ్డి, మహబూబ్నగర్ స్థానంలో బిజెపి అభ్యర్థిని ఓడించి మొదటి సారి ఈ స్థానాన్ని గెలుచుకున్నది. అయినా తెలంగాణ తమ చేతికి వచ్చినట్టేనంటున్నది బిజెపి. అటు ఏపిలో కూడా బిజెపి దూకుడు పెంచింది. పవన్కళ్యాణ్ తమ ముఖ్యమంత్రి అభ్యర్థి అని కూడా ప్రకటించింది. తెలుగు రాష్ట్రాల్లో ఏం జరుగుతున్నది? ఈ పరిణామాల మధ్య ఇతర పార్టీలు, ప్రజాసంఘాలు, మేధావులు, ప్రజల పాత్ర ఏమిటి? శ్రామిక ప్రజలు ఎట్లా స్పందించాలి? ఇవన్నీ లోతుగా పరిశీలించాల్సిన అంశాలే!

వేరు తెలంగాణ వస్తే అన్ని సమస్యలు పరిష్కరిస్తామన్నారు కెసిఆర్. కానీ తెలంగాణ రాష్ట్రంలో ఒక్క షెడ్యూల్డ్ పరిశ్రమలో కూడా కనీసవేతనం సవరించలేదు. సంఘాలు, సమ్మెలు, సంప్రదింపులంటే తెలంగాణ సర్కార్కు గిట్టవు. ఖాళీ పోస్టుల భర్తీ వాగ్దానం మూడవ వంతు కూడా నెరవేరలేదు. ఔట్సోర్సింగ్, కాంట్రాక్ట్ పద్ధతిని రద్దు చేస్తానన్న మాట తెలంగాణ రాష్ట్రంలో వినిపించలేదు. స్కీం వర్కర్లు, మున్సిపల్, గ్రామపంచాయితీ కార్మికులు హక్కులు అడగవద్దు. ఇచ్చింది తీసుకోవాలి. సభలు, సమావేశాలు కూడా ఊరవతలనే.... డబుల్ బెడ్రూం ఇండ్ల కోసం పేదలు ఎదురుచూపులు, ఆర్టీసీ కార్మికుల వేతన సవరణ లేదు. కౌలురైతులు, పోడు భూములు, అసైన్డ్ భూములు, వ్యవసాయ కార్మికులు అన్న మాటలు పాలకుల నిఘంటువులో లేవు. నిరుద్యోగ భృతి లాంటి అనేక వాగ్దానాలు అమలు కాలేదు. మహిళల మీద లైంగికదాడులు, కుల దురహంకార దాడులు జరిగినప్పుడు కూడా పాలకులు నోరు మెదపరు. ఇలాంటి ధోరణుల పట్ల మధ్యతరగతి, చదువుకున్న యువత, కార్మికవర్గంలో క్రమంగా అసంతృప్తి పెరుగుతున్నది. మరోవైపు ఆంధ్రప్రదేశ్లోనూ ఒక్క రంగంలో కూడా కనీస వేతనాలు సవరించలేదు, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల వేతన సవరణ సంఘం సిఫార్సులను ఎటూ తేల్చలేదు. టిఆర్ఎస్ ప్రభుత్వం చట్టసభలో ప్రతిపక్షం లేకుండా చేసే పనిలో దాదాపు జయప్రదం అయ్యింది. కాంగ్రెస్ శాసనసభా పక్షాన్ని నామమాత్రం చేసింది. టిడిపి శాసనసభా పక్షాన్ని ఖాళీ చేసింది. వైసిపి ప్రభుత్వం కూడా టిడిపి అనవాళ్ళు కూడా సహించే స్థితిలో లేదు. ఈ రెండు ప్రభుత్వాలూ ప్రశ్నించడాన్ని కూడా సహించలేకపోతున్నాయి. ఈ రెండు రాష్ట్రాల్లోనూ ఏ మేరకు అసంతృప్తి పెరిగినా సొమ్ము చేసుకునే ప్రయత్నంలో బిజెపి ఉన్నది. దీనితో పాటు తెలంగాణలో కాంగ్రెస్ పార్టీని, ఏపిలో టిడిపిని మింగేసే ప్రయత్నంలో ఉన్నది. కాంగ్రెస్, టిడిపి నాయకులను అనేక విధాలుగా లోబర్చుకునే ప్రయత్నం సాగుతున్నది. అవకాశం దొరికితే ప్రభుత్వాల్లో చిచ్చుపెట్టి పబ్బం గడుపుకోవడానికి కూడా వెనకాడదు. టీఆర్ఎస్ ప్రభుత్వం కూలిపోతుందని పదేపదే చెప్పడంలో వారి ఎదురుచూపులు స్పష్టమవుతున్నాయి. ఏపిలో ఆలయాలకు భద్రత లేదని మతం పేరుతో చిచ్చుపెట్టే ప్రయత్నంలో ఉన్నది. తెలంగాణలో ఎంఐఎంను చూపించి హిందువులను రెచ్చగొట్టేందుకు ప్రయత్నిస్తున్నది.

తెల్లదొరల పాలన నుంచి కార్మికవర్గం పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను కేంద్రంలో బిజెపి సర్కార్ నీరుగార్చింది. కోరలులేని కోడ్స్గా మార్చింది. కార్మిక చట్టాలను కోడ్స్ రూపంలోకి మార్చడం ద్వారా పాలకులు ఎలాంటి నిర్ణయమైనా తీసుకునేందుకు వీలుగా సర్వాధికారాలు తమ చేతుల్లోకి తీసుకున్నారు. పార్లమెంట్కు పోవాల్సిన అవసరం లేకుండానే ఎలాంటి సవరణ అయినా చేయగల్గుతారు. ఇప్పటికే ఆచరణలో సమ్మెహక్కు తొలగించారు. నిర్ధిష్ట కాలపరిమితి వరకే పనిచేసే విధంగా కార్మికులను నియమించుకునేందుకు అనుమతించారు. ఫలితంగా వారు యూనియన్లో చేరడం, పోరాడడం అంత సులభం కాదు. కాంట్రాక్ట్ లేబర్ చట్టాన్ని రద్దు చేయడం ద్వారా శాశ్వత స్వభావం గల పనుల్లో కూడా కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ పద్ధతిలో నియమించే అవకాశం ఇచ్చారు. సంఘటితపడేందుకు, సమ్మెలకు అనేక పరిమితులు ఏర్పడతాయి. యూనియన్లలో బయటి నాయకత్వాన్ని పరిమితం చేశారు. అంతర్గత కార్మికులే యాజమాన్యంతో సమాన హోదాలో చర్చలు జరపడం, యాజమాన్యం ఒత్తిడులను తట్టుకోవడం అంత సులభం కాదు. 50 కన్నా తక్కువ మంది కార్మికులతో పనిచేయించే కాంట్రాక్టర్లకు లైసెన్స్ కూడా అవసరం లేకుండా చేసింది. ఇది కాంట్రాక్టర్ల ఇష్టారాజ్యానికి దారి తీస్తుంది. పని గంటలు పెంచింది. సమ్మె నోటీస్ కాలపరిమితి పెంచింది. సమ్మె నోటీస్ ఇచ్చిన తర్వాత కార్మికశాఖ జోక్యంతో పరిష్కారం కానప్పుడు కూడా వెంటనే సమ్మెలోకి పోయే అవకాశం లేదు. ట్రిబ్యునల్ విచారణకు పోతే, తీర్పు వచ్చే దాకానే కాదు, ఆ తర్వాత 60 రోజుల వరకు సమ్మె నిషేధం. ఇన్ని అవాంతరాలు దాటి సమ్మె హక్కును వినియోగించుకోవడం దాదాపు అసాధ్యం. అన్యాయాన్ని తట్టుకోలేక సమ్మెకు దిగితే ఒక్కరోజు సమ్మెకు 8 రోజుల వేతనం కోత విధిస్తారు. సమ్మెను ప్రోత్సహించిన వారికి జైలు శిక్ష వేస్తారు. వీటన్నింటి సారాంశం సమ్మెలను నిషేధించడమే! ఇక యాజమాన్యాలదే ఇష్టారాజ్యం.

కనీస వేతనం నిర్ణయించేందుకు ప్రాతిపదికగా ఎలాంటి సూత్రం లేదు. ప్రభుత్వం ఇష్ట ప్రకారం చేస్తుందట. మోడీ ప్రభుత్వం ఇప్పటికే నిర్ణయించిన కనీస వేతనం నెలకు రు.5,200. ఇలాంటి పాలకులు ఇష్టాఇష్టాల ప్రకారం వేతనాలు నిర్ణయించడమంటే పెట్టుబడిదారులు కార్మికుల శ్రమను దోచుకోవడాన్ని సులభతరం చేయడమే కదా! ఇఎస్ఐ, పిఎఫ్ లాంటి సంక్షేమ చట్టాల్లో మార్పులు చేశారు. యాజమాన్యాలు చెల్లించాల్సిన మొత్తాలను తగ్గించారు. తద్వారా

> **❝ కరోనా కాలంలో కూడా పచ్చగా కనిపించింది వ్యవసాయం. ఇప్పుడు ఆ రంగాన్ని కూడా అంబాని, ఆదానిలకు అర్పించేందుకు మోడి ప్రభుత్వం పూనుకున్నది. మూడు రైతు వ్యతిరేక చట్టాలు చేసింది. వ్యవసాయ మార్కెట్‌లోకి విదేశీ పెట్టుబడిదారులతో సహా అందరికీ స్వేచ్ఛగా ప్రవేశించే అవకాశం కల్పించింది. ఆహారభద్రతకు ముప్పు ఏర్పడే అవకాశమున్నది. ❞**

కార్మికులకు అందాల్సిన సౌకర్యాలూ తగ్గిపోయాయి. కార్మికుడంటే నిర్వచనమే మార్చారు. పని స్వభావాన్ని బట్టి కాకుండా వేతనాన్ని బట్టి నిర్వచనం ఇచ్చారు. దీని వల్ల కోట్లమంది కార్మికులకు కార్మిక చట్టాలు వర్తించవు. ఒక సంస్థలో 300 లేదా అంతకన్నా ఎక్కువ మంది కార్మికులు పనిచేస్తేనే (రికార్డుల్లో ఉంటేనే) చట్టాలు వర్తిస్తాయి. అంటే దాదాపు 74 శాతం కార్మికులు ఇప్పటికే ఉన్న హక్కులు కోల్పోతారు.

ఇవన్నీ ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ (సులభతర వ్యాపారం) పేరుతో చేస్తున్నారు. అంటే పెట్టుబడిదారులకు వ్యాపారం మరింత సులభతరం చేసేందుకన్నమాట! కార్మికులకు మరింత భద్రత కల్పించేందుకు కాక, కార్మికుల శ్రమను యాజమాన్యాలు మరింత సులభంగా దోచుకునేందుకు వీలు కల్పించేందుకే ఈ చట్టాలు. బ్రిటిష్ పాలనలో అనుసరించిన విధానాలే ఇప్పుడు మోడి ప్రభుత్వం చట్టబద్ధం చేసింది. భారత ఆర్థిక వ్యవస్థకు పునాదులు వేసి, సార్వభౌమధికారాన్ని కాపాడిన ప్రభుత్వరంగ సంస్థలన్నింటినీ ప్రయివేటీకరిస్తామని కేంద్ర ప్రభుత్వం బరితెగించి ప్రకటించింది. విశాఖ స్టీల్, ఇన్సూరెన్స్ వంటి రంగాలను విదేశీ బహుళజాతి సంస్థల చేతుల్లో పెట్టేందుకు కూడా సిద్ధపడుతున్నది. ఇదంతా దేశభక్తి పేరుతోనే చేస్తున్నది. స్వదేశీ, విదేశీ బడా పెట్టుబడిదారుల ప్రయోజనాల పట్ల ఆసక్తి తప్ప ఇందులో దేశభక్తి ఏమున్నది?

కరోనా కాలంలో కూడా పచ్చగా కనిపించింది వ్యవసాయం. ఇప్పుడు ఆ రంగాన్ని కూడా అంబాని, ఆదానిలకు అర్పించేందుకు మోడి ప్రభుత్వం పూనుకున్నది. మూడు రైతు వ్యతిరేక చట్టాలు చేసింది. వ్యవసాయ మార్కెట్‌లోకి విదేశీ పెట్టుబడిదారులతో సహా అందరికీ స్వేచ్ఛగా ప్రవేశించే అవకాశం కల్పించింది. ఆహారభద్రతకు ముప్పు ఏర్పడే అవకాశమున్నది. రైతుకు ఎక్కడైనా అమ్ముకునే అవకాశం పేరుతో వ్యవసాయ మార్కెట్లు, మద్దతు ధరకు తిలోదకాలిస్తున్నది. ఆహార ధాన్యాలు ఎంతైనా కొనుగోలు చేసి నిల్వ చేసుకునే అవకాశం కల్పించింది. ఇది కృత్రిమ కొరత సృష్టించి, ధరలు పెంచేందుకు దారి తీస్తుంది. మద్దతు ధరను చట్టబద్ధం చేసేందుకు కేంద్రం సిద్ధంగా లేదు. విద్యుత్ సవరణ బిల్లు ద్వారా రైతులకు ఉచిత విద్యుత్ ప్రమాదంలో పడనున్నది. క్రాస్ సబ్సిడీ పద్ధతి తొలగించడం ద్వారా సాధారణ గృహ వినియోగదారులకు కరెంటు బిల్లు పెరిగే అవకాశం ఉన్నది. పెట్టుబడిదారులకు మాత్రం బిల్లు తగ్గుతుంది. కోట్లమంది రైతుల జీవితాలను బజారుపాలు చేస్తున్నది కేంద్రం.

సంక్షేమ బడ్జెట్‌కు మోడి సర్కార్ కోత పెడుతున్నది. స్కీం వర్కర్ల భారం తగ్గించుకునే ప్రయత్నంలో ఉన్నది. మహిళా, శిశు సంక్షేమ శాఖకు, వైద్య, ఆరోగ్య శాఖకు నిధులు తగ్గించారు. అంగన్‌వాడీ సేవలను ప్రయివేటుపరం చేసేందుకు వేగంగా పావులు కదుపుతున్నది. గ్రామీణ పేదల మద్దతు కూడగట్టకుండా స్కీమ్ వర్కర్ల ప్రయోజనాలు గానీ, నిరుపేద లబ్ధిదారుల ప్రయోజనాలుగానీ కాపాడడం సాధ్యం కాదు. ఒకవైపు నిరుద్యోగం గత యాభై సంవత్సరాల్లో ఎప్పుడూ లేని స్థాయికి చేరి ఉపాధి సమస్యలు పెరిగాయి. అయినప్పటికీ ఉపాధి హామీ నిధులకు కోతపెట్టింది. కేంద్ర బడ్జెట్‌లో ఎరువులు, ఆహార సబ్సిడీకి కూడా కోత పెట్టింది. మోడి అధికారంలోకి వచ్చిననాడు అంతర్జాతీయ మార్కెట్లో చమురు ధరతో పోల్చితే, ఇప్పుడు దాదాపు సగానికి పడిపోయినప్పటికీ మోడి ప్రభుత్వం పెంచిన పన్నుల వల్ల పెట్రోల్, డీజిల్ ధరలు బాగా పెరిగాయి. ఇది అన్ని రకాల నిత్యజీవితావసర సరుకుల ధరల పెరగుదలకు దారితీసింది. ప్రభుత్వం దగ్గర వనరుల కొరత వల్లన ఈ చర్యలు తప్పటం లేదని కేంద్రం సమర్థించుకుంటున్నది. కానీ అసలు కారణం మాత్రం ఇదికాదు. కరోనా కల్లోలంతో ప్రజల బతుకులు చితికిపోయాయి. ఆర్థికవ్యవస్థ మరింత దిగజారింది. కానీ అనూహ్యంగా మోడి ప్రియమిత్రులు ఆదాని, అంబానిల ఆస్తులు వేగంగా పెరిగాయి. ప్రపంచ కుబేరులలో రెండవ స్థానంలో ఉన్న ఎలాన్ మస్క్ సంపాదించిన లాభాల కన్నా ఆదాని పెంచుకున్న లాభాలు ఎక్కువ. గత సంవత్సర కాలంలో మూడు లక్షల అరవై మూడు వేల కోట్ల విలువైన సంపదను అదనంగా పోగేసుకున్నాడు. అంబాని సుమారు లక్షా ముప్పై మూడు వేలకోట్ల రూపాయల విలువైన సంపద పెంచుకున్నాడు. శత కోటీశ్వరుల సంపద 35 శాతం పెరిగింది. అయినా... కరోనా కాలంలో వీరికి పదిశాతం కార్పొరేట్ పన్ను రాయితి ఇచ్చింది కేంద్రం. గోదాముల్లో ఏడున్నర కోట్ల టన్నుల ధాన్యం గుట్టలుగా పడిఉన్నా, పేదలకు ఉచితంగా పంచడానికి మాత్రం ఒప్పుకోలేదు. పెట్టుబడిదారులు శానిటైజర్లు ఉత్పత్తి చేసుకుని లాభాలు గడించడానికి వీలుగా ఈ ధాన్యం సరఫరాకు అనుమతిచ్చింది. మోడి ప్రధాని అయిన తర్వాత ప్రభుత్వరంగ బ్యాంకులకు బడా బాబులు చెల్లించాల్సిన రు. 9 లక్షల కోట్ల మొండి బకాయిలను మాఫీ చేసింది. దీనితో డిపాజిటర్ల సొమ్ముకు భద్రత లేకుండా పోయింది. మొండి బకాయిలు రు.13 లక్షల కోట్లకు చేరాయి. ఇవన్నీ పరిశీలిస్తే కరోనా కష్టకాలంలో కూడా పేదల ప్రయోజనాలు విస్మరించి, బడా పెట్టుబడిదారుల బొజ్జలు పెంచేందుకు సహకరించింది. ప్రజల మీద భారాలు మోపింది. వనరుల కొరత కాదు. వాటిని బడాబాబులకు ధారాదత్తం చేసింది. అవినీతి విషయంలో కూడా గత యుపిఎ ప్రభుత్వంతో పోటీపడుతున్నది. రాఫెల్ యుద్ధ విమానాల కుంభకోణం కూడా అంబానిల కోసమేనని తేలింది. ఇందులో సాక్షాత్తూ ప్రధాని మోడి పాత్ర కూడా అనుమానాస్పదం. మూడు ప్రభుత్వరంగ బ్యాంకులకు అంబాని కంపెనీలు ఎగవేసిన డబ్బు, విజయమాల్యా ఎగవేసిన దానికి పదిరెట్లు ఎక్కువ.

కేంద్రం కార్మికుల హక్కులు కాలరాస్తున్నది. రైతుల జీవితాలతో చెలగాటమాడుతున్నది. ప్రజల మీద భారాలు మోపుతున్నది. ప్రజల నిరసనను అణచివేసేందుకు, ప్రశ్నించే వారి గొంతు నులిమేందుకు నిరంకుశ విధానాలు అమలు చేస్తున్నది. ఇడి, ఎన్నికల కమిషన్, సిబిఐ లాంటి స్వతంత్ర రాజ్యాంగ సంస్థలను ప్రధాని చేతుల్లో

పావులుగా మలచుకున్నారు. న్యాయ వ్యవస్థ మీద కూడా ఒత్తిడులు పెరిగాయి. రాష్ట్రాల హక్కులూ, అధికారాలను ఖాతరు చేయడం లేదు. ఫెడరల్ స్ఫూర్తికి భిన్నంగా వ్యవహరిస్తున్నది. ఒకేదేశం, ఒకే ఎన్నిక పేరుతో ప్రజాస్వామ్య విలువలు మంటగలిపే ప్రయత్నంలో ఉన్నది. కాంగ్రెస్ పాలనలో కూడా ఇలాంటి నియంతృత్వ పోకడలు చూశాం. ప్రజా వ్యతిరేక విధానాలు, నియంతృత్వ పోకడలను బిజెపి పాలనలో మరింత దూకుడుగా అమలు చేస్తున్నారు. మరోవైపు మతాన్ని రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకుంటున్నది. ప్రజల మధ్య మతపరమైన విభజన సృష్టించి, శ్రామికుల ఐక్యతను విచ్ఛిన్నం చేసేందుకు ప్రయత్నిస్తున్నది. పౌరసత్వ సవరణ చట్టం, ఎన్‌పిఆర్, ఎన్ఆర్‌సిల పేరుతో భయానక వాతావరణం సృష్టిస్తున్నది. పాకిస్తాన్, చైనా వంటి దేశాలను బూచిగా చూపించి జాతీయ దురభిమానాన్ని రెచ్చగొడుతున్నది. సమస్యలనుంచి ప్రజల దృష్టి మరలిస్తున్నది.

రైతు వ్యతిరేక చట్టాలు, విద్యుత్ సవరణ బిల్లు వంటి విషయాల్లో నామమాత్రంగా ఖండించి వదిలేస్తున్నది కాంగ్రెస్. బడా పెట్టుబడిదారుల ప్రయోజనాలకోసమే పనిచేస్తూ వచ్చిన కాంగ్రెస్ ... ఇప్పుడు ఆ విధానాలకు వ్యతిరేకంగా ప్రజలను సమీకరించి పోరాడటానికి సిద్ధంగా లేదు. బడా పెట్టుబడిదారుల ప్రయోజనాలు కాపాడే రాజకీయ సాధనాలుగా బిజెపి, కాంగ్రెస్‌లు పనిచేస్తున్న విషయం తెలిసిందే. వీరిలో ఎవరు అధికారంలో ఉన్నా చేసే పని అదే. కానీ లౌకిక విధానాల కోసం నిలబడతానని చెప్పుకునే కాంగ్రెస్ ఆచరణలోబిజెపి, ఆర్ఎస్ఎస్ మతోన్మాద విధానాల మీద పోరాటానికి, లౌకిక విలువల పరిరక్షణ కోసం ప్రజలను సమీకరించేందుకు సిద్ధంగా లేదు. అరకొర విమర్శలకు పరిమితమవుతున్నది. కేరళలో వామపక్ష ప్రభుత్వానికి వ్యతిరేకంగా బిజెపితో చేతులు కలపడానికి కూడా వెనకాడడం లేదు. రాహుల్‌గాంధీతో సహా తామే అసలైన హిందువులుగా రుజువు చేసుకునే పనిలో పడ్డారు. ఉదార హిందుత్వ విధానాలతోనే బిజెపిని ఎదుర్కోవాలని విఫలయత్నం చేస్తున్నారు. సూత్రబద్ధమైన పోరాటానికి సిద్ధంగా లేరు. అవకాశవాదం ప్రదర్శిస్తున్నారు. ఇలాంటి ధోరణుల ఫలితంగానే బిజెపి విధానాలకు వ్యతిరేకంగా కాంగ్రెస్ శ్రేణులను నిలబెట్టలేకపోతున్నది. ఏపిలో రాష్ట్ర విభజన సందర్భంగానే కాంగ్రెస్ బలహీనపడింది.

> **“ బడా పెట్టుబడిదారులకు, భూస్వాములకు సహజంగానే కమ్యూనిస్టు ఉద్యమం గిట్టదు. మార్కెట్ మీద బడాపెట్టుదారుల పట్టు కోసం ప్రాంతీయ పార్టీలు బలపడటాన్ని వ్యతిరేకిస్తారు. అయితే బిజెపి, లేకుంటే కాంగ్రెస్ పార్టీకి కేంద్రంలో పూర్తి మెజారిటీ సాధించి తమ ప్రయోజనాలు కాపాడాలని కోరు కుంటారు. ఇందుకు అవకాశం లేనప్పుడు కనీసం వామపక్ష ప్రభావం లేని ప్రాంతీయ పార్టీల కూటమిని కోరుకుంటారు. ”**

ఇప్పుడు తెలంగాణలో కాంగ్రెస్ నేతలు బిజెపి వైపు గోడదూకేందుకు సిద్ధంగా ఉన్నారు.

బడా పెట్టుబడిదారులకు, భూస్వాములకు సహజంగానే కమ్యూనిస్టు ఉద్యమం గిట్టదు. కార్మిక, కర్షక ఉద్యమాన్ని సహించజాలరు. బూర్జువా, భూస్వామ్య పార్టీలే అయినప్పటికీ ప్రాంతీయ పార్టీల ప్రభుత్వాలను కూడా భరించలేరు. మార్కెట్ మీద బడాపెట్టుదారుల పట్టు కోసం ప్రాంతీయ పార్టీలు బలపడటాన్ని వ్యతిరేకిస్తారు. అయితే బిజెపి, లేకుంటే కాంగ్రెస్ పార్టీకి కేంద్రంలో పూర్తి మెజారిటీ సాధించి తమ ప్రయోజనాలు కాపాడాలని కోరుకుంటారు. ఇందుకు అవకాశం లేనప్పుడు కనీసం వామపక్ష ప్రభావం లేని ప్రాంతీయ పార్టీల కూటమిని కోరుకుంటారు.

దేశ ఆర్థిక వ్యవస్థను, మార్కెట్‌నూ తమ గుత్తాధిపత్యంలోకి తీసుకోవడం కోసమే ప్రాంతీయ పార్టీల మీద, రాష్ట్రాల హక్కుల మీద దాడి చేస్తారు. ఇప్పుడు కేంద్రంలో మోడీ ప్రభుత్వం చేస్తున్న పని అదే. ప్రయివేటీకరణ విధానాల అమలుకు, నిధులు కేటాయింపునకు ముడిపెడుతున్నది. మోటార్ వాహనాల చట్టం సవరించింది. అన్ని రాష్ట్రాల్లో ఆర్టీసీలు బలహీనపడిపోయే విధంగా మార్పులు చేసింది. రాష్ట్రాలకు చట్టబద్ధంగా రావాల్సిన నిధులు, వాటా ఇవ్వడం లేదు. జిఎస్‌టి పేరుతో నిధుల మీద పట్టు బిగించింది. ఒకే దేశం, ఒకే ఎన్నికలు పేరుతో చేసే మార్పులు ప్రాంతీయ పార్టీల అస్తిత్వానికే ప్రమాదం. తమ రాజకీయ ప్రయోజనాల కోసం తమ వెనకున్న శక్తుల ఆర్థిక ప్రయోజనాల కోసమైనా వారు కేంద్రంలో బిజెపి ప్రభుత్వంతో పోరాడటానికి సిద్ధపడాలి. రాష్ట్రాల హక్కుల కోసం, ఆదాయంలో వాటా కోసం, ఫెడరల్ రాజ్యాంగ విలువల కోసం, లౌకిక విధానాల కోసం మోడీ ప్రభుత్వంతో, బిజెపి విధానాలతో పోరాడాలి. కానీ సరళీకృత ఆర్థిక విధానాలతో ప్రయోజనం పొందుతున్న ప్రాంతీయ పార్టీలు మోడీ పాలన పట్ల, బిజెపి విధానాల పట్ల అవకాశవాదం ప్రదర్శిస్తున్నాయి. కేంద్రంతో లాలూచీ కుస్తీ అమలు చేస్తున్నాయి. ఉభయ తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నాయి. పేదలకు కొంత ఊరటనిస్తున్నాయి. ఈ పథకాలే తమను కాపాడుతున్నాయని భావిస్తున్నాయి. లౌకిక విలువల విషయంలో మతానికి, రాజకీయాలకు సంబంధం ఉండకూడదన్న సూత్రబద్ధవైఖరి మీద గట్టిగా నిలబడే బదులు, ఈ ప్రభుత్వాల అధినేతలు అవకాశవాదం ప్రదర్శిస్తున్నారు. తమను మించిన హిందువులులేరని చెప్పుకునే ప్రయత్నంలో ఉన్నారు. వీరి బలహీనతను ఉపయోగించుకుని వీరిని లొంగదీసుకునేందుకు మోడి ప్రభుత్వం ప్రయత్నిస్తున్నది. తెలంగాణలో కాంగ్రెస్ శ్రేణులను, ఏపిలో టిడిపి శ్రేణులను ఆకర్షించే ప్రయత్నంలో బిజెపి ఉన్నది. తెలంగాణలో ముస్లిం వ్యతిరేకత, ఏపిలో క్రైస్తవ వ్యతిరేకతను ఉపయోగించుకుని హిందువుల ఓటు బ్యాంకు సృష్టించుకునే ప్రయత్నంలో ఉన్నది. ఈ ప్రయత్నాల్లో బిజెపి జయప్రదమైతే తెలుగు ప్రజల బతుకులు పెనం మీద నుండి పొయ్యిలో పడినట్టే. బిజెపి పాలిత రాష్ట్రాల్లో అనేక ప్రమాదకరమైన ధోరణులు ఇప్పటికే చూస్తున్నాం. గోవధ నిరోధక చట్టం అమలు బాధ్యతను పోలీసులకు పరిమితం చేయకుండా ప్రైవేటు సైన్యాలను కూడా భాగస్వాములను చేస్తున్నారు. గోవధను అడ్డుకునే పేరుమీద సంఘపరివార్ మూకదాడులకు చట్టబద్ధత కల్పిస్తున్నారు. కశ్మీర్ మైనర్ బాలికమీద జరిగిన లైంగిక దాడివిషయంలో కానీ, ఉత్తరప్రదేశ్ లోని హత్రాస్‌లో దళిత బాలిక మీద జరిగిన సామూహిక లైంగిక దాడి విషయంలో గానీ ప్రభుత్వాలు నేరస్థులను రక్షించేందుకు ప్రయత్నించాయి. యుపిలో సాక్షాత్తూ లైంగిక దాడికి పాల్పడిన బిజెపి ఎమ్మెల్యేను కూడా రక్షించేందుకు యోగి ప్రభుత్వం చివరిదాకా ప్రయత్నించింది. బాధితురాలి కుటుంబాన్ని

(మిగతా 34వ పేజీలో)

# ఇనుప యుగం

ఎంవిఎస్ శర్మ



రచయిత ప్రజాశక్తి సంపాదకులు

మలి వేద కాలం తర్వాత క్రీ.పూ. 700 నుంచి క్రీ.పూ.350 మధ్య కాలాన్ని పరిశీలిస్తే ఆ దశలో ఇనుము తయారీ, ఇనుప పనిముట్ల వాడకం విస్తరించడం, ఆ ఇనుప పనిముట్ల వాడకంతో మానవులు తమ శ్రమ ద్వారా సాధించగలిగే ఉత్పత్తి అనేక రెట్లు పెరగడం కనిపిస్తుంది. ఈ కాలంలో భారత ఉపఖండంలో జరిగిన సామాజిక మార్పుల వెనుక ఇదే ప్రధాన చోదక శక్తిగా మనకు కనపడుతుంది.

మలివేదకాలం నాటికే ఇనుము వాడకం మొదలైనట్టు మనకు ఆధారాలు ఉన్నాయని ఇదివరకే చెప్పుకున్నాం. ఐతే అది చాలా పరిమితమైనది. రాగి లోహం తయారీలో కొన్ని చోట్ల ఒక ఉప ఉత్పత్తిగా ఇనుము తయారీ జరగడం, భూమి ఉపరితలంమీద ఉల్కాపాతాల ద్వారా ఇనుము, నికెల్ వంటి లోహాల మిశ్రమాల ముక్కలు దొరికితే వాటిని వేడిచేసి సాగగొట్టి పనిముట్లనో, ఆయుధాలనో తయారు చేయడం జరిగింది.

రాగి పనిముట్ల వాడకం నుండి ఇనుప పనిముట్ల వాడకం వైపు మళ్ళడం ఏక కాలంలో అనేక చోట్ల జరిగివుంటుందనే నిర్ధారణకు మనం రాలేము. ఎందుకంటే ఇనుప ఖనిజాన్నుంచి వాడకానికి పనికివచ్చే ఇనుమును తయారు చేయడం ఒక సంక్లిష్టమైన ప్రక్రియ. ఈ ఇనుము తయారీ విధానం ఒక దగ్గర మొదలై, వివిధ ప్రాంతాలకు వేగంగా వ్యాపించివుండాలి. దక్షిణాది ప్రాంతంలో ఇనుప పనిముట్ల వాడకం దేశంలో చాలా ఇతర ప్రాంతాలలో కన్నాముందే మొదలైనట్టు మనకు ఆధారాలున్నాయి. కాని దక్షిణాదిన ఖనిజం తవ్వి దానినుండి ఇనుము పోత పోసిన ప్రక్రియ దేశంలో తక్కిన ప్రాంతంలో కన్నా ముందు మొదలైందని భావించలేము. ఎందుకంటే దక్షిణాది ప్రాంతంలో రాగిని కరిగించి పోత పోయడం అనేదే చాలా తక్కువగా జరిగింది. అందువలన రాగి ఉత్పత్తి నుండి ఇనుము తయారీకి సంబంధించిన సాంకేతిక పరిజ్ఞానం దక్షిణాదిన అభివృద్ధి చెందే అవకాశం లేదు.

సుమారు క్రీ.పూ. 700 కాలంలో ఉత్తరాదిన గంగా మైదాన ప్రాంతంలో ఇనుము తయారీకి సంబంధించిన సాంకేతిక పరిజ్ఞానం కనుగొనివుండాలి. అక్కడినుండి దేశంలో వివిధ ప్రాంతాలకు అది విస్తరించి ఉండాలి.

ఇందుకు సంబంధించి మన ప్రాచీన లిఖిత ఆధారాలు చాలానే ఉన్నాయి. వేద సాహిత్యంలోనే గాక, పాళీ భాషలో రచించిన బౌద్ధ గ్రంథాలలో, జైన గ్రంథాలలో, ఆ కాలంలో బాగా ప్రాచుర్యం పొందిన జాతక కథలలో ఇనుప పనిముట్ల గురించి, వాటిని తయారు చేసే వారిగురించి, ఇనుప ఆయుధాలను ఉపయోగించి విధించే శిక్షల గురించి పలు ప్రస్తావనలు ఉన్నాయి.

ఆ కాలంలో భారత ఉపఖండంలో ఇనుపయుగం ప్రధానంగా ఉనికిలో ఉండిన ప్రాంతాలు పురావస్తు త్రవ్వకాలద్వారా బైటపడి, శాస్త్రీయంగా నిర్ధారించబడినవి ఈ విధంగా ఉన్నాయి;

**ఉత్తరాదిలో:–**

1. అత్రంజిఖేర (ఇది పశ్చిమ ఉత్తర ప్రదేశ్‌లో ఉంది) ఇక్కడ క్రీ.పూ. 640–400 మధ్య కాలంలో పలు రకాల ఇనుప పనిముట్లను తయారు చేసి ఉపయోగించిన దాఖలాలు ఉన్నాయి. (చూ. ఫిగర్ 1.1.)

2. హస్తినాపురం (ఇది ప్రస్తుత హర్యానాలో ఉంది) ఇక్కడ విల్లంబులు, ఉలులు, కొడవళ్ళు వంటి ఇనుప పనిముట్లు, ఆయుధాలు లభించాయి. ఇవి క్రీ.పూ, 600 – 400 మధ్య కాలానివి.

3. కౌశాంబి: ఇది ఉత్తర బీహార్‌లో ఉంది. ఇక్కడ ఎముకలకు ఇనుప ములికిలను అమర్చి బాణాలుగా ఉపయోగించిన దాఖలాలు లభించాయి. ఇవి కూడా క్రీ.పూ. 600– 400 మధ్య కాలానికి చెందినవే.

**మధ్య భారతం:–**

1. నాగ్డ: ఇది ఉత్తర మధ్య ప్రదేశ్‌లో ఉంది. క్రీ.పూ. 700–500 మధ్య కాలానికి చెందిన ఇనుప గొడ్డళ్ళు, కత్తులు,బాకులు, కొడవళ్ళుగరిటెలు, మేకులు వంటివి లభించాయి.

2.త్రిపురి: ఇది మధ్య ప్రదేశ్‌లో ఉంది. ఇక్కడ క్రీ.పూ.400 నాటి ఇనుప వస్తువులు లభించాయి.

3.ఉజ్జయిని: ఇది కూడా మధ్య ప్రదేశ్‌లోనే ఉంది. ఇక్కడ క్రీ.పూ.500 నాటి ఇనుప వస్తువులు లభించాయి. అంతేగాక కమ్మరి కొలిమిలు, ఇనుపఖనిజపు గుట్టలు కూడా లభించాయి.

**దక్కను ప్రాంతం:–**

1. ప్రకాష్: ఈ ప్రాంతం మహారాష్ట్రలోని ధులియా జిల్లాలో ఉంది. ఇక్కడ క్రీ.పూ. 600–300 మధ్య కాలంనాటి ఇనుప వస్తువులు లభించాయి. ఈటెల మొనలు, బాణాల ములికిలు, కత్తులు, ఉలులు వంటివి దొరికాయి.

2. బహల్, తెక్వాడ ప్రాంతాలు: ఇవి కూడా మహారాష్ట్రలోనివే. ప్రకాష్ ప్రాంతంలో మాదిరి ఇనుప వస్తువులే, దాదాపు అదే కాలానికి చెందినవి ఇక్కడ కూడా లభించాయి.

**వాయవ్య భారతం:–**

1. రైర్హ్ : ఇది తూర్పు రాజస్థాన్‌లో ఉంది. ఇక్కడ క్రీ.పూ. 300 కాలంనాటికి చెందినవిగా భావించబడుతున్న కత్తులు, బాకులు, ఈటెలు, శూలాలు, కొడవళ్ళు, గొడ్డళ్ళు, మేకులు, ద్వారబంధాలు, గొలుసులు వంటివి లభించాయి.

2. రూపర్: ఇది పంజాబ్ రాష్ట్రంలోని అంబాలా జిల్లాలోని ప్రాంతం. ఇక్కడ కూడా వివిధ రకాల ఇనుప ఆయుధాలు, పనిముట్లు లభించాయి.

3. తక్షశిల: ఇది ప్రస్తుత పాకిస్థాన్‌లో ఉంది. ఇక్కడ క్రీ.పూ. 500 నాటి ఇనుప వస్తువులు లభించాయి.

4. తెపె ముండిగక్: ఇది ఆఫ్ఘనిస్తాన్ లో ఉంది. ఇక్కడ క్రీ.పూ.700 నాటి ఇనుప వస్తువులు దొరికాయి.

" బౌద్ధ గ్రంథం వినయ పిటకలో ఇనుపయుగం నాటి ప్రజల వ్యవసాయ పరిజ్ఞానం గురించి వివరాలు చాలా ఉన్నాయి. దుక్కి దున్నడం, విత్తులు జల్లడం, సాగునీటి సరఫరా, కలుపుతీత, పంటల కోత, ధాన్యం తూర్పార బట్టడం వంటి రకరకాల పనులు ఆనాటి ప్రజలు చేయగలిగే వారు. నాగలి, కొడవలి, పార, పలుగు వంటి పరికరాలు ఉపయోగించారు. "

**గుజరాత్ లో:-**

1. తింబర్వ: ఇది బరోడా ప్రాంతంలో ఉంది.

2. కథియవార్: ఇది గుజరాత్ రాష్ట్రంలో ఉంది. మొత్తంగా గుజరాతలో దాదాపు 369 ఇనుపయుగం నాటి జనపదాలు ఇక్కడ తవ్వకాలలో బైటపడ్డాయి. నర్మద పరీవాహక ప్రాంతం దగ్గర్లో ఇవి ఎక్కువగా ఉన్నాయి. ఈ ప్రాంతంలో ఇనుపయుగం క్రీ.పూ. 800-700 కాలంలో ప్రారంభం అయింది.

**తూర్పుభారతంలో:-**


1. సోనాపూర్: బీహార్ లోని గయ ప్రాంతం

2.అగియాబిర్: తూర్పు ఉత్తర ప్రదేశ్‌లోని మీర్జాపూర్ జిల్లా ఇంకా మనేర్, తారాదిహ్, చిరండ్, నర్హన్ వంటి సైట్లు ఉన్నాయి.

మొత్తంగా ఉత్తర భారతంలోని వివిధ ప్రదేశాలలో బైటపడిన పురావస్తు ఆధారాల ప్రకారం ఇనుపయుగం ఈ ప్రాంతంలో క్రీ.పూ. 800- 500 మధ్య కాలంలో విస్తరించిందని నిర్ధారించవచ్చు. ముఖ్యంగా క్రీ.పూ. 600-400 మధ్య కాలంలో ఈ యుగం ఎక్కువ ప్రాంతాలకు విస్తరించిందని, వైవిధ్యంగల వస్తువులను ఉత్పత్తి చేయగల సాంకేతికత అభివృద్ధి చెందిందని బోధపడుతుంది.

**దక్షిణాదిలో:-**

విదర్భ నుండి శ్రీలంక దాకా దాదాపు 830 చోట్ల ఇనుపయొగపు అవశేషాలు త్రవ్వకాలలో లభించాయి. ఇనుము వాడకం క్రీ.పూ. 1000 నాటినుండీ ఉన్నప్పటికీ పెద్ద ఎత్తున ఇనుప ఆయుధాలను, పనిముట్లను తయారు చేయడం క్రీ.పూ. 600 ప్రాంతంలో జరిగివుండాలి. ఇనుప పనిముట్లను ఉత్పత్తి చేయగల సామర్థ్యం సంతరించుకున్నతర్వాతనే నదీ తీరాల వెంబడి ఎక్కువగా జనావాసాలు పెరిగి వ్యవసాయం విస్తరించినట్టు ఈ త్రవ్వకాలు తెలియజేస్తున్నాయి. (చూ. మ్యాప్ నెం. 1.1)




**వ్యవసాయం**

బౌద్ధ గ్రంథం వినయ పిటకలో ఇనుపయుగం నాటి ప్రజల వ్యవసాయ పరిజ్ఞానం గురించి వివరాలు చాలా ఉన్నాయి. దుక్కి దున్నడం, విత్తులు జల్లడం, సాగునీటి సరఫరా, కలుపుతీత, పంటల కోత, ధాన్యం తూర్పారబట్టడం వంటి రకరకాల పనులు ఆనాటి ప్రజలు చేయగలిగేవారు. నాగలి, కొడవలి, పార, పలుగు వంటి పరికరాలు ఉపయోగించారు. వివిధ రకాల వరి ధాన్యాలు, గోధుమ, బార్లీ, జన్న, బఠాణీ, ఓట్లు, నువ్వులు, ఆకుకూరలు, చెరుకు వంటి పంటలను పండించారు. చెరుకు నుండి బెల్లం తయారు చేయడం, నువ్వులు, ఆముదపు గింజలు, ఆవాలు వంటి తిలధాన్యాలనుండి నూనె తీయడం, పత్తి, జనుము వంటి పంటలనుండి దారం, నార తీయడం, మంజిష్ట ( ఇదొక పసుపుపచ్చని పూలు పూసే మొక్క. దీని వేళ్ళనుండి ఎర్రని రంగు కల ద్రవాన్ని తీస్తారు), నీలిమందు మొక్క లనుండి బట్టలకు ఉపయోగించే రంగు ద్రావకాలను తయారు చేయడం, మిరియాలు, పసుపు, అల్లం, వెల్లుల్లి, ఉల్లి, బీట్రూట్ వంటి పంటలు ఆనాటికి ఉన్నట్టు వినయ పిటకలో చుల్లవగ్గ అనే అధ్యాయంలో వివరంగా ఉంది.

జైన ఆగమాలలో వ్యవసాయ భూములను రెండు రకాలుగా వర్గీకరించారు. మొదటి రకం భూములను 'సేతు' అని ( అంటే ఆనకట్టల దిగువన సాగు చేసే భూములు) రెండో రకం భూములను 'కేతు' అని (అంటే వర్షాధార భూములు) అని విభజించారు. ధర్మ శాస్త్రాలలోను, అర్థ శాస్త్రంలోను సైతం ఈ సేతు ప్రస్తావన ఉంది. బృహత్కల్పభాష్యంలో గుజరాత్, పశ్చిమ భారతంలో వాననీరే ప్రధాన వనరు అని, వాయవ్య ప్రాంతంలో నదుల నీరు ప్రధాన వనరు అని, ఉత్తర భారతంలో నూతులు ప్రధానం అని, దక్షిణాదిన చెరువులు ప్రధాన ఆధారం అని పేర్కొన్నారు.

> **“ అంతకుముందు కాలపు జనావాసాలతో పోల్చితే ఇనుపయుగపు జనావాసాల పరిధి మూడు నుంచి ఏడు, ఎనిమిది రెట్లు ఎక్కువగా ఉంది. కాలినడకన, జంతువులపైన చేసే ప్రయాణలతో పోల్చితే బండ్లు ప్రధాన ప్రయాణ సాధనాలయాయి. బండ్ల చక్రాలకు ఇనుప చువ్వలు అమర్చగలగడంతో సామర్థ్యం బాగా పెరిగింది. ”**

పండిన ధాన్యాన్ని నిలవ ఉంచడానికి వెదురుతో చేసిన పెద్ద బుట్టలను ఉపయోగించేవారు. వాటికి మట్టి, పేడ కలిపిన మిశ్రమం చుట్టూ పట్టించి పురుగులు పట్టకుండా చూశారు. ఆహార ధాన్యాలు మూడేళ్ళ వరకూ, పప్పు విత్తులు అయిదేళ్ళ వరకూ, నూనె గింజలు ఏడేళ్ళ వరకూ ఆ విధంగా నిలవ ఉంచగలిగినట్టు భగవతి అనే గ్రంథం బట్టి తెలుస్తోంది.

వ్యవసాయం విస్తరణతో పశువులను మాంసం కోసం చంపడం తగ్గి వ్యవసాయ పనులలో వాటిని ఉపయోగించడం పెరిగింది.

**భౌతిక సంస్కృతి – ఇతర అంశాలు**


అంతకుముందు కాలపు జనావాసాలతో పోల్చితే ఇనుపయుగపు జనావాసాల పరిధి మూడు నుంచి ఏడు, ఎనిమిది రెట్లు ఎక్కువగా ఉంది. కాలినడకన, జంతువులపైన చేసే ప్రయాణలతో పోల్చితే బండ్లు ప్రధాన ప్రయాణ సాధనాలయాయి. బండ్ల చక్రాలకు ఇనుప చువ్వలు అమర్చగలగడంతో సామర్థ్యం బాగా పెరిగింది.

జేగురుమట్టి తో చేసిన దేవతామూర్తుల విగ్రహాలు ఉత్తరాదిన అహిచ్ఛత్ర, రాజ్‌ఘాట్, బక్సర్, పాటలీపుత్రం, చిరాంద్, కౌశాంబి, మథుర వంటి ప్రాంతాల్లో విస్తీరంగా లభించాయి. ఇవి క్రీ.పూ,600 కాలం నాటివి. క్రీ.పూ. 300 నాటికి చేతితో చేసిన విగ్రహాలతోబాటు అచ్చులను ఉపయోగించి విగ్రహాలు చేయడం ప్రారంభం అయింది. ఈ విగ్రహాలలో అత్యధికం స్త్రీ మూర్తులుగా ఉన్న దేవతా విగ్రహాలు. పైభాగం మానవాకృతి ఉండి, దిగువ భాగం పాము ఆకారం ఉన్న నాగిని విగ్రహాలు, చాలా పట్టణాల్లో లభించాయి. ఇవిగాక ఏనుగు, ఎద్దు, గుర్రం, పంది, కుక్క, కోతి వంటి జంతువుల విగ్రహాలు కూడా దొరికాయి. వీటిలో కొన్నింటికి రకరకాల రంగులు అద్ది, అలంకారాలు కూడా చేశారు.

రాగితో చేసిన చెవి శుభ్రం చేసుకునే పుల్లలు, పళ్ళు శుభ్రం చేసుకునే పుల్లలు, దంతంతో చేసిన దువ్వెనలువాడకంలో ఉన్నట్టు ఆధారాలు దొరికాయి. ఎముకలతో, ఏనుగు దంతాలతో చేసిన వివిధ రకాల ఆకారాల ఆటవస్తువులు (పాచికలు వంటివి, తొక్కుడు బిళ్ళలు వగైరా) లభించాయి.

గాజు, కెంపులు, నీలమణి, మరకతం వంటి వివిధ రకాల రంగురాళ్ళతో చేసిన పూసలు క్రీ.పూ. 600-300 మధ్య కాలంలో చాలా చోట్ల ఎక్కువ సంఖ్యలో లభించాయి. రంగురాళ్ళనుంచి తయారు చేసిన చేతిగాజులు దొరికాయి.

సింధునాగరికత కాలంలో మనం నూతుల గురించి తెలుసుకున్నాము. ఆ తర్వాత కాలంలో నూతులు లేవు. మళ్ళీ క్రీ.పూ. 600 తర్వాత నూతులు తవ్వి వినియోగించిన ఆధారాలు కనిపించాయి. ఈ నూతులలో పక్కలనుండి మట్టి జారిపడిపోకుండా జేగురుతో చేసిన మట్టి చట్రాలను అమర్చారు. అట్టడుగున ఈ చట్రాల వ్యాసం ఒకటిన్నర అడుగులుంటే పైకొచ్చేసరికి దాదాపు నాలుగు అడుగుల వరకూ ఉంది. రెండు అడుగుల లోతు నుండి 25 అడుగుల లోతు వరకూ ఈ నూతులు ఉన్నాయి.




**అత్రంజిఖేరా వద్ద లభ్యమైన ఇనుప పనిముట్లు: 1 నుండి 3 క్లాంపులు, 4,5 రింగులు, 6 నుండి 8 సోకెట్లు, 9 నాడా, 10 బోల్టు, 11 వడంబం**

**(సశేషం)**

సామాజిక న్యాయం

# ప్రతిభ -సమర్ధత: రిజర్వేషన్లు



రచయిత మార్క్సిస్టు మాసపత్రిక బాధ్యులు

ఎ. కోటిరెడ్డి

**2014**లో కేంద్రంలో అధికారంలోకి వచ్చిన తర్వాత బిజెపి-సంఘ్ పరివార్ ప్రభుత్వం రిజర్వేషన్ల వ్యతిరేక ప్రచారాన్ని తీవ్రం చేసింది. అభ్యుదయశక్తులను, అభ్యుదయ భావజాలాన్ని వ్యతిరేకిస్తూ, అభివృద్ధి నిరోధక శక్తులకు అన్ని విధాలైన ప్రోత్సాహాన్ని అందిస్తున్నది. ఫలితంగా కాలం చెల్లిన భావాలు, శక్తులు ముందుకొస్తున్నాయి. రిజర్వేషన్ల వలన ప్రతిభ గల వారికి అన్యాయం జరుగుతున్నదని, విద్య, ఉద్యోగాలలో సమర్ధులను వక్కన పెట్టి, అసమర్ధులు అవకాశాలను చేజిక్కించుకొంటున్నారన్న వాదనలను చాపకింద నీరులాగా ప్రచారం చేస్తున్నారు. ఎంతకాలం రిజర్వేషన్లను కొనసాగించాలి, ప్రతిభ ఉన్నవారు అన్యాయానికి గురికావాలి అనే ప్రశ్నలను ముందుకుతెస్తున్నారు. పై తరగతులలోని యువత, ప్రజలలో రిజర్వేషన్ల వ్యతిరేక భావాలను ఈ ప్రచారం మరింత తీవ్రం చేస్తున్నది. వాస్తవమేమిటంటే భారతదేశంలో వేల సంవత్సరాలుగా ఉన్నత కులాలకు చెందినవారే భూములు, సంపదలను తమ ఆధీనంలో ఉంచుకున్నారు. వాటిలోకి శూద్రులు, దళితులు, గిరిజనులు ప్రవేశించకుండా ఆంక్షలు విధించారు. వాటిని ధిక్కరించటానికి వీలులేకుండా చట్టపరమైన, సామాజిక, రాజకీయ పరమైన ఆంక్షలు విధించారు. వాటిని అతిక్రమించిన వారిని కఠినంగా శిక్షించారు. ఆ విధంగా సంపదలు, అభివృద్ధి అవకాశాలన్నింటినీ వారిచేతిలోనే పెట్టుకున్నారు. వాటిలో చాలా మేరకు ఈ నాటికీ కొనసాగుతున్నాయి. ఇప్పటికీ పై కులాలకు చెందినవారికి ఉన్న భూములు, సంపదలు, అవకాశాలతో పోల్చుకుంటే దిగువకులాలకు చెందిన ప్రజలు పొందుతున్నవి నామ మాత్రమే.

అయినప్పటికీ తమ రాజకీయ లక్ష్యాలను సాధించుకోవటం కోసం ఆర్ఎస్ఎస్-బిజెపి నాయకులు ఈ ప్రచారాన్ని మరింత తీవ్రం చేస్తున్నారు. రిజర్వేషన్లను సమీక్షించాలని ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ తరచుగా ప్రకటిస్తున్నారు. మంత్రులు కూడా ఇదే విధమైన ప్రకటనలు చేస్తున్నారు. రిజర్వేషన్లు పొందుతున్న తరగతుల ప్రజలు తమకు అర్హత లేకపోయినా ఈ ప్రయోజనాలు పొందుతున్నారన్న అర్థం ఈ ప్రకటనలలో ధ్వనిస్తుంటుంది. పాలకవర్గాలు కూడా ఇవే భావాలను ప్రజలలో ప్రచారం చేస్తున్నాయి. ఇటువంటి ప్రకటనలతో ఈ తరగతుల యువత ఆందోళన వ్యక్తం చేయటం ప్రారంభం కాగానే అటువంటిదేమీలేదని, రిజర్వేషన్లు కొనసాగుతాయని నన్నాయి నొక్కులు నొక్కుతున్నారు.

బిజెపి-ఆర్ఎస్ఎస్ నాయకులు అనాలోచితంగానో, పొరపాటునో ఇటువంటి ప్రకటనలు చేయటం లేదు. దళితులు, ఇతర వెనుకబడిన తరగతులపైకి పై కులాలోని యువతను రెచ్చగొట్టటంలో భాగంగా, ఉద్దేశ్యపూర్వకంగానే ఈ విధంగా చేస్తున్నారు. ఈ విధమైన ప్రకటనలు వెనుక ప్రభుత్వం, దానికి మద్దతిస్తున్న శక్తులు రిజర్వేషన్లకు వ్యతిరేకంగానే ఉన్నాయనే సందేశాన్ని ఇవ్వడంతో పాటు, రిజర్వేషన్లను వ్యతిరేకించేవారందరినీ ఐక్యం చేయాలనే లక్ష్యం కూడా ఉన్నది. ఆ విధంగా రిజర్వేషన్లకు వ్యతిరేకంగా రెచ్చగొట్టటం ద్వారా ప్రజలలో ప్రభుత్వంపై పెరుగుతున్న వ్యతిరేకతను దళిత, గిరిజన, మైనారిటీలపైకి మళ్ళించటం బిజెపి లక్ష్యం.

**ప్రతిభ వ్యక్తులుగా సంపాదించుకొనేది కాదు**

ప్రతిభ లేనివారంతా ఉద్యోగాలు, పదవులు పొందుతున్నారని, ప్రతిభ ఉన్నవారికి అవకాశాలు లేకుండా చేస్తున్నారనేది పూర్తిగా తప్పుడు ప్రచారం మాత్రమే. వ్యక్తులకు ప్రతిభ ఎలా వస్తుంది? ప్రతిభ అనేది పుట్టుకతో వచ్చేదో లేదా కొందరు వ్యక్తులకు మాత్రమే స్వంతమైనదో కాదు. ప్రతిభ సామాజికమైనది, చారిత్రకమైనది. సమాజం లేకుండా, సమాజంలో భాగంగా ఉండకుండా ఏ వ్యక్తికీ ప్రతిభ అనేది రాదు. మానవులు ప్రాథమిక దశలో సామాజిక జీవులుగా, గుంపులుగా జీవించే క్రమంలో ఆహార సంపాదన కోసం సామూహికంగా జంతువులను ఎదుర్కొని చంపి, వాటిని ఆహారంగా ఉపయోగించుకొనేవారు. మొదట జంతువులను చేతులతోనే ఎదుర్కొని వధించటం, తర్వాత చేతికందిన రాయినో, కర్రనో తీసుకొని కొట్టటం, తర్వాత దూరం నుండి రాయిని విసరివేయటం, బల్లెం తయారుచేసి పొడవటం, విల్లంబులను తయారు చేసి, దూరం నుండే జంతువులను చంపటం ఏ ఒక్కరి బుర్రలోనో పుట్టినవి కావు. తమ జీవనోపాధిని సంపాదించుకోవటం కోసం సమిష్టిగా చేసిన కృషి ద్వారా మానవులు లక్షల సంవత్సరాల అభివృద్ధి క్రమంలో వీటన్నింటినీ అభివృద్ధి చేసుకోగలిగారు. సమిష్టి కృషి ద్వారానే శక్తిసామర్ధ్యాలు, ప్రతిభ సాధించారు.

ఉదాహరణకు, పుట్టినపుడు చూస్తే పిల్లలలో ఎటువంటి ప్రత్యేకతలు ఉండవు. అందరూ సాధారణంగానే ఉంటారు. కాకపోతే కొందరు చురుకుగా ఉంటారు. కొందరు నిదానంగా ఉండటం మాత్రమే ఉంటుంది. ఇది కులాలు, మతాలు, ప్రాంతాలు, దేశాలతో నిమిత్తం లేకుండా అందరికీ వర్తిస్తుంది. బాలలకు పెద్దలు మతాన్ని గురించి చెప్పకుండా ఉంటే వారిలో ఎటువంటి మతభావాలు ఏర్పడతాయో పరీక్షించటం కోసం అక్బర్ ఇద్దరు బాలలను వేరుగా ఉంచి, ఎవరూ వారిని కలవకుండా, మాట్లాడకుండా ఉంచాడని, మాటలు నేర్పేవారు లేకపోవటంతో వారు మూగవారుగా మారారని, వారు ఏ విధమైన

> దేశంలోని వివిధ కులాల ప్రజల మధ్య అభివృద్ధి క్రమంలో ఏర్పడిన అసమానతలు సామాజిక జీవితంలోనూ ప్రతిబింబిస్తుంటాయి. భారత సమాజం కులాలు, మతాలు, ప్రాంతాలుగా విభజితమై ఉన్నది. ఆయా కులాలు, మతాలు, ప్రాంతాలలోని వివిధ కులాల ప్రజల అభివృద్ధికి అనుగుణంగానే వారి ప్రతిభ ఉంటుంది.

భావాలను వ్యక్తం చేయలేకపోయారని కథలలో చదివాం. సమాజంతో సంబంధాలు లేకుండా పెరిగితే ఎటువంటి పరిణామాలు సంభవిస్తాయో ఈ అంశం స్పష్టం చేస్తున్నది. ఇతరదేశాలతో పోలిస్తే భారతదేశంలోని వివిధ ప్రాంతాలు, ప్రతి ప్రాంతంలోని వివిధ సామాజిక తరగతుల మధ్య తీవ్రమైన అంతరాలు ఉన్నాయి. ఒకేప్రాంతం, ఒకే జిల్లా, ఒకే మండలం, ఒకే గ్రామంలో నివసిస్తున్న వివిధ సామాజిక తరగతుల ప్రజల మధ్య కూడా ఈ వైవిధ్యం కనిపిస్తుంది.

**కులాల మధ్య అసమానతలు**

దేశంలోని వివిధ కులాల ప్రజల మధ్య అభివృద్ధి క్రమంలో ఏర్పడిన అసమానతలు సామాజిక జీవితంలోనూ ప్రతిబింబిస్తుంటాయి. భారత సమాజం కులాలు, మతాలు, ప్రాంతాలుగా విభజితమై ఉన్నది. ఆయా కులాలు, మతాలు, ప్రాంతాలలోని వివిధ కులాల ప్రజల అభివృద్ధికి అనుగుణంగానే వారి ప్రతిభ ఉంటుంది. బ్రాహ్మణులు, క్షత్రియులు, వైశ్యులు, శూద్రులు, దళితులు, గిరిజనులు తదితర సామాజిక తరగతుల ప్రజల మధ్య ప్రతిభలో వ్యత్యాసాలుంటాయి. బ్రాహ్మణులు విద్యరీత్యా ఇతర కులాల కన్నా ఎక్కువగా అభివృద్ధి చెందారు. అందుకు కారణం విద్యను నేర్చుకోవటం, నేర్పటం ఆ కులానికి ప్రత్యేకించారు. విద్య నేర్చుకోవటం, దానిని ఉపయోగించి వివిధ సామాజిక కార్యకలాపాలు నిర్వహించటం వారి వృత్తి కాబట్టి వారు మిగతా అన్ని సామాజిక తరగతుల కన్నా విద్యలో ముందున్నారు. అందరికన్నా ముందుగా విద్య ద్వారా కొత్తకొత్త విషయాలను నేర్చుకున్నారు. రాజాస్థానాలలో చేరి, రాజగురువులుగా రాజులపైనా, ప్రజలపైనా పెత్తనం చేశారు. అగ్రహారాలు, పశువులు, బంగారం, ఇతర బహుమతులను పొంది, రాజుల తరువాత ధనికులుగా అవతరించారు. రాజ్యాలపైనా, మొత్తం సమాజంపైనా పెత్తనం చలాయించారు.

బ్రాహ్మణుల తర్వాత క్షత్రియులు అగ్రస్థానంలో కొనసాగారు. పాలకులుగా ఉన్న వీరు భూములు, సంపదలపై యాజమాన్యాన్ని సాధించటంతో పాటు, రాజ్యపాలన అవసరాల రీత్యా చదవటం, రాయటంతో పాటు యుద్ధ విద్యలను కూడా నేర్చుకున్నారు. బ్రాహ్మణుల మద్దతుతో రాజ్యంపైన, అంటే మొత్తం సమాజంపై తమ పెత్తనాన్ని కొనసాగించారు. ఆ విధంగా రాజ్యపాలన, సంపదలు, భూములపై యాజమాన్యం క్షత్రియులకు కట్టబెట్టారు. క్షత్రియులు కానివారు ఎవరైనా ఈ నియమానికి వ్యతిరేకంగా తమ శక్తిసామర్థ్యాలతో రాజ్యాలను జయించినా, వారిని రాజులుగా గుర్తించటానికి బ్రాహ్మణులు నిరాకరించారు. ఇపుడు శివాజీని తమ స్వప్రయోజనాల కోసం వినియోగించుకొంటున్న వీరు ఆయన మొగలులను ఓడించి రాజ్యాన్ని స్థాపించి, పట్టాభిషిక్తుడయేటపుడు ఆయనను రాజుగా గుర్తించటానికి అనేక ఆటంకాలు కల్పించారు. వివిధరకాలుగా అవమానించారు. ఇతర కులస్తులు రాజ్యాలు స్థాపించినపుడు కూడా అలాగే ఇబ్బందులు పెట్టారు. తాము కోరినంత ధన, కనక, వస్తు, వాహనాలు ఇచ్చిన తర్వాతనే వారిని రాజులుగా గుర్తించి, వారిని కీర్తిస్తూ ప్రచారం చేశారు. ఆ విధంగా రాజ్యాలను పాలించే హక్కు క్షత్రియులకు, క్షత్రియులుగా తాము ముద్ర వేసిన వారికి కట్టబెట్టారు.

వర్తక, వాణిజ్యాలను వైశ్యులకు కేటాయించారు. వ్యాపారాలు చేయటం, సరుకులను కొనుగోలు చేయటం, అమ్మటం తదితరాలను వారు నిర్వహించారు. సరుకులను కొనుగోలు చేసి అమ్మేక్రమంలో లోకజ్ఞానం సంపాదించారు. పెద్దసంఖ్యలో ఉన్న శూద్రకులాల కన్నా విజ్ఞానాన్ని సంపాదించుకున్నారు. ఈ మూడు సామాజిక తరగతులకు చెందినవారు అవలంభించిన వృత్తులు, వాటిలోకి ఇతరులు ప్రవేశించకుండా కల్పించిన చట్టపరమైన, సామాజిక పరమైన రక్షణలు 90 శాతం ప్రజల కన్నా వారు ఆర్థిక, సామాజిక, రాజకీయ రంగాలలో పైస్థాయిలో ఉండటానికి దోహదం చేశాయి.

ఇక శూద్రకులాలు అనబడే వారిలో వ్యవసాయం, చేనేత, కమ్మరం, కుమ్మరం, వడ్రంగం తదితర వృత్తులు చేసేవారు ఉన్నారు. ఆయా వృత్తులు వంశపారంపర్యంగా చేయాలి. ఎవరూ తమ వృత్తి మారి వేరేవృత్తిలోకి వెళ్ళటానికి వీలులేదు. అలా మారితే తీవ్రమైన శిక్షలు విధించేవారు. ప్రతివారూ తాత, తండ్రుల నుండి అదేవృత్తిలో ఉండటం వలన తమతమ వృత్తులలో నైపుణ్యం సంపాదించారు. వృత్తిని వదిలి ఇతర వృత్తిని నేర్చుకొనే అవకాశం లేకపోవటం వలన ప్రతివారి నైపుణ్యం, మేధస్సు వారి వృత్తికి సంబంధించిన అంశాలకే పరిమితమైంది.

శూద్రుల కన్నా అట్టడుగున ఉన్న దళితులు మిగతా కులాల ప్రజలందరికీ సేవలు చేస్తూ అంటరానివారిగా ఊరికి దూరంగా ఉంచబడ్డారు. చనిపోయిన పశువుల చర్మాన్ని ఒలవటం, చర్మంతో చెప్పులు కుట్టటం, ఇతర అవసరమైన పరికరాలను తయారు చేయటం, పారిశుద్ధ్య పనులు చేసేవారు. సమాజంలోని అశుభ్రాన్నంతా శుద్ధి చేయాల్సిన భారాన్ని వారిపై మోపారు. ప్రధాని మోడి చెప్పినట్లుగా వారేదో దైవకార్యం నిర్వహిస్తున్నట్లుగా సమాజంలోని మలినాన్ని శుభ్రం చేసే కార్యక్రమాన్ని స్వచ్ఛందంగా ఎంచుకోలేదు. దానిని వారిపై బలవంతంగా రుద్దారు. అతిక్రమించిన వారిని కఠినంగా శిక్షించారు. వారు ఏ మాత్రం అభివృద్ధి చెందటానికి అవకాశం లేకుండా కఠినమైన ఆర్థిక, సామాజిక, రాజకీయ ఆంక్షలను అమలుచేశారు.

గిరిజనులు అడవులకే పరిమితమై ఉండేవారు. కాయలు, పండ్లు సేకరించటం, జంతువులను వేటాడటం, పోడు వ్యవసాయం తదితరాలపై ఆధారపడి నాగరిక సమాజంతో సంబంధం లేకుండా ఉండటంతో వారి అభివృద్ధి మరింత తక్కువస్థాయిలో ఉండేది. రాజులు వారి రాజ్యాలలో వ్యవసాయోత్పత్తిని పెంచాలనుకున్నపుడు లేదా బ్రాహ్మణులకు భూమిని దానం చేసినపుడు ఆ ప్రాంతాలలోని అడవులను నరికి, వ్యవసాయం ప్రారంభించేవారు. వ్యవసాయం ప్రారంభించిన

భూములలో ఉన్న గిరిజనులు మరింతగా అడవుల లోపలికి వెళ్ళటం లేదా నూతనంగా ఏర్పడుతున్న గ్రామాలలో కలిసేవారు. ఆ విధంగా గ్రామ జీవితంలో కలిసినా వారు సమాజంలో అట్టడుగు తరగతిగానే పరిగణించబడేవారు. ప్రధానమైన ఏ వృత్తులలోనూ వారు భాగస్వాములు కాకుండా అట్టడుగు స్థాయి పనులకు వారిని పరిమితం చేశారు. ఈ విధంగా దాదాపు రెండువేల సంవత్సరాలుగా సమాజాన్ని కులాలుగా విడదీసి, అన్ని తరగతుల ప్రజలను నిర్ధిష్టమైన వృత్తులకు పరిమితం చేసి, దిగువ కులాల ప్రజానీకంపై అణచివేతను కొనసాగించారు.

సమాజాన్ని కులాలుగా విడదీసి, ప్రతి కులానికి చెందిన ప్రజలను నిర్ధిష్టమైన వృత్తికి పరిమితం చేయటం వలన దిగువకులాల ప్రజలకు విద్యారంగంలో అభివృద్ధి చెందటానికి, మేధోపరంగా తమ శక్తిసామర్ధ్యాలను పెంపొందించుకోవటానికి అవకాశం లేకుండాపోయింది. ప్రతివారూ వారివారి వృత్తులలో నైపుణ్యం సంపాదించినప్పటికీ, 90 శాతానికి పైగా ఉన్న వీరికి విద్య నేర్చుకొనే అవకాశాన్ని నిరాకరించటంతో వారిలో మేధోపరమైౖ అభివృద్ధి స్థంభించిపోయింది. బ్రిటిష్ వారు మన దేశంలోకి ప్రవేశించే వరకు ఇదే విధానం కొనసాగింది.

**నైపుణ్యం-ప్రతిభ**

వృత్తులు చేస్తున్నవారు తమతమ వృత్తులలో నైపుణ్యాన్ని సంపాదించారు. కాలం గడిచేకొద్ది అన్ని వృత్తులూ అభివృద్ధి చెందాయి. ఇతర వృత్తులతో పోలిస్తే కొన్ని వృత్తులలోని వారు అత్యున్నత నైపుణ్యం సంపాదించారు. వ్యవసాయం చేసే రైతులు వివిధ రకాల పంటలు పండించటంలో నైపుణ్యం సంపాదించి, దిగుబడులను పెంచారు. వివిధ దేశాల పర్యాటకులు రాసిన దాని ప్రకారం బ్రిటిష్ వారు మనదేశానికి వచ్చేనాటికి మనదేశంలోని చేనేత వృత్తిదారులు ప్రపంచంలోకెల్లా గొప్ప నైపుణ్యం సంపాదించారు.

బ్రిటిష్ వారికి పూర్వం దేశంలో ధనం చలామణి తక్కువగా ఉండేది. గ్రామీణ ప్రాంతంలోని వృత్తిదారులందరూ పంటలో వాటాను పొందేవారు. గ్రామంలోని వృత్తిదారులు చేసిన ఉత్పత్తులలో రాజు లేదా ఆ ప్రాంత పాలకులకు కాలవలసిన వాటిని తీసుకుపోగా మిగతా వాటిని రైతాంగానికి, ఇతర వృత్తులను చేసేవారి అవసరాల కోసం అందజేసేవారు. ప్రతివృత్తిని చేసేవారూ తమ ఉత్పత్తులను మిగతా వృత్తులు చేసేవారితో పరస్పరం మార్పిడి చేసుకొనేవారు. రైతులు వృత్తిదారుల నుండి తమకు అవసరమైన ఉత్పత్తులను తీసుకొని, తమపంటలో కొంత భాగాన్ని వారికి ఇచ్చేవారు. ఆ విధంగా తమకు అవసరమైన ఉత్పత్తుల కోసం వృత్తిదారులు, రైతులు పరస్పరం తమ ఉత్పత్తులను మార్చుకొనేవారు.

**బ్రిటిష్‌పాలనతో మార్పులు**

మనదేశంలోని సరుకులను కొనుగోలుచేసి, తమదేశంలోనూ, యూరప్‌లోని ఇతర దేశాలలోనూ అమ్ముకొని లాభాలు సంపాదించాలనే లక్ష్యంతో మనదేశానికి వచ్చిన బ్రిటిష్‌వారు క్రమంగా దేశంలోని వివిధ ప్రాంతాలను స్వాధీనం చేసుకొని పాలకులుగా మారారు. పాలకులుగా మారిన తర్వాత మనదేశంలో ఉత్పత్తి అవుతున్న సరుకులను బ్రిటన్‌కు ఎగుమతి కాకుండా నిలిపివేసి, బ్రిటన్‌లో తయారవుతున్న పారిశ్రామికోత్పత్తులకు మనదేశాన్ని మార్కెట్‌గా మార్చారు. బ్రిటన్‌లో తయారౌతున్న సరుకులు గ్రామాలలోకి వచ్చి, చేతివృత్తులను దివాళా తీయించాయి. చేతివృత్తుల ద్వారా దేశంలో తయారౌతున్న సరుకులకు అంతర్జాతీయ మార్కెట్‌తో పాటు దేశీయ మార్కెట్ కూడా లేకుండాపోయింది. ఆ విధంగా బ్రిటిష్ పాలకులు చేతివృత్తులను దెబ్బతీయటం, అత్యధిక పన్నులు విధించి వ్యవసాయ రంగాన్ని కూడా తీవ్రంగా దోపిడి చేయటం వలన దేశంలో సంభవించిన కరువులలో కోట్లాదిమంది ప్రజలు మరణించారు. తమ ఆదాయాన్ని పెంచుకోవటం కోసం పాలకులు రైత్వారీ విధానాన్ని ప్రవేశపెట్టి, భూములపై రైతులకు వ్యక్తిగత పట్టాలు ఇచ్చారు. ఫలితంగా భూములపై రైతులకు వ్యక్తిగత యాజమాన్యం లభించింది. అంతకుముందు తాము చేస్తున్న వృత్తికి చెందిన సరుకులను అందజేయటం ద్వారా ఊరుమ్మడి భూమిని సాగుచేస్తున్న రైతు పండించిన పంట నుండి తన వాటాను పొందే వృత్తిదారులకు పంటలో వాటాపొందే హక్కు రద్దయిపోయింది. తాను సాగుచేస్తున్న భూమిపై చట్టరీత్యా హక్కు ఏర్పడటం, తన గ్రామంలో చేతివృత్తిదారులు తయారుచేస్తున్న సరుకులను తీసుకోవటం ఆపివేసి, మార్కెట్‌లోకి వస్తున్న విదేశీ పారిశ్రామిక సరుకులను కొనుగోలు చేస్తున్న రైతులకు వృత్తిదారులకు పంటలో వాటాను ఇవ్వాల్సిన అవసరం లేకుండాపోయింది.

బ్రిటిష్ వారు దేశంలోకి వచ్చిన తర్వాత వారి పరిపాలనా వ్యవహారాల నిర్వహణ కోసం దేశంలో విద్యావంతులను తయారు చేసుకోవలసిన అవసరం పెరిగింది. దానికోసం ప్రభుత్వం పాఠశాలలను ప్రారంభించింది. అంతకు ముందు విద్య నేర్చుకొనే కులాలకు చెందినవారే కాక వ్యవసాయం, వృత్తులు చేసే కులాలు, దళితులు, గిరిజనుల పిల్లలు కూడా ప్రభుత్వ పాఠశాలలలో చేరారు. ఆ విధంగా విద్యతో సంబంధం లేకుండా వేల సంవత్సరాలుగా శారీరక కష్టానికే పరిమితమైన కులాలకు చెందినవారు కూడా క్రమంగా విద్యావంతులు కావటం పెరిగింది. అయినప్పటికీ వేల సంవత్సరాలుగా విద్యనభ్యసిస్తూ వస్తున్న కులాలకు చెందిన వారు విద్య, ఉద్యోగరంగాలలో ఆధిక్యతలోనే కొనసాగుతున్నారు.

**ముందుగా విద్యారంగంలోకి ప్రవేశించిన వ్యవసాయ కులాలు**

బ్రిటిష్ ప్రభుత్వం పాఠశాలలను ప్రారంభించిన తర్వాత శూద్రకులాలలో మొదటగా వ్యవసాయం చేస్తున్నవారు తమ పిల్లలను పాఠశాలలకు పంపటం ప్రారంభించారు. భూమిపై యాజమాన్యం దక్కటంతో పాటుగా సామాజికంగా ఆధిపత్య స్థానానికి రావటం, మిగతా వృత్తులతో

**“ బ్రిటిష్ వారు దేశంలోకి వచ్చిన తర్వాత వారి పరిపాలనా వ్యవహారాల నిర్వహణ కోసం దేశంలో విద్యావంతులను తయారు చేసుకోవలసిన అవసరం పెరిగింది. దానికోసం ప్రభుత్వం పాఠశాలలను ప్రారంభించింది. అంతకు ముందు విద్య నేర్చుకొనే కులాలకు చెందినవారే కాక వ్యవసాయం, వృత్తులు చేసే కులాలు, దళితులు, గిరిజనుల పిల్లలు కూడా ప్రభుత్వ పాఠశాలలలో చేరారు. ”**

**" దిగువకులాలకు చెందినవారిలో అత్యధికులు, పై కులాలకు చెందిన పేదలలో కొద్దిమంది ఆర్థికస్తోమత లేనివారు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చదివిస్తున్నారు. ఆర్థికస్థితి కలిగినవారు అన్ని వసతులు ఉన్న ప్రైవేటు పాఠశాలలలో చదివి స్తున్నారు. ఈ విధంగా అన్ని వసతులు, ఆధునిక బోధనా పరికరాలు ఉన్న పాఠశాలలలో చదివినవారిని, ఎటువంటి సదుపాయాలు, తగినంత మంది ఉపాధ్యాయులు కూడా లేని పాఠశాలలలో చదివిన వారిని ఒకే కొలబద్దతో చూడటం ఏ విధంగా సరైనది? "**

పోల్చినపుడు వ్యవసాయంలో కొంత మిగులు ఉత్పత్తి ఉండటం, విద్య ప్రాధాన్యతను అర్థం చేసుకోవటం కూడా అందుకు దారితీశాయి. ఆ విధంగా శూద్రకులాలలో వ్యవసాయ కులాలు విద్యా, ఉద్యోగరంగాలలో ముందుకుపోయారు. ఒక్కోప్రాంతంలో కొన్ని శూద్రకులాలు వ్యవసాయ రంగంలో ఉన్నాయి. ఆ ప్రాంతంలో ఆ కులాలకు చెందినవారు విద్యను అభ్యసించటం, ఉద్యోగాలు చేయటం, తద్వారా నికరమైన ఆదాయాన్ని పొందటం వారి అభివృద్ధికి దోహదం చేశాయి.

ఆ తర్వాత వెనుకబడిన కులాలు, దళితులు, గిరిజనులు క్రమంగా విద్య నేర్చుకోవటం ప్రారంభించారు. ఫలితంగా వారు ముందుగా విద్యారంగంలోకి వచ్చిన వారికన్నా వెనుకబడిపోయారు. ఇది ఒక్కో సామాజిక తరగతి మొత్తంగా వెనుకబడటంతో పాటు ఆయా సామాజిక తరగతులలోని వివిధ విభాగాలు–ఉపకులాలు–కొన్ని ముందుగా విద్యారంగంలోకి రాగా మరికొన్ని కులాలకు చెందిన ప్రజలు ఆలస్యంగా విద్యారంగంలోకి ప్రవేశించారు. ఇది ఆయా కులాలలోని ప్రజలు విద్యనేర్చుకోవటంలో వెనుకబడటంతో పాటు, ఉద్యోగాలలో, తద్వారా సామాజిక అభివృద్ధిలో కూడా వెనుకబడటానికి దారితీసింది.

స్వాతంత్ర్యం వచ్చేనాటికి దళితులు, గిరిజనులతో సహ క్రమంగా అన్ని కులాలకు చెందినవారు పాఠశాలలలోనూ, ప్రభుత్వోద్యోగాలలోనూ చేరటం జరుగుతున్నది. అయితే వారి జనాభాతో పోల్చుకున్నపుడు అత్యంత తక్కువ సంఖ్యలో మాత్రమే ఉద్యోగాలను పొందగలిగారు. అందువలన సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడివున్న దళితులు, గిరిజనులకు రాజకీయరంగంలోనూ, విద్య, ఉద్యోగాలలో రిజర్వేషన్లు కల్పించటాన్ని రాజ్యాంగంలో చేర్చారు. తర్వాత వెనుకబడిన కులాలకు కూడా రిజర్వేషన్లు కల్పించారు. రిజర్వేషన్లు కల్పించినప్పటికీ వారితో భర్తీ చేయాల్సిన వాటిలో దిగువస్థాయిలోని క్లాస్ 4, 3 ఉద్యోగాలు మాత్రమే ఎక్కువగా భర్తీ అవుతున్నాయి. మినహా ఉన్నతోద్యోగాలలో చాలా పోస్టులు ఖాళీగా మిగిలిపోతున్నాయి. అంటే జనాభా ప్రాతిపదికపై రిజర్వేషన్లు కల్పించినా ఆ మేరకు కూడా వారు వాటిని వినియోగించుకోలేని పరిస్థితి ఉంది.

కాని మరోవైపున దేశంలో పెరుగుతున్న విద్యావంతుల సంఖ్యకు అనుగుణంగా ఉద్యోగాలు కల్పించటంలో ప్రభుత్వాలు విఫలమయాయి. వ్యవసాయ సంస్కరణలను అమలుజరిపి వ్యవసాయ కార్మికులు, పేదరైతులకు భూములివ్వటంలో వైఫల్యం, ప్రజల కొనుగోలు శక్తిని పెంచకపోవటం వలన పారిశ్రామికీకరణకు పరిమితులు ఏర్పడ్డాయి. ఆర్థికాభివృద్ధిని సాధించి, ప్రజల జీవనప్రమాణాలను పెంచటంలో వైఫల్యం నిరుద్యోగం పెరగటానికి దారితీసింది. నిరుద్యోగులు, విద్యార్థులు, యువత, ప్రజలలో ప్రభుత్వంపై పెరుగుతున్న అసంతృప్తిని దారి తప్పించటం కోసం రిజర్వేషన్ల ద్వారా దళిత, గిరిజనులు ఉద్యోగాలు పొందటం వలననే పై కులాలలోని వారికి ఉద్యోగాలు రావటం లేదనే ప్రచారం ప్రారంభించారు. ఆ విధంగా రిజర్వేషన్లు పొందుతున్న దళితులు, గిరిజనులు, వెనుకబడిన తరగతులపై వ్యతిరేకతను రెచ్చగొడుతూ యువతను తప్పుదారి పట్టిస్తున్నారు. ఒకవేళ రిజర్వేషన్ల ద్వారా ఉద్యోగాలు పొందినవారందరినీ తొలగించి, పై కులాలలోని నిరుద్యోగులకు ఉద్యోగాలిస్తే సమస్య పరిష్కారం అవుతుందా? వీరిని తొలగించటం వలన పై కులాలలోని నిరుద్యోగులందరికీ ఉద్యోగాలు వస్తాయా? అపుడు ఉద్యోగాల నుండి తొలగించబడిన దిగువ కులాలలోని వారితో పాటు పై కులాలలోని ఉద్యోగాలు రానివారు కూడా నిరుద్యోగులుగానే ఉంటారు కదా! అంటే రిజర్వేషన్లను రద్దుచేసినా నిరుద్యోగుల సంఖ్యలో ఎటువంటి మార్పు ఉండదని స్పష్టం అవుతున్నది. అందువలన సమస్య రిజర్వేషన్లు కాదని, పాలకులు అనుసరిస్తున్న విధానాల ఫలితంగా పెరుగుతున్న నిరుద్యోగం కారణమని స్పష్టమౌతున్నది. పెట్టుబడిదారీ విధానం కొనసాగుతున్న దేశాలలో నిరుద్యోగం నిరంతరం పెరుగుతుండటం అనివార్యమైన పరిణామం. నిరుద్యోగుల్లో పెరుగుతున్న అసంతృప్తిని దారి తప్పించటానికి, పెట్టుబడిదారీ దోపిడీకి వ్యతిరేకంగా ప్రజలు సమీకరణ కాకుండా చూడటానికి రిజర్వేషన్ల వలననే నిరుద్యోగులకు ఉద్యోగాలు రావటం లేదని, రిజర్వేషన్లు రద్దుచేస్తే ఉద్యోగాలొస్తాయని మనదేశంలోని పాలకవర్గాలు తప్పుడు ప్రచారం చేస్తున్నాయి.

**తప్పుదారి పట్టించటానికే ప్రతిభను గురించి ప్రచారం చేస్తున్నారు**

రిజర్వేషన్ల వలననే ప్రతిభ ఉన్నవారికి ఉద్యోగాలు రావటం లేదనేది పూర్తిగా మోసపూరితమైన ప్రచారం. నిరుద్యోగులను ఒకరిపైకి ఒకరిని ఎగదోయటం ద్వారా పాలకవర్గాలు తమ వైఫల్యాల నుండి ప్రజల దృష్టి మళ్లించటానికి ఉద్దేశించినది ఈ ప్రచారం. ఎక్కువ మార్కులు తెచ్చుకున్నవారు, చదువులో ముందున్నవారంతా ప్రతిభావంతులు కాదు. దిగువకులాలకు చెందినవారిలో అత్యధికులు, పై కులాలకు చెందిన పేదలలో కొద్దిమంది, ఆర్థికస్తోమత లేనివారు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చదివిస్తున్నారు. ఆర్థికస్థితి కలిగినవారు అన్ని వసతులు ఉన్న ప్రైవేటు పాఠశాలలలో తమ పిల్లలను చదివిస్తున్నారు. ఈ విధంగా అన్ని వసతులు, ఆధునిక బోధనా పరికరాలు ఉన్న పాఠశాలలలో చదివినవారిని, ఎటువంటి సదుపాయాలు, తగినంత మంది ఉపాధ్యాయులు కూడా లేని పాఠశాలలలో చదివిన వారిని ఒకే కొలబద్దతో చూడటం ఏ విధంగా సరైనది? చేతిలో రూపాయి లేక పిల్లలకు సరిగా తిండికూడా పెట్టలేని తలిదండ్రులు తమ పిల్లలను వసతులు, ఉపాధ్యాయులు లేని ప్రభుత్వ పాఠశాలలకు పంపుతున్నారు. ఆర్థికంగా స్థితిమంతులైన వారు తమ పిల్లలను ఇంగ్లీష్ మీడియం కాన్వెంట్లలో చేర్పిస్తున్నారు. ఎల్‌కెజికే వేలు, లక్షల రూపాయల ఫీజులు చెల్లిస్తున్నారు. వసతులు, ఉపాధ్యాయులు లేని పాఠశాలలలో చదువుతున్న వారిలో అత్యధికంగా దళితులు, గిరిజనులు, వెనుకబడిన తరగతుల వారి పిల్లలు ఉంటున్నారు. అసమాన పరిస్థితుల్లో చదువుతున్న వీరందరికీ సమానమైన ప్రతిభ

ఉంటుందా?

ముందుతరాలలోని తల్లిదండ్రులు విద్యావంతులై ఉంటే తమ పిల్లలను విద్యావంతులుగా తీర్చిదిద్దటంలో వారు ముఖ్యమైనపాత్ర నిర్వహిస్తారు. పిల్లలలో ఎక్కువమంది పాఠశాలలో ఉపాధ్యాయులు చెప్పిన పాఠ్యాంశాలను సక్రమంగా అర్ధం చేసుకోలేరు. తల్లిదండ్రులు విద్యావంతులైతే ఇంటివద్ద వారికి ఆ అంశాలను వివరించి, అర్ధం చేసుకొనేలా చేస్తారు. తమకు తీరికలేకపోతే నెలకు వేలరూపాయలు చెల్లించి ట్యూషన్లకు పంపిస్తారు. తల్లిదండ్రులు నిరక్షరాస్యులైతే పిల్లలకు ఇంటివద్ద నేర్చుకోవటానికి అవకాశం ఉండదు. ఆర్థికస్థితి అనుమతించదు కాబట్టి ట్యూషన్లకు పంపలేరు. గిరిజనులు, దళితులు, వెనుకబడిన తరగతుల ప్రజలకు అటువంటి అవకాశాలు కొరవడ్డాయి. అందువలన వారికి పాఠశాలకు వెలుపల నేర్చుకోవటానికి అవకాశం ఉండదు. కాబట్టి వారి పిల్లలు నేర్చుకోవటంలో వెనుకబడి ఉంటారు. ఈ విధంగా అన్ని విధాలైనటువంటి అవకాశాలు, ఆర్థికస్థితి కలిగిన వారిని, ఏ విధమైన అవకాశాలు లేనివారిని ఒకేగాటన కట్టి ప్రతిభను గురించి మాట్లాడటం అర్ధంలేని విషయం.

రిజర్వేషన్లు పొందుతున్న తరగతుల విద్యార్థులు ప్రతిభలేని వారని అంటున్నారు. రిజర్వేషన్లు పొందని తరగతుల విద్యార్థులందరూ ప్రతిభ కలిగివున్నారా? ఇన్ని విధాలైన అనుకూల పరిస్థితులున్నప్పటికీ, అవకాశాలు కల్పిస్తున్నప్పటికీ అత్తెసరు మార్కులతో పాసవుతున్నవారు ఎందరులేరు? కాలేజీలు, యూనివర్సిటీలు, మెడికల్, డెంటల్, ఇతర కాలేజీలలో లక్షల రూపాయలు పెట్టి సీట్లు కొనుక్కొంటున్న వారు ఎందరులేరు? ప్రభుత్వ ఉద్యోగాలు సంపాదించటం కోసం లక్షల రూపాయల లంచాలు ఇవ్వటం, మంత్రులు, ఇతర పలుకుబడి కలిగినవారి ద్వారా సిఫార్సులు చేయించి ఉద్యోగాలు పొందినవారు ఎందరులేరు? వీరంతా ప్రతిభ ఉన్నవారా? ప్రతిభ ఉంటే కాలేజీలలో సీట్లకోసం, ప్రభుత్వ ఉద్యోగాల కోసం లంచాలు ఎందుకు ఇస్తున్నారు? పలుకుబడి కలిగినవారితో సిఫార్సులు ఎందుకు చేయిస్తున్నారు? మరి ఈ విధంగా వీరు కాలేజీలలో సీట్లు, ఉద్యోగాలు పొందటం వలన పై కులాలలోని ప్రతిభకలిగిన విద్యార్థులకు అన్యాయం జరగటం లేదా? రిజర్వేషన్లను వ్యతిరేకించేవారు ఇక్కడ ప్రతిభ కలిగిన వారికి జరుగుతున్న అన్యాయం గురించి ఎందుకు మాట్లాడటం లేదు? ఈ సీట్లు, ఉద్యోగాలు రిజర్వేషన్లు పొందే కులాల వారికి పోవటం లేదు కాబట్టి వారికేమీ ఇబ్బంది లేదు. అంటే రిజర్వేషన్లకు వ్యతిరేకంగా ప్రచారం చేస్తున్నవారు సామాజికంగా అణచబడిన కులాలపై అణచివేత కొనసాగాలని కోరుకుంటున్నారు. దానికి ప్రతిభను అడ్డం పెట్టుకుంటున్నారు మినహా నిజంగా ప్రతిభ కలిగిన వారికి అన్యాయం జరిగినా వారు పట్టించుకోవటం లేదని ఈ అంశాలు స్పష్టం చేస్తున్నాయి.

**"రిజర్వేషన్లకు వ్యతిరేకంగా ప్రచారం చేస్తున్నవారు సామాజికంగా అణచబడిన కులాలపై అణచివేత కొనసాగాలని కోరుకుంటున్నారు. దానికి ప్రతిభను అడ్డం పెట్టుకుంటున్నారు మినహా నిజంగా ప్రతిభ కలిగిన వారికి అన్యాయం జరిగినా వారు పట్టించుకోవటం లేదని ఈ అంశాలు స్పష్టం చేస్తున్నాయి."**

ఒక తరానికి రిజర్వేషన్లు ఇచ్చారు. వారు అభివృద్ధి చెందారు. వారి పిల్లలు తిరిగి రిజర్వేషన్లు పొందుతున్నారు. ఒకతరం అభివృద్ధి చెందిన తర్వాత తిరిగి వారి పిల్లలకు, పిల్లల పిల్లలకు రిజర్వేషన్లు ఇవ్వాల్సిన అవసరం ఏముంది. ఒక కుటుంబంలో ఒకతరం వారు రిజర్వేషన్ల ద్వారా ఉద్యోగాలు పొందిన తర్వాత తర్వాతి తరాల వారు ఉద్యోగాలు పొందకుండా చట్టం చేయాలని అని కూడా రిజర్వేషన్ల వ్యతిరేకులు వాదిస్తున్నారు. ఒక తరం ఉద్యోగాలు పొందిన తర్వాత తర్వాతి తరాలు ఉద్యోగాలు పొందరాదని అంటే అది రిజర్వేషన్లు పొందుతున్న దళితులు, గిరిజనులు, వెనుకబడిన తరగతులకు మాత్రమే ఎందుకు వర్తించాలి? సమాజంలోని అన్ని కులాలకు వర్తించాలి. ఏ కులంలో అయినా ఒకతరం వారు ఉద్యోగాలు పొందిన తర్వాత తర్వాతి తరాల వారు ఉద్యోగాలు పొందకుండా చేయటం సరైనదవుతుందా? అందువలన రిజర్వేషన్లు కల్పించిన పూర్వరంగాన్ని మనం పరిశీలిస్తే అంటరానితనాన్ని అంతం చేయటం ప్రధానలక్ష్యంగా దళితులకు రిజర్వేషన్లు కల్పించారు. రాజ్యాంగాన్ని ఆమోదించేటపుడు 10 సంవత్సరాలలో సమాజంలో అంటరానితనాన్ని, అసమానతలను అంతం చేయాలని, ఆ తర్వాత రిజర్వేషన్లను రద్దుచేయాలని ప్రతిపాదించారు. కాని అంటరానితనాన్ని అంతం చేయటం, సామాజిక అవమానతలను నిర్మూలించటం 70 సంవత్సరాల తర్వాత కూడా సాధించలేకపోయాం. ఈనాటికీ అంటరానితనం, అసమానతలు కొనసాగుతూనే ఉన్నాయి. అటువంటపుడు రిజర్వేషన్లకు వ్యతిరేకంగా ప్రచారం చేయటం అంటే దళితులు, గిరిజనులు, ఇతర వెనుకబడిన తరగతులలోని పరిమిత సంఖ్య ప్రజలు సాధించిన కొద్దిపాటి అభివృద్ధిని కూడా వ్యతిరేకించటమే అవుతుంది.

ప్రభుత్వరంగ సంస్థలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వశాఖలలో ఉద్యోగాలు రిజర్వేషన్లు అమలుజరుగుతున్న ప్రధానరంగాలుగా ఉన్నాయి. ప్రభుత్వరంగ సంస్థలన్నింటినీ ప్రైవేటీకరిస్తామని ప్రధాని ప్రకటించాడు. ప్రైవేటురంగంలో ఎక్కడా రిజర్వేషన్లు అమలుచేయటం లేదు. అందువలన ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణ జరిగితే రిజర్వేషన్లకున్న అవకాశాలు బలహీనపడతాయి. సంఘ్ పరివార్ నాయకత్వంలోని బిజెపి ప్రభుత్వం ప్రభుత్వరంగాన్ని కార్పొరేట్లకు, ఎంఎన్‌సిలకు కట్టబెట్టటానికి వేగంగా చేస్తున్న ప్రయత్నాల వెనుక ఈ సామాజిక కోణం కూడా ఉన్నది.

### రిజర్వేషన్ల ద్వారా ఉద్యోగాలు, ప్రమోషన్లు పొందినవారు అసమర్ధంగా పనిచేస్తున్న దాఖలాలేదు


ఉద్యోగాలలో రిజర్వేషన్లు ఇస్తున్నారు. ప్రమోషన్లలో కూడా రిజర్వేషన్లు ఇవ్వాలా అని ప్రశ్నించేవారున్నారు. రిజర్వేషన్ల ద్వారా ఉద్యోగాలు, ప్రమోషన్లు పొందినవారికి పనిచేయటం రాదని, వారి వలన పనులు, ప్రభుత్వ కార్యక్రమాలు కుంటుబడుతున్నాయని, అందువలన ప్రజలు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని వాదించేవారున్నారు. ఈ వాదన పూర్తిగా అవాస్తవం. రిజర్వేషన్ల ద్వారా ఉద్యోగాలు, ప్రమోషన్లు పొందినవారు మిగతా

(మిగతా....వ పేజీలో)

**నివాళి**

# మహత్తర మేధావి ఫ్రెడరిక్ ఏంగెల్స్





**(మార్క్సిస్టు మహోపాధ్యాయుడు ఫ్రెడరిక్ ఏంగెల్స్ మరణించినప్పుడు ఆయనకు నివాళు లర్పిస్తూ 1895లో లెనిన్ రాసిన వ్యాసం ఇది. దీన్ని 1896లో మినిలెని రొబోత్నిక్‌లో ప్రచురించారు. ఈ వ్యాసాన్ని మార్క్సిస్టు పాఠకులకు అందిస్తున్నాం. - సంపాదకుడు)**

**1895**, ఆగస్టు 5వ తేదీన ఫ్రెడరిక్ ఎంగెల్స్ లండన్‌లో మరణించాడు. ఆయన స్నేహితుడు కారల్ మార్క్స్ మరణించిన తర్వాత (1883లో) నాగరిక సమాజంలోని మొత్తం ఆధునిక కార్మికవర్గానికి ఆయన సిద్ధాంతవేత్తగా, ఉపాధ్యాయునిగా ఉన్నాడు. కారల్ మార్క్స్, ఫ్రెడరిక్ ఎంగెల్స్ మొదటిసారిగా కలుసుకున్న తర్వాత వారి జీవితాన్నంతా ఉమ్మడి లక్ష్యానికి అంకితం చేశారు. కార్మికవర్గానికి ఎంగెల్స్ ఏం చేశాడో తెలుసుకోవాలంటే కారల్ మార్క్స్ బోధనలు, సమకాలీన కార్మికవర్గ ఉద్యమ అభివృద్ధికి ఆయన చేసిన కృషిని గురించి స్పష్టంగా తెలుసుకొని ఉండాలి. కార్మికవర్గం, వారు కోరుతున్న కోరికలు ప్రస్తుత ఆర్థికవ్యవస్థ అభివృద్ధి ఫలితమని, అది బూర్జువావర్గంతో పాటు కార్మికవర్గాన్ని కూడా సృష్టించి, వారు సంఘటితమయేలా చేస్తుందని వారు మొదటిసారిగా వెల్లడించారు. గొప్ప వ్యక్తుల ఆలోచనలు, ప్రయత్నాల వలన కాక కార్మికవర్గం జరిపే వర్గ పోరాటం వలననే సమాజంలోని దోపిడి, అణచివేతల నుండి మానవజాతి బయటపడుతుందని వారు చెప్పారు. సోషలిజం కొంతమంది ఊహల ఫలితంగా వచ్చేది కాదని, ఆధునిక సమాజంలో అభివృద్ధి చెందుతున్న ఉత్పత్తిశక్తుల ఫలితం, అంతిమగమ్యం అని వారి రచనలలో శాస్త్రీయంగా వివరించారు. ఇప్పటి వరకు రాయబడివున్న చరిత్ర అంతా వర్గ పోరాటాల చరిత్ర అని, కొన్ని సామాజిక వర్గాలు మరికొన్ని వర్గాలపై విజయం సాధించి, ఆధిపత్యం చెలాయించటమని వారు స్పష్టం చేశారు. వర్గ పోరాటం, వర్గ ఆధిపత్యానికి ఉన్న పునాదులు-ప్రైవేటు ఆస్థి, సామాజిక ఉత్పత్తిలో అరాచకం-అదృశ్యమైపోయే వరకు ఇది కొనసాగుతుంది. ఈ పునాదులను ధ్వంసం చేయమని కార్మికవర్గ ప్రయోజనాలు డిమాండ్ చేస్తున్నాయి. అందువలన ఈ పునాదులను ధ్వంసం చేయటం కోసం చైతన్యపూరితమైన, సంఘటితమైన కార్మికవర్గ ఉద్యమం పూనుకోవాలి. ప్రతి వర్గ పోరాటమూ ఒక రాజకీయ పోరాటం లాగే జరుగుతుంది.

తమ విముక్తి కోసం పోరాటం జరుపుతున్న కార్మికులందరూ మార్క్స్, ఎంగెల్స్‌లు వ్యక్తం చేసిన ఈ భావాలను ఆమోదించారు. 40వ దశాబ్దంలో ఈ స్నేహితులిద్దరూ సోషలిస్టు సాహిత్యాన్ని రచించటంతో పాటు తమ కాలంలో జరిగిన సామాజిక ఉద్యమాలలో పూర్తి భావావేశంతో పాల్గొన్నారు. నిరంకుశులైన రాజులు, పోలీసులు, మత నాయకులకు వ్యతిరేకంగా, రాజకీయ స్వాతంత్ర్యం కోసం ఆ సమయంలో జరిగిన పోరాటాలలో అనేకమంది సామర్థ్యం ఉన్నవారు, లేనివారు, గౌరవనీయులైనవారు, ఏ మాత్రం గౌరవం పొందలేనివారు పాల్గొన్నారు. కాని కార్మికవర్గం, పెట్టుబడిదారీ వర్గాల మధ్య ఉన్న పరస్పర విరుద్ధమైన ప్రయోజనాలను గమనించటంలో వారు విఫలమయారు. కార్మికులు స్వతంత్రమై శక్తిగా వ్యవహరించగలరని వారు భావించలేదు. ఊహల్లో తేలిపోతున్న వీరిలో కొందరు, నిజంగానే అందరికీ మేలు జరగాలనుకొనేవారు సమాజంలో జరుగుతున్న అన్యాయాలు, అసమానతలను గురించి అధికారంలో ఉన్నవారికి అర్థం అయేవిధంగా వివరిస్తే భూమిపై శాంతి సౌఖ్యాలు నెలకొంటాయని భావించారు. వర్గ పోరాటం లేకుండానే సోషలిజం సాధించవచ్చునని వారు కలలు కన్నారు. ఆ సమయంలో ఉన్న సోషలిస్టులు, కార్మికవర్గానికి మిత్రులుగా ఉన్నవారు కూడా కార్మికవర్గాన్ని ఒక పుండులాగా, పరిశ్రమలతో పాటు కార్మికవర్గం కూడా పెరగటాన్ని భయంతోనూ చూశారు. కాబట్టి వారు పరిశ్రమలు, కార్మికుల పెరుగుదలను అడ్డకోవటానికి ఉన్న మార్గాలను అన్వేషించటానికి, చరిత్ర గమనాన్ని వెనక్కుతిప్పటానికి ప్రయత్నించారు. కార్మికవర్గం అభివృద్ధి కావటం పట్ల సాధారణంగా ఉన్న ఈ భయాన్ని మార్క్స్, ఎంగెల్స్‌లు అంగీకరించలేదు. అందుకు భిన్నంగా ఆ వర్గం నిరంతరంగా అభివృద్ధి చెందటంపైనే తమ ఆశలన్నింటినీ పెట్టుకున్నారు. కార్మికుల సంఖ్య పెరిగిన కొద్దీ ఒక విప్లవకరమై వర్గంగా వారి బలం పెరుగుతుంది. దానితో సోషలిజం సాధన మరింత దగ్గరగా వస్తుంది. మరింత వాస్తవంగా మారుతుంది. మార్క్స్, ఎంగెల్స్‌లు కార్మికవర్గానికి చేసిన సేవలను గురించి కొద్దిమాటలలో చెప్పుకోవాలంటే తమకు తాముగా ఏ విధంగా చైతన్యవంతం కావాలో చెప్పి, వారి పాత్ర గురించిన ఊహల స్థానంలో శాస్త్రీయ దృక్పథాన్ని ప్రతిపాదించారు.

అందువలన కార్మికవర్గంలోని ప్రతివారికి ఎంగెల్స్ పేరు, ఆయన జీవితం

గురించి తెలుసు. కాబట్టి మన ఇతర ప్రచురణల వలెనే ఈ వ్యాసాల సంకలనాన్ని తీసుకురావటంలో లక్ష్యం రష్యన్ కార్మికులలో వర్గ చైతన్యాన్ని పెంచటం. అందుకోసం ఆధునిక కార్మికవర్గ మహామహోపాధ్యాయులు ఇద్దరిలో ఒకరైన ఫ్రెడరిక్ ఎంగెల్స్ జీవితానికి సంబంధించిన వివరాలను తెలియజేయాలి.

ఎంగెల్స్ ప్రష్యన్ రాజ్యంలోని రైన్ ప్రాంతంలోని బార్మెన్‌లో 1820లో జన్మించాడు. ఆయన తండ్రి ఒక పరిశ్రమకు యజమాని. కుటుంబ పరిస్థితుల వలన 1838లో తన విద్యాభ్యాసం పూర్తిచేయకుండానే బార్మెన్‌లోని ఒక వాణిజ్యసంస్థలో గుమాస్తాగా చేరాడు. వాణిజ్యానికి సంబంధించిన విషయాలు ఎంగెల్స్ రాజకీయ, సైద్ధాంతిక అధ్యయనాలను చేయకుండా నిరోధించలేక పోయాయి. పాఠశాలలో చదువుతుండగానే ప్రభుత్వాలు, అధికారుల నిరంకుశత్వాన్ని ఆయన అసహ్యించుకొనేవాడు. తత్వశాస్త్ర అధ్యయనం ఆయనను మరింత ముందుకు తీసుకుపోయింది. ఆ సమయంలో జర్మనీలో హెగెల్ తత్వశాస్త్రం అధికంగా ప్రచారంలో ఉంది. ఎంగెల్స్ కూడా హెగెల్ అనుయాయిగా మారాడు. బెర్లిన్ యూనివర్సిటీలో ప్రొఫెసర్‌గా ఉన్న హెగెల్ నిరంకుశమైన జర్మన్ ప్రభుత్వాన్ని బలపరిచినప్పటికీ, ఆయన బోధనలు విప్లవాత్మకంగా ఉండేవి. మానవుల తార్కికత, హక్కులపై హెగెల్ విశ్వాసం, ప్రపంచం అంతా నిరంతరం మారుతూ అభివృద్ధి చెందుతుందన్న ఆయన సిద్ధాంతంలోని మౌలికాంశం. ఆయన అనుయాయుల్లోని కొందరు–ఉన్న పరిస్థితుల్ని అంగీకరించటానికి సిద్ధపడనివారు– అప్పటికి ఉన్న దారుణమైన పరిస్థితులకు వ్యతిరేకంగా చేసే పోరాటం కూడా విశ్వ సూత్రమైన నిరంతర అభివృద్ధిలో భాగమేనని భావించారు. అన్ని అంశాలు అభివృద్ధి అవుతుంటే, ఒక తరహా సంస్థలు మరొక తరహా సంస్థలకు చోటిస్తుంటే, ప్రష్యన్ రాజు లేదా రష్యన్ జారు నిరంకుశత్వం ఎప్పుడూ ఎందుకు కొనసాగాలి? మెజారిటీ ప్రజానీకాన్ని దోపిడీ చేస్తూ కొద్దిమందిగా ఉన్న పెట్టుబడిదారులు ఎందుకు సంపదలు కూడ బెట్టుకోవాలి? ప్రజలపై ఎల్లప్పుడూ పెట్టుబడిదారుల ఆధిపత్యం ఎందుకు కొనసాగాలి తదితర ప్రశ్నలు తలెత్తాయి. హెగెల్ తత్వశాస్త్రం భావాల అభివృద్ధిని గురించి చెప్పింది. ఆయనది భావవాద తత్వశాస్త్రం. మానవమేధస్సు అభివృద్ధి నుండే ప్రకృతి, మనిషి, మానవసహజ లక్షణాలు, సామాజిక సంబంధాలు అభివృద్ధి అయాయని

❝ ఎంగెల్స్‌కు ముందే బ్రిటిష్ కార్మికుల దుర్భర పరిస్థితులను వివరిస్తూ వారికి సహాయం చేయవలసిన అవసరాన్ని గురించి అనేకమంది వివరించారు. కార్మికులు బాధలు పడుతున్న వర్గం మాత్రమే కాదని, కార్మికవర్గం అనుభవిస్తున్న దుర్భర పరిస్థితులు పోరాటానికి దారితీసి, అంతిమంగా ఆ వర్గ విముక్తికి కారణమౌతాయని చెప్పిన మొదటివ్యక్తి ఎంగెల్స్. ❞

పేర్కొంది. మార్క్స్, ఎంగెల్స్‌లు నిరంతరం అభివృద్ధి జరుగుతుందన్న హెగెల్ భావాలను తీసుకొంటూ ఊహల ఫలితంగానే అన్ని జరుగుతున్నాయన్న ఆయన భావవాద దృక్పథాన్ని పక్కన పెట్టారు. మెదడు అభివృద్ధి అన్నింటినీ అభివృద్ధి చేస్తున్నదన్న భావవాదాన్ని వదిలివేసి, అందుకు విరుద్ధంగా ప్రకృతి, పదార్థం నుండే మెదడు అభివృద్ధి అయిందని చెప్పి, ఆ సిద్ధాంతాన్ని సజీవమైన దానిగా చేశారు. హెగెల్, ఆయన అనుయాయుల వలెకాక మార్క్స్, ఎంగెల్స్‌లు భౌతికవాదులు. ప్రపంచాన్ని, మనుషులను భౌతిక దృక్పథంతో పరిశీలించి, ప్రకృతి సిద్ధమైన వాటన్నింటికి భౌతిక పరిస్థితులే కారణమని, అందువలన మానవ సమాజ అభివృద్ధికి భౌతికశక్తులైన ఉత్పత్తిశక్తుల అభివృద్ధి కారణమని చెప్పారు. తమ అవసరాలను తీర్చుకోవటానికి ఉత్పత్తి చేసేక్రమంలో ఉత్పత్తిశక్తుల స్థాయిని బట్టి మనుషులు తమ మధ్య పరస్పర సంబంధాలను ఏర్పరచుకుంటారు. సామాజిక జీవితం, మానవుల ఆశలు, ఆలోచనలు, చట్టాలు తదితరాలను ఈ సంబంధాలు వ్యక్తం చేస్తాయి. ఉత్పత్తిశక్తుల అభివృద్ధి ప్రైవేటు ఆస్తిపై ఆధారపడిన సామాజిక సంబంధాలను సృష్టించాయి. ఇపుడు అవే ఉత్పత్తిశక్తులు మెజారిటీ ప్రజలకు ఆస్తిలేకుండా చేసి, దానిని కొద్దిమంది చేతిలో కేంద్రీకరిస్తున్నాయి. ఆధునిక సామాజిక వ్యవస్థకు పునాదియైన ఆస్తిని అది రద్దు చేస్తున్నది. సోషలిస్టులు ప్రకటిస్తున్న లక్ష్యం వైపుకు అది వెళుతున్నది. ఆధునిక సమాజంలో తన స్థానాన్ని బట్టి సోషలిజం సాధించటానికి తన ప్రయోజనాలు, కార్మికవర్గానికి తన చారిత్రక కర్తవ్యం గురించిన చైతన్యాన్ని కలిగించటానికి సోషలిస్టులందరూ ప్రయత్నం చేస్తున్నారు.

తన తండ్రి భాగస్వామిగా ఉన్న ఒక వాణిజ్యసంస్థలో పనిచేయటం కోసం ఎంగెల్స్ 1842లో ఇంగ్లండ్‌లోని పారిశ్రామిక కేంద్రమైన మాంచెస్టర్‌లో స్థిరపడ్డాడు. అక్కడి కార్మికవర్గ పరిస్థితులను తెలుసుకున్నాడు. అక్కడ ఎంగెల్స్ ఫ్యాక్టరీ ఆఫీసుకే పరిమితమై ఉండకుండా కార్మికవర్గ పేటలలో తిరిగి, వారి దారిద్ర్యాన్ని, దుర్భర పరిస్థితులను తన కళ్ళతో చూశాడు. అయన వ్యక్తిగతమైన పరిశీలనలకే పరిమితం కాలేదు. బ్రిటిష్ కార్మికుల దుర్భర పరిస్థితులను గురించి తనకు అందిన వాటిని, అధికారుల రికార్డులన్నింటినీ ఆయన శ్రద్ధగా అధ్యయనం చేశాడు. ఈ అధ్యయనం ఫలితంగా ఆయన 1845లో 'ఇంగ్లండ్‌లో కార్మికవర్గ స్థితిగతులు' అనే పుస్తకం రాశాడు. ఇంగ్లండ్‌లో కార్మికవర్గ స్థితిగతులు పుస్తకం రాయటం ద్వారా ఎంగెల్స్ చేసిన సేవ ఏమిటో ఇంతకుముందే ప్రస్తావించాం. ఎంగెల్స్‌కు ముందే బ్రిటిష్ కార్మికుల దుర్భర పరిస్థితులను వివరిస్తూ వారికి సహాయం చేయవలసిన అవసరాన్ని గురించి అనేకమంది వివరించారు. కార్మికులు బాధలు పడుతున్న వర్గం మాత్రమే కాదని, కార్మికవర్గం అనుభవిస్తున్న దుర్భర పరిస్థితులు పోరాటానికి దారితీసి, అంతిమంగా ఆ వర్గ విముక్తికి కారణమౌతాయని చెప్పిన మొదటివ్యక్తి ఎంగెల్స్. పోరాటం చేసే కార్మికవర్గం తనకుతాను సహాయం చేసుకొంటుంది. తమ విముక్తి సోషలిజంలోనే ఉందని కార్మికవర్గం గ్రహించటం అనివార్యమయేలా రాజకీయ ఉద్యమం చేస్తుంది. మరోవైపున కార్మికవర్గ రాజకీయ పోరాటంలో భాగంగా మారినపుడు మాత్రమే సోషలిజం ఒకశక్తిగా మారుతుంది. ఇంగ్లండ్‌లో కార్మికవర్గ స్థితిగతులు పుస్తకంలో ఎంగెల్స్ ఈ అంశాలన్నింటినీ పొందుపరిచాడు. ఇపుడు ప్రపంచంలో పోరాడుతున్న, ఆలోచిస్తున్న కార్మికులంతా వీటిని అంగీకరిస్తున్నారు. కాని అప్పటికి ఇవి నూతనమైనవి. ఇంగ్లీష్ కార్మికుల దు:ఖభరితమైన పరిస్థితులను గురించిన ప్రమాణికమైన, ఆందోళన కలిగించే అంశాలను ఆ పుస్తకంలో పొందుపరిచాడు. ఆ పుస్తకం

**❝ 1845 నుండి 47 వరకు ఎంగెల్స్ బ్రస్సెల్స్, ఫ్రాన్స్‌లలో నివసిస్తూ సైద్ధాంతిక కృషిని ఆచరణాత్మక కార్యకలాపాలకు జోడిస్తూ బ్రస్సెల్స్, ఫ్రాన్స్‌లలోని జర్మన్ కార్మికులలో పనిచేశాడు. రహస్యంగా పనిచేస్తున్న జర్మన్ కమ్యూనిస్టు లీగ్‌తో అక్కడ వారికి సంబంధాలు ఏర్పడ్డాయి. సోషలిజం ప్రధాన సూత్రాలను వివరిస్తూ చేయమన్న రచనను వారు పూర్తిచేశారు. ఆ విధంగా ప్రఖ్యాతి చెందిన మార్క్స్, ఎంగెల్స్‌ల కమ్యూనిస్టు ప్రణాళికను 1848లో ప్రచురించారు. ❞**

పెట్టుబడిదారీ విధానం, పెట్టుబడిదారులపై తీవ్రమైన వ్యతిరేకతను కలిగించింది. ఆధునిక కార్మికుల దుస్థితిని వివరించటానికి ప్రతిచోటా ఎంగెల్స్ పుస్తకం నుండి ఉదహరించటం సహజంగా మారిపోయింది. 1845కు ముందు గాని, తర్వాత గాని కార్మికవర్గాన్ని గురించి అంతగా వాస్తవాలను వర్ణించిన పుస్తకం రాలేదు.

ఎంగెల్స్ ఇంగ్లండ్ వచ్చేవరకు సోషలిస్టుగా మారలేదు. మాంచెస్టర్‌లో ఇంగ్లీష్ కార్మికవర్గ ఉద్యమాలలో చురుకుగా ఉన్నవారితో సంబంధాలు పెట్టుకొని, అక్కడి సోషలిస్టు పత్రికలకు వ్యాసాలు రాయటం ప్రారంభించాడు. 1844లో జర్మనీకి తిరిగి వెళ్ళేటపుడు తాను అంతకుముందే ఉత్తర ప్రత్యుత్తరాలు జరుపుతున్న కారల్ మార్క్సను పారిస్‌లో కలుసుకున్నాడు. ఫ్రెంచి సోషలిస్టులు, వారి జీవన విధానం ప్రభావంతో మార్క్స్ కూడా సోషలిస్టుగా మారాడు. ఇక్కడ స్నేహితులిద్దరూ కలిసి పవిత్ర కుటుంబం లేదా విమర్శనాత్మక విమర్శపై విమర్శ పుస్తకం రాశారు. ఇంగ్లండ్‌లో కార్మికవర్గ స్థితిగతులకు సంవత్సరం ముందు వెలువడిన ఈ పుస్తకంలోని అత్యధిక భాగం మార్క్స్ రాశాడు. మనం ఇంతకుముందు చూసిన భౌతికవాదపు విప్లవకరమైన సోషలిస్టు విధాన పునాదులను దీనిలో వివరించారు. తత్వవేత్తలైన బాయర్ సోదరులకు, వారి మద్దతుదారులకు పెట్టిన మారుపేరు "పవిత్ర కుటుంబం". అన్ని వాస్తవాలకు, పార్టీలకు, రాజకీయాలకు అతీతమైన విమర్శలు చేస్తూ బాయర్ సోదరులు అన్ని ఆచరణాత్మక కార్యకలాపాలను తిరస్కరించారు. చుట్టూ ఉన్న ప్రపంచాన్ని, దానిలో జరుగుతున్న ఘటనలను విమర్శించటమే పనిగా పెట్టుకున్నారు. బాయర్ సోదరులు కార్మికవర్గాన్ని అనవసరమైన వారిగా పరిగణించారు. అర్థంలేని, ప్రమాదకరమైన ఈ భావాలను మార్క్స్, ఎంగెల్స్‌లు తీవ్రంగా వ్యతిరేకించారు. నిజమైన మానవుని పేరుతో–ప్రభుత్వం, పాలకవర్గాల చేత అణగతొక్కబడిన కార్మికుడు– వారికి కావాల్సింది సానుభూతి కాదని, ఉన్నత సమాజం కోసం పోరాటం చేయటం కావాలని చెప్పారు. ఈ పోరాటం చేయటంలో ఆసక్తి కలిగిన శక్తిగా వారు కార్మికవర్గాన్ని చూశారు. పవిత్ర కుటుంబం ప్రచురించటానికి ముందే మార్క్స్ రాసిన "ఆర్థికవ్యవస్థపై విమర్శనాత్మక వ్యాసాలు" ఎంగెల్స్ ప్రచురించాడు. వాటిలో సమకాలీన ఆర్థికవ్యవస్థను సోషలిస్టు దృక్పథంతో పరిశీలించి, వ్యక్తిగత ఆస్థి ఉన్న సమాజంలో అవి సహజమైన పరిణామాలన్న నిర్ధారణకు వచ్చాడు. మార్క్స్ అర్థశాస్త్రాన్ని అధ్యయనం చేయాలన్న నిర్ణయానికి రావటానికి నిస్సందేహంగా ఎంగెల్స్‌తో పరిచయమే కారణం. ఈ రంగంలో ఆయన చేసిన కృషి నిజమైన విప్లవం సాధించటానికి దోహదం చేసింది.

1845 నుండి 47 వరకు ఎంగెల్స్ బ్రస్సెల్స్, ఫ్రాన్స్‌లలో నివసిస్తూ సైద్ధాంతిక కృషిని ఆచరణాత్మక కార్యకలాపాలకు జోడిస్తూ బ్రస్సెల్స్, ఫ్రాన్స్‌లలోని జర్మన్ కార్మికులలో పనిచేశాడు. రహస్యంగా పనిచేస్తున్న జర్మన్ కమ్యూనిస్టు లీగ్‌తో అక్కడ వారికి సంబంధాలు ఏర్పడ్డాయి. సోషలిజం ప్రధాన సూత్రాలను వివరిస్తూ చేయమన్న రచనను వారు పూర్తిచేశారు. ఆ విధంగా ప్రఖ్యాతి చెందిన మార్క్స్, ఎంగెల్స్‌ల కమ్యూనిస్టు ప్రణాళికను 1848లో ప్రచురించారు. ఈ రోజున ఉన్న అన్ని గ్రంథాల కన్నా ఎక్కువ విలువైనది కమ్యూనిస్టు ప్రణాళిక. దానిలోని సారాంశం ఆధునిక సమాజంలో సంఘటితమై పోరాడుతున్న కార్మికవర్గానికి ఈరోజుకూ మార్గదర్శిగా ఉన్నది.

1848లో ఫ్రాన్స్‌లో ప్రారంభమై మిగతా పశ్చిమ యూరప్ దేశాలకు వ్యాపించిన విప్లవంతో మార్క్స్, ఎంగెల్స్‌లు తమ స్వదేశానికి తిరిగివచ్చారు. వారు రెనిష్ ప్రష్యాలోని కొలోన్‌లో ప్రచురిస్తున్న ప్రజాస్వామ్య పత్రిక న్యూ రెనిష్ జీటంగ్ బాధ్యతలు తీసుకున్నారు. ఈ ఇద్దరు స్నేహితులు రెనిష్ ప్రష్యాలోని విప్లవకర, ప్రజాస్వామిక ఆకాంక్షలకు హృదయం, మేధగా వ్యవహరించారు. ప్రతీఘాతుక శక్తులకు వ్యతిరేకంగా స్వేచ్ఛకోసం, ప్రజల ప్రయోజనాల కోసం వారు చివరివరకు పోరాడారు. పోరాటంలో ప్రతీఘాతకులు పైచేయి సాధించారు. న్యూ రెనిష్ జీటంగ్‌ను మూసివేశారు. ప్రవాసంలో ఉన్నపుడు ప్రష్యన్ పౌరసత్వాన్ని కోల్పోవటంతో మార్క్సను దేశం నుండి బహిష్కరించారు. ప్రజల సాయుధ తిరుగుబాటులో ఎంగెల్స్ చురుకుగా పాల్గొన్నాడు. స్వాతంత్ర్యం కోసం జరిగిన మూడు పోరాటాలలో భాగస్వామి అయ్యాడు. తిరుగుబాటు విఫలమైన తర్వాత తిరుగుబాటుదారులు స్విట్జర్లాండ్ మీదుగా లండన్ పారిపోయారు.

మార్క్స్ కూడా లండన్‌లో స్థిరపడ్డాడు. ఎంగెల్స్ మాంచెస్టర్‌లో 40వ దశాబ్దంలో పనిచేసిన సంస్థలోనే మొదట గుమాస్తాగా, తర్వాత భాగస్వామిగా చేశాడు. 1870 వరకు ఎంగెల్స్ మాంచెస్టర్‌లో, మార్క్స్ లండన్‌లో నివసించారు. కాని ఇది వారిద్దరూ పరస్పరం అభిప్రాయాలు తెలియజేసుకోవటానికి ఏ మాత్రం ఆటంకం కాలేదు. దాదాపు ప్రతిరోజూ వారిద్దరూ లేఖల ద్వారా అభిప్రాయాలు తెలియజేసుకొనేవారు. ఈ లేఖలలో నూతన శాస్త్రీయ ఆవిష్కరణలను, శాస్త్రీయ సోషలిజానికి సంబంధించిన అభిప్రాయాలను తెలియజేసుకొనేవారు. 1870లో ఎంగెల్స్ లండన్ వచ్చాడు. 1883లో మార్క్స్ చనిపోయేవరకు అత్యంత కఠినమైన వారిరువురి మేధోకృషి కొనసాగింది. దాని ఫలితం మనకాలంలో అత్యున్నతమైన పెట్టుబడి గ్రంథాన్ని మార్క్స్ రాయగా, ఎంగెల్స్ అనేక చిన్న, పెద్ద గ్రంథాలను రచించాడు. పెట్టుబడిదారీ ఆర్థికవ్యవస్థలోని సంక్లిష్టమైన అంశాలను అధ్యయనం చేయటానికి మార్క్స్ కృషిచేశాడు. సాధారణమైన వాదప్రతివాదాలకు సంబంధించి యాంటి డూరింగ్(తత్వశాస్త్రం, నాచురల్ సైన్సెస్, సామాజిక శాస్త్రాలకు సంబంధించిన అత్యంత ముఖ్యమైన అంశాలను విశ్లేషించాడు), కుటుంబం, వ్యక్తిగత ఆస్థి, రాజ్యాంగాల పుట్టుక, లుడ్విగ్ ఫ్యూయర్‌బా, రష్యన్ ప్రభుత్వ విదేశాంగ విధానానికి సంబంధించిన వ్యాసం, గృహ సమస్యపై

అత్యంత ముఖ్యమైన వ్యాసాలు, చివరిగా రష్యన్ ఆర్థిక అభివృద్ధికి సంబంధించిన రెండు చిన్న, అత్యంత విలువైన వ్యాసాలు రాశాడు. తన విస్తారమైన గ్రంథం పెట్టుబడికి తుది మెరుగులు దిద్దకుండానే మార్క్స్ చనిపోయాడు. ముసాయిదా అప్పటికే సిద్ధమైంది. తమ మిత్రుడు చనిపోయిన తర్వాత పెట్టుబడి గ్రంథానికి మెరుగులు దిద్ది, రెండు, మూడు భాగాలను ప్రచురించే అత్యంత కష్టతరమైన బాధ్యతను ఎంగెల్స్ తీసుకున్నాడు. పెట్టుబడి రెండవ భాగాన్ని 1885లో, మూడవ భాగాన్ని 1894లో ప్రచురించాడు.( ఆయన మరణంతో నాలుగవ భాగం ప్రచురణ నిలిచిపోయింది). ఈ రెండు భాగాలను ప్రచురించటానికి ఆయన తీవ్రమైన శ్రమ చేయాల్సివచ్చింది. రెండు, మూడుభాగాలను ప్రచురించటం ద్వారా తన స్నేహితుని మేధస్సుకు ఘనమైన స్మృతి చిహ్నాన్ని నిర్మించటమేకాక, ఎంగెల్స్ అనాలోచితంగానే, నమ్మలేని విధంగా దానిపై తన పేరును కూడా లిఖించుకున్నాడన్న ఆస్ట్రియన్ సోషల్ డెమోక్రాట్ అడ్లర్ చెప్పింది వాస్తవం. వాస్తవంగా ఈ రెండు భాగాలు మార్క్స్, ఎంగెల్స్ ఇద్దరి కృషి ఫలితం. పాత చరిత్ర గాథల్లో మనసులను కదిలించే విధంగా ఉన్న స్నేహాలను గురించి చెపుతారు. తమ శాస్త్రాన్ని ఇద్దరు పండితులు, పోరాటయోధులు రచించారని, పురాతన కాలంలోని హృదయాన్ని కరిగించే అన్ని స్నేహ గాథల కన్నా వారిది అత్యుత్తమమైన స్నేహమని యూరోపియన్ కార్మికులు సగర్వంగా చెప్పుకోవచ్చు. ఎంగెల్స్ ప్రతి సందర్భంలోనూ, వాస్తవాన్ని ప్రతిబింబించే విధంగా మార్క్స్ తర్వాతనే తనపేరు చెప్పుకొనేవాడు. “మార్క్స్ జీవించి వున్నపుడు నేను ఆయనకు వంతపాడే వానిగా ఉన్నాను” అని ఎంగెల్స్ తన పాత మిత్రునికి రాసిన ఉత్తరంలో పేర్కొన్నాడు. మార్క్స్ బతికున్నపుడు ఆయనపై ప్రేమ, చనిపోయిన తర్వాత ఆయన స్మృతిని గౌరవించటంలో ఎంగెల్స్‌కు హద్దులులేవు. ఈ పోరాటయోధుడు, అత్యున్నత మేధావికి అత్యంత గాఢంగా ప్రేమించే హృదయం ఉంది.

> **“1848-49 ఉద్యమాల తర్వాత ప్రవాసంలో ఉన్న మార్క్స్, ఎంగెల్స్‌లు శాస్త్రీయ పరిశోధనలకే పరిమితం కాలేదు. 1864లో మార్క్స్ ఇంటర్నేషనల్ వర్కింగ్ మెన్స్ అసోసియేషన్‌ను స్థాపించి, దశాబ్దం పాటు దానికి నాయకత్వం వహించాడు. దాని కార్యకలాపాలలో ఎంగెల్స్ కూడా చురుకైన పాత్ర నిర్వహించాడు.”**

1848-49 ఉద్యమాల తర్వాత ప్రవాసంలో ఉన్న మార్క్స్, ఎంగెల్స్‌లు శాస్త్రీయ పరిశోధనలకే పరిమితం కాలేదు. 1864లో మార్క్స్ ఇంటర్నేషనల్ వర్కింగ్ మెన్స్ అసోసియేషన్‌ను స్థాపించి, దశాబ్దం పాటు దానికి నాయకత్వం వహించాడు. దాని కార్యకలాపాలలో ఎంగెల్స్ కూడా చురుకైన పాత్ర నిర్వహించాడు. మార్క్స్ ఆలోచనల ప్రకారం ఇంటర్నేషనల్ వర్కింగ్ మెన్స్ అసోసియేషన్ అన్ని దేశాలలోని శ్రామికప్రజలను ఐక్యం చేయటం, కార్మికవర్గ ఉద్యమాన్ని అభివృద్ధి చేయటంలో అద్భుతమైన పాత్ర నిర్వహించింది. 70వ దశాబ్దంలో అది పనిచేయటం నిలిచిపోయినప్పటికీ, కార్మికులను ఐక్యం చేసే పాత్రను మార్క్స్, ఎంగెల్స్‌లు వదులుకోలేదు. అందుకు భిన్నంగా కార్మికవర్గ ఉద్యమం నిరంతరాయంగా అభివృద్ధి కావటంతో, కార్మికవర్గ సైద్ధాంతిక నాయకులుగా వారిపాత్ర కూడా పెరుగుతూ వచ్చింది. మార్క్స్ మరణం తర్వాత యూరోపియన్ కార్మికవర్గానికి బోధకుడిగా, నాయకుడిగా ఎంగెల్స్ బాధ్యతలు నిర్వహించాడు. ప్రభుత్వం క్రూరమైన విధానాలను అనుసరిస్తున్నప్పటికీ అత్యంత శీఘ్రంగా, స్థిరంగా తమ బలాన్ని పెంచుకుంటున్న జర్మన్ సోషలిస్టులు కూడా ఆయన సలహాలను తీసుకొనేవారు. అలానే తమ మొదటిదశలో ఆలోచించి అడుగులు వేయాల్సిన వెనుకబడిన దేశాలైన స్పెయిన్, రుమేనియన్‌లు, రష్యన్‌లు కూడా ఆయన సలహాలు తీసుకొనేవారు. వృద్ధాప్యంలో ఉన్న అత్యున్నత మేధావియైన ఎంగెల్స్ విజ్ఞానాన్ని వారూ పొందేవారు.

మార్క్స్, ఎంగెల్స్ ఇద్దరికీ రష్యన్ భాష వచ్చు. వారు రష్యన్ పుస్తకాలు చదువుతూ అక్కడి విప్లవోద్యమాన్ని సానుభూతితో పరిశీలిస్తుండేవారు. అక్కడి విప్లవకారులతో సంబంధాలు కొనసాగించేవారు. ఈ ఇరువురూ మొదట ప్రజాస్వామ్యవాదులై(డెమోక్రాట్స్) తర్వాత సోషలిస్టులయారు. కాబట్టి నిరంకుశ పాలనపై ప్రజాస్వామికవాదులకుండే వ్యతిరేకభావాలు వారిలో బలంగా ఉన్నాయి. రాజకీయ నిరంకుశత్వం, ఆర్థిక అణచివేత, వీటికి సంబంధించిన వారి జీవితానుభవాలు మార్క్స్, ఎంగెల్స్‌లను రాజకీయంగా అత్యున్నతంగా స్పందించేవారిగా చేశాయి. అందువలననే బలమైన రష్యన్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా వేళ్ళపై లెక్కపెట్టగలిగినంతమంది చేసిన పోరాటం, వారికి విధించిన శిక్షకు వీరు సానుభూతిని వ్యక్తం చేశారు. మరోవైపు ఆర్థిక ప్రయోజనాల కోసం భ్రమలు పెంచుకొనే ధోరణి రష్యన్ సోషలిస్టులకు తక్షణం అత్యవసరమైన, అత్యంత ప్రధానకర్తవ్యమైన రాజకీయ స్వాతంత్ర్యం పొందటానికి ద్రోహం చేయటమేనని వారు భావించారు. కార్మికులను విముక్తి చేయటం కార్మికవర్గం యొక్క కర్తవ్యం అని వారు నిరంతరం చెబుతుండేవారు. ఆర్థిక విముక్తికోసం పోరాడటానికి కార్మికవర్గం కొన్ని రాజకీయ హక్కులు సాధించటం అవసరం అని వారు చెబుతుండేవారు. రష్యాలో విప్లవం రావటం పశ్చిమ యూరప్ దేశాలలోని కార్మికవర్గ ఉద్యమానికి అత్యంత ప్రాధాన్యత కలిగిన అంశమని మార్క్స్, ఎంగెల్స్‌లు స్పష్టం చేసేవారు. నిరంకుశమైన రష్యా యూరప్‌లో ప్రతీఘాతుకానికి కేంద్రంగా ఉంటుందని చెప్పారు. 1870 యుద్ధం వలన రష్యా పొందుతున్న అసాధారణమైన అంతర్జాతీయ మద్దతు కాలక్రమంలో జర్మనీ, ఫ్రాన్స్‌ల అసంతృప్తికి కారణమౌతుందని, ఫలితంగా నిరంకుశ రష్యా ప్రాధాన్యత పెరుగుతుంది. స్వతంత్రమైన రష్యా, పోలులను, ఫిన్‌లాండ్ వారిని, జర్మన్‌లను, ఆర్మీనియన్‌లను లేదా ఏవైనా ఇతర చిన్న దేశాలను అణచివేయాల్సిన అవసరం లేని, జర్మనీ, ఫ్రాన్స్‌లను నిరంతరం పోటీ పడేలా చేయగలిగిన, యుద్ధభారాలను తప్పించగలిగిన రష్యా ఆధునిక యూరప్ స్వేచ్ఛా వాయువులు పీల్చుకునేలాచేసి, ప్రతీఘాతశక్తులను బలహీనపరిచి, యూరోపియన్ కార్మికవర్గాన్ని బలపరుస్తుంది. అందువలన పశ్చిమయూరప్‌లోనూ కార్మికవర్గ ఉద్యమం అభివృద్ధి కావాలంటే రష్యాలో రాజకీయ స్వాతంత్ర్యం కావాలని ఎంగెల్స్ చెప్పేవాడు. ఆయన మరణంతో రష్యన్ విప్లవకారులు గొప్ప మిత్రుడ్ని కోల్పోయారు.

**(అనువాదం: ఎ కోటిరెడ్డి)**

# ప్యారిస్ కమ్యూన్ @ 150

(9వ పేజీ తరువాయి)
ఉత్తర దిక్కులో పారిస్‌ను ముట్టడించి ఉన్న ప్రష్యా సైనిక పటాలాల మధ్య నుండి థయర్స్ సైన్యం పారిస్ నగరంవైపు వెళ్లడానికి అనుమతిచ్చాడు. ఉత్తరం వైపు నుండి పారిస్‌పై థయర్స్ దాడి చేయగలడని నేషనల్ గార్డులు కొంచెం కూడా అనుమానించలేదు.

**పారిస్‌పై దాడి**

థయర్స్ సైన్యం మే 20 పారిస్ నగరంపై పెద్ద ఎత్తున దాడి ప్రారంభించింది. కమ్యూన్ మద్దతుదారుల రక్షణ వలయంలోని బలహీన మైన ప్రాంతాన్ని ఒక ద్రోహి థయర్స్ సైన్యానికి చూపించాడు. దాంతో బూర్జువా సేనలు మరునాడు అంటే మే 21న పారిస్ నగరంలోకి ప్రవేశించగలిగాయి. అప్పటి నుండి మే 28న పారిస్ కమ్యూన్ పతనం అయ్యేవరకు పారిస్ నగరంలోని ప్రతి అంగుళాన్ని రక్షించుకోడానికి కార్మికవర్గం చేసిన పోరాటం చరిత్రలో వీరోచిత, త్యాగపూరిత అధ్యాయంగా నిలిచి పోతుంది. 'రక్తపాత వారం'గా పేరుపొందిన ఆ వారం రోజులు కమ్యూన్ మద్దతుదారులు తమ కన్నా అన్ని విధాలా బలమైన శత్రువు నుండి నగరంలోని ప్రతి వీధినీ, ప్రతి ఇంటినీ, ప్రతి అంగుళం నేలనూ రక్షించడానికి ప్రాణాలు పణంగా పెట్టి పోరాడారు. ప్రాణాలు పోయేంత వరకు వారు పోరాడారే గాని ఎక్కడా వెనక్కు తగ్గలేదు. నగరం మొత్తం ముఖ్యంగా కార్మికులు నివసించే ప్రాంతాల్లో బారికేడ్లు నిర్మించారు. బారికేడ్ల రక్షణలో డొంబ్రోవ్‌స్కీ వంటి వీరులు అనేక మంది నేలకొరిగారు. తమ ప్రాంతాల్లోని బారికేడ్లను రక్షించుకోడానికి కార్మికవాడల్లోని స్త్రీలు, పిల్లలు కూడా ముందుకు వచ్చారు. మొత్తం 10,000 మంది కార్మిక స్త్రీలు ఈ పోరాటంలో పాల్గొన్నారు.

వారం రోజుల పాటు బూర్జువా సైన్యం పారిస్ నగరంలోని వాడవాడలా కార్మికుల రక్తం పారించింది. వేలాది మంది నేషనల్ గార్డులు, కమ్యూన్ మద్దతుదారులను కాల్చి చంపింది. వారిలో స్త్రీలు, పిల్లలు కూడా ఉన్నారు. కమ్యూన్ మద్దతుదారుల బారికేడ్లను ఛేదించుకుంటూ, దొరికిన వారిని దొరికినట్లు చంపుతూ, ఇళ్లను తగులబెడుతూ అనేక మందిని అరెస్టు చేస్తూ ముందుకు నడిచిన థయర్స్ సైన్యం మే 27న పెరె లాచైజ్ శ్మశాన వాటికలోని కమ్యూన్ మద్దతుదారుల చివరి రక్షణ దుర్గాన్ని కూల్చి వేసింది. శ్మశాన వాటికలో 200 మంది నేషనల్ గార్డులు ఆత్మరక్షణ చేసుకుంటున్నారు. థయర్స్ సైన్యం ఫిరంగులతో శ్మశాన వాటిక గేటు పగలగొట్టి లోపలకు ప్రవేశించింది. కమ్యూన్ మద్దతుదారులందరినీ శ్మశానం గోడకు గురిపెట్టి కాల్చి చంపింది. అప్పటి నుండి ఆ గోడను ''కమ్యూనార్డ్స్ (కమ్యూన్ మద్దతుదారుల) గోడ" అని పిలుస్తున్నారు. ఇప్పటికీ పారిస్ ప్రజలు ప్రతి ఏటా గోడవద్దకు ప్రదర్శనగా వెళ్లి పారిస్ కమ్యూన్ మృత వీరులకు శ్రద్ధాంజలి ఘటిస్తారు.

**కమ్యూన్ పతనం**

మే 28న పారిస్‌లోని చివరి బారికేడ్ కూలిపోయింది. ప్రతీఘాత–విప్లవం విజయం సాధించింది. ఓడిపోయిన కమ్యూన్ మద్దతు దారులను బూర్జువా ప్రభుత్వం అతి దారుణంగా హింసించింది. చాలా మందిని కాల్చి చంపేసింది. "కమ్యూన్ వర్ధిల్లాలి" అంటూనే అనేక మంది కమ్యూన్ మద్దతుదారులు నేలకొరిగారు. పట్టుబడిన నాయకులను చిత్ర హింసలు పెట్టి చంపారు. పట్టుబడి రక్తమోడు తున్న లూయిస్ వర్లిన్‌ను చేతులు వెనక్కి విరిచి కట్టి మాంట్‌మార్త్రె వీధుల్లో ఊరేగింపుగా తీసుకువెళ్లారు. ఒక గంట నడిచి పడిపోయిన ఆ కార్మిక నేతను కాల్చి చంపారు. కార్మిక సైన్యానికి సహకరించారనే అనుమానంతో అనేక మంది మహిళలను, కార్మికుల పిల్లలను కాల్చి చంపారు. 30,000 మంది కమ్యూన్ మద్దతు దారులను ఎటువంటి విచారణ లేకుండా కాల్చి చంపారు. 40,000 మందిని అరెస్టు చేసి జైళ్లలో పెట్టారు లేకుంటే ఫ్రెంచ్ వలస దేశాలకు ప్రవాసం పంపారు. అరెస్టయిన వారిలో 650 మంది చిన్నపిల్లలు ఉన్నారు. జైళ్లకు వెళ్లిన వారిలో అనేక మంది రోగాలతోనూ, చిత్రహింస లకు తట్టుకోలేక ప్రాణాలు విడిచారు.

**గుణపాఠాలు**

పారిస్ కమ్యూన్ కొద్ది రోజులే మనుగడ సాధించినప్పటికీ భవిష్యత్ తరాలకు గొప్ప గుణపాఠాలు అందించింది. పారిస్ కమ్యూన్ అందించిన అనుభవాలు, గుణపాఠాలపై విలువైన విశ్లేషణ చేసిన వ్యక్తి కారల్ మార్క్స్. ఆయన తొలి నుండీ కమ్యూన్ పరిణామాలను గమనిస్తూ ఇంటర్నేషనల్ సభ్యులైన వర్లిన్, ఫ్రాంకెల్, ఎలిజవెతా డిమిత్రీవా, లావ్‌రోవ్ వంటి వారి ద్వారా ఎప్పటికప్పుడు నిర్దిష్ట సూచనలు, కమ్యూన్ చేస్తున్న పొరపాట్లపై విమర్శలు చేస్తూనే ఉన్నాడు. నిజానికి పారిస్‌లో విప్లవం విజయవంతం కావడంతోనే కారల్ మార్క్స్ నేతృత్వంలోని మొదటి కార్మికవర్గ అంతర్జాతీయ సంస్థ (ఫస్ట్ ఇంటర్నేషనల్) దానికి నిర్ద్వంద్వంగా మద్దతు తెలిపింది. పారిస్‌కు చెందిన అనేక మంది ఇంటర్నేషనల్ కార్యకర్తలు పారిస్ కమ్యూన్‌లో చురుకైన పాత్ర నిర్వహిం చారు. కమ్యూన్‌ను రక్షించుకోడానికి వీరోచితం గా పోరాడారు. విప్లవం విజవంతం కావడం తోనే ఆలస్యం చేయకుండా వెర్సయిల్స్ మీద దాడి చేసి బూర్జువా ప్రభుత్వాన్ని స్వాధీనం చేసుకోకపోవడం పట్ల మార్క్స్ విమర్శించాడు. బిస్మార్క్, థయర్స్‌తో కుమ్మక్కవుతాడని కూడా హెచ్చరించాడు. అలాగే కమ్యూన్ తీసుకున్న సామాజిక, ఆర్థిక విధానాలపై పలు సూచనలు చేశాడు.

1871 మే 28న పారిస్ కమ్యూన్ పతనమైన రెండు రోజుల తరువాత, అంటే మే 30న తొలి ఇంటర్నేషనల్ వర్కింగ్ మెన్స్ (ఫస్ట్ ఇంటర్నేషనల్) జనరల్ కౌన్సిల్ సమావేశానికి మార్క్స్ రాసిన "పారిస్‌లో అంతర్యుద్ధం" అనే పత్రం పారిస్ కమ్యూన్‌పై అద్భుతమైన విశ్లేషణ. అందులో ఆయన తొలుత పారిస్ కమ్యూన్ ఆవిర్భావం గురించి క్లుప్తంగా వివరించాడు. తొలి కార్మికవర్గ ప్రభుత్వం యొక్క చారిత్రక ప్రాధాన్యత గురించి ప్రపంచానికి చెప్పాడు. పారిస్ కమ్యూన్ అనుభవాలతో ఆయన భవిష్యత్ కార్మిక వర్గ ఉద్యమానికి ఎనలేని అనేక గుణపాఠాలు అందించాడు. అందులో ముఖ్యమైనది ఒక రాజకీయ పార్టీ లేకుండా, క్రమశిక్షణ గల నిర్మాణం లేకుండా కార్మికవర్గం విజయం సాధించలేదు అని. మార్క్స్ చెప్పిన అనుభవాలను లెనిన్ 1917 ఆగస్టులో రాసిన "రాజ్యము–విప్లవము" అనే గ్రంథంలో మరింత విపులీకరించి నాటి రష్యా విప్లవ పరిస్థితులకు అన్వయించడానికి ప్రయత్నించాడు. "కమ్యూన్ మద్దతుదారులు 'స్వర్గాన్ని ఆక్రమించారు' అంటూ వారి హీరో యిజం పట్ల మార్క్స్ ఉత్సాహం మాత్రమే ప్రదర్శించలేదు" అని లెనిన్ పేర్కొన్నాడు. "ప్రజా విప్లవోద్యమం తన లక్ష్యాలు సాధించలేకపోయి నప్పటికీ అది అత్యంత ప్రాముఖ్యత గల వీరోచిత అనుభం అని ఆయన (మార్క్స్) పరిగణించాడు. మొత్తం కార్మివర్గ విప్లవోద్యమ ప్రస్థానంలో అది ఒక ముందడుగుగా భావించాడు. వందలాది కార్యక్రమాలు, వాదోపవాదాలకు మించిన గొప్ప ఆచరణాత్మక అనుభం అని పేర్కొన్నాడు. దాని నుండి ఎత్తుగడలకు సంబంధించిన గుణ పాఠాలు నేర్చుకుని, దాని వెలుగులో సిద్ధాంతాన్ని పునఃపరిశీలించాడు" అని లెనిన్ చెప్పాడు.

విప్లవంలో కార్మికవర్గాన్ని సమర్థ వంతం గా, ఏకీకృతంగా నడిపించగల పార్టీ లేకపోవ డమే పారిస్ కమ్యూన్ ఓడిపోడానికి ప్రధాన కారణమని మార్క్స్ విశ్లేషించాడు. నిజానికి

ఫ్రాన్స్‌లో 1871 నాటికి కార్మికవర్గం సాపేక్షంగా చాలా చిన్నదిగా ఉంది. జనాభాలో అధిక భాగం రైతాంగం, పెటీ బూర్జువా వర్గం (వృత్తి నిపుణులు, చిన్న వ్యాపారులు, లాయర్లు, డాక్టర్లు వంటి వారు) ఉన్నారు. ఆ సమయంలో అక్కడ విప్లవ కార్మికవర్గ పార్టీ లేదు. అటువంటి పార్టీ మాత్రమే బూర్జువా వర్గానికి వ్యతిరేకంగా కార్మికవర్గ విప్లవాన్ని విజయం వైపు నడిపించ గలదు. పారిస్‌లోని మెజార్టీ కార్మికుల్లో స్థిరమైన అభిప్రాయాలు లేవు. తమ లక్ష్యాల పట్ల, వాటిని నెరవేర్చుకునే మార్గాల పట్ల స్పష్టతలేదు. స్పష్టమైన సిద్ధాంతం, కార్యాచరణ ప్రణాళిక కలిగిన విప్లవ కార్మికవర్గ పార్టీ లేకపోవడం వల్లనే నేషనల్ గార్డు కేంద్ర కమిటీ గానీ, పారిస్ కమ్యూన్ మండలి గానీ అనేక పొరపాట్లు చేశాయి.

ఉదాహరణకు, మార్చి 18న పారిస్ కార్మికవర్గం విప్లవం సాధించిన వెంటనే నేషనల్ గార్డు సైనికులు బ్యాంక్ ఆఫ్ ఫ్రాన్స్‌కు వెళ్లి అక్కడ అపారమైన ధనరాశులున్నాయని గ్రహించారు. వాటిని స్వాధీనం చేసుకుని కమ్యూన్ పనిని విస్తరించడానికి ఉపయోగించు కోవచ్చు. కానీ బ్యాంకును ఆక్రమించే ధైర్యం కమ్యూన్ చేయలేకపోయింది. దాన్ని ప్రజాతంత్ర నియంత్రణ కిందకు తెచ్చి దానిలోని సంపదను సామాజిక ప్రయోజనాల కోసం వాడే ధైర్యం చెయ్యలేకపోయింది. తరువాత దీనిపై ఏంగెల్స్ ఇలా రాశాడు: 'బ్యాంక్ ఆఫ్ ఫ్రాన్స్ గేట్ల బయటే వాళ్లు భక్తి పూర్వకంగా తలవంచుకుని నిలబడి పోవడం ఒకపట్టాన అర్థంకాని విషయం అయిపోయింది'. అసలు విషయం ఏమంటే కమ్యూన్ సభ్యుల్లో ప్రబలంగా ఉన్న ఊహాజనిత సోషలిజం భావన వల్ల వారు ఆర్థిక వనరులు ప్రజాతంత్ర ప్రభుత్వానికి లోబడి ఉండాలనీ, బూర్జువా వర్గాన్ని నిత్యం నడిపించే సంపదను కార్మికవర్గం చేతుల్లోకి తీసుకోవాలనీ అర్థం చేసుకోలేకపోయారు.

కమ్యూన్ నాయకులు భూమిని రైతులకు పంచాలనీ ఇతర కోర్కెలను తీర్చాలనీ కోరుతూ అనేక కరపత్రాలు వేసి పంచడం ద్వారా ఫ్రాన్స్ రైతాంగ మద్దతు పొందడానికి ప్రయత్నించారు. కానీ కార్మికవర్గానికీ, రైతాంగానికీ మధ్య సంఘటన ఏర్పడకపోవడం కూడా కమ్యూన్ ఓడిపోవడానికి ఒక కారణం. ఒకవైపు పారిస్‌ను శత్రువు చుట్టుముడితే బయటి ప్రపంచం నుండి ముఖ్యంగా రైతాంగం నుండి సహాయం లేకుండా పారిస్ కార్మికవర్గం ఒంటరి పోరాటం చేయాల్సి వచ్చింది.

**కమ్యూన్ అందించిన విలువైన అనుభవాలు**

1948లో మార్క్స్ ఏంగెల్స్ రాసిన కమ్యూనిస్టు ప్రణాళికకు ఒకే ఒక్క సవరణ చేయాల్సిన అవసరం వచ్చిందని మార్క్స్ భావించాడు. ఆ సవరణకు పారిస్ కమ్యూన్ విప్లవపోరాట అనుభవమే ప్రాతిపదిక అని ఆయన పేర్కొన్నాడు."... 'అప్పటికే ఉన్న రాజ్యాంగ యంత్రాన్ని కార్మికవర్గం స్వీకరించి తన సొంత ప్రయోజనాల కోసం ఉపయోగించుకోజాలదు' అన్న విషయాన్ని కమ్యూన్ నిరూపించింది" అని కమ్యూనిస్టు మ్యానిఫెస్టో కొత్త జర్మన్ ఎడిషన్‌కు మార్క్స్, ఏంగెల్స్ రాసిన ముందు మాటలో పేర్కొన్నారు. 'పారిస్‌లో అంతర్యుద్ధం' అన్న గ్రంథంలో కూడా మార్క్స్ ఈ విషయాన్నే చెప్పాడు. "కార్మికవర్గం అప్పటికే ఉన్న రాజ్యాంగ యంత్రాన్ని యథాతథంగా ఉపయోగించుకోడానికి ప్రయత్నించకుండా దాన్ని ధ్వంసం చేయాలి' అని మార్క్స్ అభిప్రాయపడినట్లు లెనిన్ 'రాజ్యము–విప్లవము' గ్రంథంలో పేర్కొన్నాడు.




**పారిస్ శ్మశాన వాటికలో "కమ్యూనార్డ్స్" గోడ: ఇప్పటికీ ప్రతి ఏటా మే 28న ఇక్కడకు ప్రజలు వచ్చి కమ్యూన్ రక్షణలో నేలకొరిగిన కార్మిక వీరులకు నివాళు లర్పిస్తారు**

1871 ఏప్రిల్ 12న పారిస్ కమ్యూన్ ఏర్పడిన అనంతరం కుగెల్‌మాన్‌కు రాసిన లేఖలో మార్క్స్ ఈ విధంగా పేర్కొన్నాడు: "నేను రాసిన 18వ బ్రూమైర్ గ్రంథంలోని చివరి చాప్టర్‌ను నీవు గమనిస్తే అందులో నేనిలా ప్రకటించాను... ఫ్రెంచ్ విప్లవపు తదుపరి ప్రయత్నం గతంలో లాగా సైనిక–అధికార యంత్రాంగాన్ని ఒక చేతి నుండి మరో చేతికి బదలాయించడం కాకుండా దాని ధ్వంసం చేయాలి. ఈ ఖండంలోని నిజమైన ప్రతి ప్రజా విప్లవం మొదట చేయాల్సిన పని ఇది. పారిస్‌లోని మన వీరోచిత పార్టీ కామ్రేడ్స్ ప్రస్తుతం ఈ ప్రయత్నమే చేస్తున్నారు."

దీనిపై లెనిన్ వివరణ ఇస్తూ పాత "సైనిక–అధికార యంత్రాంగాన్ని ధ్వంసం చేయడం" అన్నదే విప్లవ కాలంలో కార్మికవర్గం చేయాల్సిన పని అని మార్క్సిజం మనకు నేర్పుతున్న ప్రధాన సూత్రం" అని పేర్కొన్నాడు.

విప్లవ కార్మికవర్గం బూర్జువా సైనిక–అధికార యంత్రాంగాన్ని ధ్వంసం చేయాలన్న సూత్రాన్ని పారిస్ కమ్యూన్ అనుభం నుండి మార్క్సిజం–లెనినిజం గ్రహించింది. మార్చి 18న పారిస్‌లో విప్లవం విజయం సాధించిన వెంటనే కార్మికవర్గం చేసిన మొదటి పని అక్కడి సైన్యాన్ని, పోలీసు వ్యవస్థను రద్దు చేయడం. దాంతోపాటు ఎన్నికైన ప్రజా ప్రతినిధులు – పారిస్ కమ్యూన్ మండలి సభ్యులు – కార్యనిర్వాహక వర్గం పనులు కూడా చేయడం ద్వారా పాత అధికార యంత్రాంగానికి చెల్లు చీటీ ఇచ్చారు. ఆ విధంగా కార్మికవర్గ నియంతృత్వం యొక్క ప్రాధాన్యతను పారిస్ కమ్యూన్ అనుభవం తెలియజేసింది.

సోషలిస్టు విప్లవాలు ఎలా నడపాలో పారిస్ కమ్యూన్ అనుభవం ప్రపంచ కార్మికవర్గానికి నేర్పించింది. యూరప్ అంతటా కార్మికవర్గ ఉద్యమాలకు కమ్యూన్ ఊపునిచ్చింది. రష్యాలో అక్టోబర్ విప్లవాన్ని విజయవంతంగా నిర్వహించడంలో లెనిన్‌కూ, బోల్షివిక్ పార్టీకి కమ్యూన్ అనుభవాలూ, దాని తప్పిదాల నుండి గుణపాఠాలూ ఎంతగానో తోడ్పడ్డాయి.

**పారిస్ కమ్యూన్ బతికే ఉంది**

ఫ్యూడల్ వ్యవస్థను ఛేదించుకుని అధికారంలోకి వచ్చిన బూర్జువా వ్యవస్థ గర్భంలోనే దానికి గోరీ కట్టే శక్తులు కూడా పుట్టుకు వచ్చాయని కారల్ మార్క్స్ విశ్లేషించాడు. ఫ్రెంచ్ విప్లవ చరిత్ర, ప్రపంచ చరిత్ర ఈ విషయాన్ని మనకు పదేపదే గుర్తు చేస్తాయి.

ఫ్రెంచ్ విప్లవం తరువాత 1830లో పారిస్ కార్మిక వర్గం జరిపిన విప్లవ పోరాటాన్ని బూర్జువా వర్గం హైజాక్ చేసింది. 1831లో ఫ్రాన్స్‌లోని లియోన్ నగర కార్మికవర్గం తనపై జరుతున్న దోపిడీకి వ్యతిరేకంగా తిరుగుబాటు చేసింది. తిరుగుబాటుదారులు నల్లటి బ్యానరు మీద "పనిచేస్తూ బతుకు, పోరాడుతూ చనిపో" అని రాశారు. 10 రోజుల పాటు కార్మికవర్గం నగరాన్ని స్వాధీనం చేసుకుంది. కానీ తరువాత ఏం చేయాలో దానికి తెలియక తెల్ల మొహం వేసింది. వ్యవస్థాగత నిర్మాణం లేని కార్మికులను రక్తపుటేరుల్లో ముంచి బూర్జువా సైన్యం తిరిగి నగరాన్ని స్వాధీనంలోకి తెచ్చుకుంది. 1834లో మళ్లీ లియోన్ నగర కార్మికవర్గం

తిరుగుబాటు చేసింది. ఈ సారి తిరుగుబాటు దారులు మానవత్వం కోసం, దేశం కోసం, మా భవిష్యత్తు కోసం ఈ పోరాటం అని రాసిన ఎర్రటి బ్యానర్లు పట్టుకున్నారు. వారం రోజుల పాటు సైన్యంతో వీరోచితంగా వీధిపోరాటం చేసిన అనంతరం వారు ఓడిపోయారు. పై రెండు పోరాటాల్లో కార్మికవర్గం స్వంతంత్ర శక్తిగా ఆవిర్భవించింది. 1848లో ఫ్రాన్స్‌లో జరిగిన విప్లవంలో బూర్జువా వర్గంతో కార్మిక వర్గం అధికారం కోసం తలపడింది. సంఘటిత శక్తిగా ఉన్న బూర్జువా వర్గం కుట్రపూరిత విన్యాసాలతో గెలుపొందినప్పటికీ భవిష్యత్ నిర్ణాయక శక్తిగా కార్మిక వర్గం ముందుకు వచ్చింది. దానికి కొనసాగింపే 1871 పారిస్ కమ్యూన్. ఈ సారి కార్మికవర్గం బూర్జువా వర్గంపై విజయం సాధించడమే కాదు రెండున్నర మాసాలు అధికారం చేపట్టింది. కొద్ది కాలంలోనే అయినా కార్మికవర్గ రాజ్యం ఎలా ఉంటుందో ప్రపంచానికి చూపించింది. భవిష్యత్ కార్మికవర్గ రాజ్యాలకు – సోషలిజానికి – దిక్సూచిగా నిలిచింది.

అందువల్ల పారిస్ కమ్యూన్ 72 రోజుల స్వల్ప కాలమే మనుగడ సాధించినా అది అంతం కాలేదు. తరువాత జరిగిన అనేక విప్లవాల్లో –రష్యన్ అక్టోబర్ విప్లవంలో, ఓడిపోయిన జర్మన్ విప్లవంలో, విజయం సాధించిన చైనా, క్యూబా, వియత్నాం, కొరియా విప్లవాల్లో, ప్రపంచవ్యాపితంగా నేటికీ జరుగుతున్న కార్మికవర్గ పోరాటాల్లో జీవించే ఉంది. కమ్యూన్ పతనమై 150 సంవత్సరాలు కావచ్చుగాక కానీ ప్రపంచంలో ఎక్కడెక్కడ ప్రజా విప్లవాలు జరుగుతున్నా అక్కడల్లా పారిస్ కమ్యూన్ జీవించే ఉంటుంది. భూగోళం మీద సోషలిజం సుస్థిరమయ్యేవరకు విప్లవ పోరాటాలకు మార్గదర్శనం చేస్తూనే ఉంటుంది. ❊

# ప్రతిభ -సమర్ధత రిజర్వేషన్లు

(19వ పేజీ తరువాయి)

వారి కన్నా పనిలో వెనుకబడినట్లు రుజువు కాలేదు. అనేకరంగాలలో, అనేక సందర్భాలలో ప్రతిభ ఉన్నవారికన్నా, ఎక్కువ మార్కులు తెచ్చుకున్నవారి కన్నా రిజర్వేషన్ల ద్వారా ఉద్యోగాలు పొందిన వారు ఎక్కువ సమర్ధవంతంగా పనిచేస్తున్న ఉదాహరణలు అనేకం ఉన్నాయి. పై కులాలలో కూడా ఎక్కువ మార్కులు తెచ్చుకొని ఉద్యోగాలు చేస్తున్న వారి కన్నా తక్కువ మార్కులు తెచ్చుకొని ఉద్యోగాలు పొందిన వారు ఎక్కువ సమర్ధవంతంగా పనిచేస్తున్నవారున్నారు. మార్కులకు, ప్రతిభావంతంగా పనిచేయటానికి సంబంధం లేదు. పనిచేయాలనే దృక్పథం, తన బాధ్యతను నెరవేర్చాలనే పట్టుదల ఉన్నవారు సమర్ధవంతంగా పనిచేస్తారు. దానికి ప్రతిభతో, మార్కులతో సంబంధం లేదు. అటువంటి ఆలోచనలు లేనివారు మార్కులు సంపాదించటంలో మొదటిస్థానంలో ఉన్నా తన బాధ్యతలను నెరవేర్చటంలో అట్టడుగు స్థానంలో ఉంటారు.

రాజకీయరంగంలో రిజర్వేషన్లు పొందినవారు కూడా సమర్ధవంతంగా పనిచేస్తున్న వారున్నారు. పంచాయితీ వార్డు సభ్యునిస్థాయి నుండి పార్లమెంటు వరకు రిజర్వేషన్ల ద్వారా ఎన్నికైన వారికన్నా మిగతా వారు సమర్ధవంతంగా పనిచేస్తున్న దాఖలాలేదు. సర్పంచులుగా ఎన్నికైన దళితులు, గిరిజనులు, వెనుకబడిన తరగతులకు చెందినవారు చాలా పంచాయితీలను ఆదర్శ పంచాయితీలుగా తీర్చిదిద్దారు. మండలాలు, జిల్లా పరిషత్‌ల పాలనను సమర్ధవంతంగా నిర్వహిస్తున్నవారున్నారు. రాష్ట్రాలు, కేంద్రంలో కూడా అనేకమంది చట్టసభల సభ్యులుగా, మంత్రులుగా సమర్ధవంతంగా పనిచేసినవారున్నారు.

బడా పెట్టుబడిదారులు, సామ్రాజ్యవాదులు సాగిస్తున్న దోపిడీపైకి యువత దృష్టి మళ్ళించకుండా చేయటానికి రిజర్వేషన్ల వ్యతిరేక ప్రచారం తోడ్పడుతున్నది. పై కులాలలోని నిరుద్యోగ యువతను తప్పుదారి పట్టించటానికి, గ్రామాలలోని యువత ఐక్యం కాకుండా చేయటానికి భూస్వాములకు రిజర్వేషన్ల వ్యతిరేక ప్రచారం ఉపయోగపడుతున్నది. దళిత, గిరిజన, వెనుకబడిన కులాలలోని అభివృద్ధి చెందుతున్న కుటుంబాలలోని యువతను చూపించి పై కులాలలోని పేద కుటుంబాలలో ఉన్న యువతను రెచ్చగొడుతున్నారు. తమ ఆర్థికదోపిడి, సామాజిక, రాజకీయ ఆధిపత్యాన్ని కొనసాగించటానికి ఎటువంటి ఆటంకాలు లేకుండా యువతను, ప్రజలను ఐక్యం కాకుండాచేస్తున్నారు.

భారతీయ సమాజంలో ఆస్తులు, ఉద్యోగాలు, అన్ని విధాలైన అవకాశాలలో అత్యధిక భాగం పై కులాల వారి ఆధిపత్యంలో ఉండగా, దానిని గురించి ప్రశ్నించకుండా ఉండడానికి, దోపిడీ, అణచివేతల నుండి ప్రజల దృష్టి మళ్ళించటానికే దళితులు, గిరిజనులు, వెనుకబడిన తరగతులకు ఉన్న రాజ్యాంగబద్ధ రిజర్వేషన్లపై సంఘ్ పరివార్ దాడి చేస్తున్నది.

# కమ్యూనిస్టు ఉద్యమ ఆటుపోట్లు: శాస్త్రీయ అవగాహన

(16వ పేజీ తరువాయి)

బూర్జువావర్గం మనుగడా, దాని పెత్తనమూ సాగాలంటే తప్పనిసరిగా పెట్టుబడి ఏర్పడాలి. అది వృద్ధి కావాలి. పెట్టుబడి ఉండాలంటే కూలికి పనిచేసేవాళ్లుండాలి. కూలి అనేది కార్మికుల మధ్య పోటీ మీదనే పూర్తిగా ఆధారపడి ఉంటుంది. పారిశ్రామిక పురోగమనాన్ని సాధించేది బూర్జువావర్గమే. అయితే ఆ పెరుగుదల పర్యవసానాలను అది గ్రహించ లేదు. అంతకు ముందు పోటీవల్ల ఎవరికివారే అన్నట్లుండే శ్రామికులు ఈ పారిశ్రామిక పురోగమనంలో ఒకరితో ఒకరు సహరించుకుంటూ విప్లకరంగా ఐక్యమవుతారు. ఏ పునాదిపై ఆధారపడి బూర్జువావర్గం సంపదలను సృష్టించి స్వాహా చేస్తుందో, ఆ పునాదులనే ఈ పారిశ్రామిక అబివృద్ధి కూల్చివేస్తుంది. కనుక బూర్జువావర్గం ప్రధానంగా ఉత్పత్తి చేసేది తనకు గోరీ కట్టే శక్తుల్నే. బూర్జువావర్గ పతనమూ, శ్రామిక వర్గ విజయమూ తప్పదు.

పెట్టుబడిదారీ విధాన పరిణామ క్రమాన్ని ఈ విధంగా వివరించిన కమ్యూనిస్టు మానిఫెస్టో గ్రంథం, తరువాతి అధ్యాయాల్లో కార్మికులతో కమ్యూనిస్టులకుండాల్సిన సంబంధాన్ని, అప్పటి వరకూ ప్రచారంలో ఉన్న రక, రకాల సోషలిస్టు సిద్ధాంతాల బండారాన్ని, ఇతర ప్రతిపక్ష పార్టీల పట్ల కమ్యూనిస్టుల వైఖరిని వివరించింది.

"కమ్యూనిస్టులు తమ అభిప్రాయాలనూ, లక్ష్యాలనూ దాచుకోవటాన్ని అసహ్యించుకుంటారు. ఆనాటి సకల సామాజిక పరిస్థితులను కూలదోయటమే తమ లక్ష్యమని బాహాటంగానే ప్రకటిస్తారు. కమ్యూనిస్టు విప్లవాన్ని తలచుకుని పాలకవర్గాలు వణకనీయండి. శ్రామికులకు పోయేదేమీ లేదు. బానిస సంకెళ్లు తప్ప. వారు గెలుచుకోవటానికి ఒక ప్రపంచం ఉంది.... ప్రపంచ కార్మికులారా ఏకం కండి!" అనే పొలికేక పిలుపుతో ఆ గ్రంథం ముగుస్తుంది.

ఈ స్పష్టమైన సిద్ధాంత ప్రతిపాదనతో అంతకు ముందున్న (ఊహాజనిత సోషలిజం) గందరగోళం సోషలిస్టు ఉద్యమంలో తొలగిపోయింది. ఈ స్ఫూర్తితో శాస్రీయ సోషలిస్టు భావజాలం ప్రపంచమంతటా 1848 తర్వాత శరవేగంగా విస్తరించింది. అయితే కొద్ది సంవత్సరాలకే మరో ఆటంకాన్ని సోషలిస్టు ఉద్యమం ఎదుర్కోవాల్సి వచ్చింది. అదేమిటి? దానినెలా అధిగమించారు? అనేది వచ్చే మాసంలో చర్చిద్దాం. ❊

# నాల్గవ పార్టీ మహాసభ

**(2వ పేజీ తరువాయి)**

పార్టీలో ఉన్న అంతర్గత విబేధాల కారణంగా ఈ ఎన్నికల ఫలితాలను పార్టీ సరిగ్గా సమీక్షించుకోలేకపోయింది.

ఈ నేపథ్యంలో 1956 ఏప్రిల్ 19–29 మధ్యకేరళలోని పాల్ ఘాట్‌లో పార్టీ నాల్గవ మహాసభ జరిగింది. అప్పటికి పార్టీ సభ్యత్వం 75000, కాండిడేట్ సభ్యత్వం 30000 ఉండేది.

ఈ కాలంలో అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమంలో, ముఖ్యంగా సోవియెట్ కమ్యూనిస్టు పార్టీలో అనేక మార్పులు చోటు చేసుకున్నాయి. 1956లో సి పి ఎస్ యూ 20వ మహాసభ జరిగింది. ఆ మహాసభలో జరిగిన తీర్మానాలలో తప్పుడు అంచనాలు రివిజనిస్టు శక్తుల బలాన్ని మళ్ళీ పెంచాయి. పాలఘాట్ మహాసభకు కేంద్ర కమిటీ తయారు చేసిన ముసాయిదా తీర్మానాలలో ఎన్నో రివిజనిస్టు సూత్రీకరణలు ఉన్నాయి. అవి పార్టీలో వర్గ సామరస్య ధోరణులను ప్రోత్సహించాయి. ఈ రివిజనిస్టు ధోరణులను అంగీకరించని వర్గం తన ప్రత్యామ్నాయ ముసాయిదాను ప్రవేశపెట్టింది. 1951 పార్టీ కార్యక్రమం ఆధారంగా రూపొందినందువలన ఈ ముసాయిదాలో కూడా తప్పులు లేకపోలేదు. అందువలన దీనికి కూడా పరిమితులు ఉన్నాయి. అయితే ఈ ముసాయిదాలో భారతదేశ రాజ్యం యొక్క వర్గ స్వభావం మీద విశ్లేషణ స్పష్టంగా ఉంది. వర్గ మిలాఖత్ ధోరణులను పూర్తిగా ఎండగట్టింది. ఈ పత్రాలపై లోతైన చర్చ జరిగింది. వర్గ మిలాఖత్ ధోరణులు గలవారు పార్టీనంతటిని వారి ఆలోచనకు అనుగుణంగా తమతో కలుపుని పోలేకపోయారు. ఈ చర్చలు, వాదోపవాదాలు కొన్నిమౌలిక సైద్ధాంతిక అంశాలను ముసాయిదాలో ఉంచేటట్టు చేసాయి. ప్రజల ప్రజాతంత్ర వ్యూహాత్మక లక్ష్యాలను జప్పించేటట్టు చేసాయి. ఈ సవరణలు ప్రత్యామ్నాయ ముసాయిదాను ప్రవేశపెట్టాలనుకున్న వారి ప్రతిపాదనలతో దాదాపు సరిపోవడం వలన ప్రత్యామ్నాయ ముసాయిదా ప్రవేశ పెట్టబడలేదు.

సవరించిన ముసాయిదా, ఇదివరకటి కేంద్ర కమిటీప్రవేశ పెట్టాలనుకున్న, వర్గ మిలాఖత్ కోరుకున్న వారి ఆలోచనలకు అనుగుణంగా లేదు. వారు ఇతరులను సమాజంలో జరుగుతున్న మార్పులను పరిగణనలోనికి తీసుకోకుండా, స్థిరమైన సూత్రాలకు, ఎత్తుగడలకు అంటిపెట్టుకున్న వారిగా నిందించారు–ఇది పార్టీకి తీరని నష్టం కలిగించింది. పార్టీ మహాసభలో వారు తమ ప్రత్యామ్నాయ ముసాయిదాను ప్రవేశ పెట్టారు. అది ఓడిపోయిన మాట నిజమే అయినా ప్రతినిధులలో మూడో వంతు దానికి ఓటు వేసారు అని గమనించాలి.

మహాసభ ముందు ప్రవేశ పెట్టిన నిర్మాణ రిపోర్ట్ పార్టీలో క్రమశిక్షణ లోపించిందని, నిర్ణయాలు అమలుకావడం లేదని గుర్తించింది. ఈ కాలంలో పార్టీ కేంద్రంలో తరగతులు నిర్వహించినా, అందులో పార్టీ అంటే ఒక సమగ్ర అవగాహన లేదు. పార్టీలో ఉమ్మడి పనివిధానం దెబ్బతినింది. పార్టీ కేంద్రం బలహీన పడింది. ఇది పార్టీ పత్రిక ప్రచురణలో, సాహిత్య అమ్మకాలలో కూడా బయట పడింది. పార్టీ సమర్పించిన రిపోర్టులో పార్టీ నాయకత్వం, వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా పార్టీని అభివఅద్ధి చేయడంలో సిద్ధాంతాన్ని రూపొందించడంలో విఫలమైనట్టు అంగీకరించింది.

క్రెడెన్సియల్ కమిటీ సమర్పించిన నివేదిక ప్రకారం మహాసభకు 407 మంది కామ్రేడ్లు హాజరయ్యారు. మొత్తం ప్రతినిధులు 1344 సంవత్సరాలు జైళ్లలో గడిపారు. అంటే ప్రతి ప్రతినిధి కనీసం మూడేళ్లు జైళ్లలో గడిపినట్టు తెలుతున్నది. ప్రతినిధులంతా కలిసి 1021 సంవత్సరాలు రహస్య జీవితం గడిపారు. అంటే ప్రతి ఒక్కరు రెండున్నరసంవ్సత్సరాలు రహస్య జీవితం గడిపినట్టు. ఇది పార్టీ పోరాట పటిమను తెలియచేస్తుంది.

ప్రపంచ వ్యాప్తంగా సోషలిజం శక్తులవైపే నిర్దిష్టంగా మొగ్గు ఉన్నదని, సామ్రాజ్యవాదం బలహీన పడుతున్నదని మహాసభ రాజకీయ తీర్మానంలో ఆమోదించింది. ఇది కొంతమందిని పార్లమెంటులో మెజారిటీ సాధించడం ద్వారా శాంతియుతంగా సోషలిజం సాధించే అవకాశం ఉన్నదని, అందుకు 'అవసరమైన పరిస్థితులు' కల్పించుకోడమే పార్టీ ముందున్న సవాలని అనుకునేట్టు చేసింది. ఈ చర్చలు వాదోపవాదాలు పార్టీ, పార్టీ కార్యక్రమంపైన, తక్షణం అనుసరిస్తున్న ఎత్తుగడల పంథా పైన విడిపోయి ఉన్నదని తెలియచేస్తుంది.

పార్టీ మహాసభ రాజకీయ తీర్మానాన్ని ఆమోదించినప్పటికీ, భారత కమ్యూనిస్టు ఉద్యమంలో కొన్ని ముఖ్యమైన సమస్యలపై పార్టీలో ఏకాభిప్రాయం లేదని స్పష్టంగా తెలుస్తున్నది (రాజ్యం యొక్క స్వభావం, అనుసరించవలసిన వ్యూహం, ఎత్తుగడలు). అంటే ఈ మహాసభ, ఆ తరువాత దశాబ్దకాలం పాటు, పార్టీ కార్యక్రమం, సైద్ధాంతిక సమస్యలపై జరిగిన అంతర్గత పోరాటాలకు నాంది పలికిందన్నమాట.

❋

## 'మార్క్సిస్టు'కు మీ సందేహాలు రాయండి!

'మార్క్సిస్టు' సైద్ధాంతిక మాసపత్రికలో సిపిఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు ప్రతినెలా పాఠకుల సందేహాలకు సమాధానాలిస్తున్న సంగతి మీకు తెలుసు. ప్రస్తుత అంతర్జాతీయ, జాతీయ, రాష్ట్ర రాజకీయ పరిణామాలపై మీ సందేహాలను నివృత్తి చేసుకు నేందుకు ప్రశ్నలను పంపండి! ప్రతినెలా 20వ తేదీలోపు మీ ప్రశ్నలు మాకు చేరితే తదుపరి సంచికలో రాఘవులు సమాధానాలు లభిస్తాయి. మీ ప్రశ్నలు అందాల్సిన చిరునామా!

**ఎడిటర్, మార్క్సిస్టు (సైద్ధాంతిక మాసపత్రిక), ప్రజాశక్తి భవనం, అమరారెడ్డి కాలనీ, అరవింద స్కూల్ వద్ద, తాడేపల్లి , పిన్ : 522501, గుంటూరు జిల్లా.**

**సెల్: 9490099333** email: venkataraosankarapu@gmail.com

RNI Reg. No. APTEL/2006/17554 Posted on 05-05-2021 (36 pages) Postal Regd. No D/VJ/172/2021-23

# కరోనాపై విజయం సాధించడానికి సోషలిజమే మంచి ఆయుధం



– ప్రొ. షా ఆలమ్ ఖాన్

మన రాజ్యాంగ పీఠిక నుండి 'సోషలిజం', 'సెక్యులరిజం' అనే మాటలు తొలగించాలని సుప్రీం కోర్టులో పిటిషన్ వేశారు. గత రెండు దశాబ్దాలుగా ఈ సూత్రాలను పాలకులు నీరుగారుస్తున్నప్పటికీ మన పూర్వీకులు ఆశించిన గణతంత్ర రాజ్యానికి ఈ రెండు సూత్రాలే నేటికీ కేంద్ర బిందువులు. తొంబయివ దశకంలో నయా–ఉదారవాద విధానాలు చేపట్టిన తరువాత సోషలిజం అనే సూత్రాన్ని వెనక్కు నెట్టారు. కానీ నేటి కరోనా మహమ్మారి నేపథ్యంలో సోషలిజం భారత దేశానికే కాదు మొత్తం ప్రపంచానికే అవసరమైంది. ప్రపంచమంతా కరోనా మహమ్మారితో సతమతమవుతున్న నేటి పరిస్థితుల్లో మహమ్మారి వ్యాప్తిని ఒకసారి పరిశీలిస్తే ప్రజల ప్రాణాలు కాపాడ్డానికి సోషలిజమే శరణ్యమని అర్థమవుతోంది. దీని గురించి మరింత లోతుగా పరిశీలించాల్సి ఉంది.

నయా–ఉదారవాద ప్రపంచంలో ఏ దేశాన్నీ సంపూర్ణమైన సోషలిస్టు దేశంగా చెప్పజాలం. కానీ సామాజిక వైద్యాన్ని అందించే దేశాలు సంక్షేమ రాజ్యాలుగా పరిగణించబడుతున్నాయి. అందువల్ల కరోనాను అరికట్ట గలిగిన, దాని నుండి ప్రాణ నష్టం తగ్గించగలిగిన దేశాలు ఏవి, ఆ దేశాలను పాలిస్తున్న రాజకీయ సిద్ధాంతం ఏది అని పరిశీలించాల్సిన అవసరం ఉంది.

మంచి ఆరోగ్య వ్యవస్థ ఉన్న దేశాలు కరోనా మహమ్మారిని అరికట్టగలిగాయి. దీంతోబాటు వైద్య సంరక్షణకు రాజకీయ చిత్తశుద్ధి కూడా అవసరం. మంచి ప్రజా రోగ్య వ్యవస్థ అనేది సోషలిజంలో ఒక అంతర్భాగం. అటువంటి వ్యవస్థ ఉన్న చోటనే కరోనా మహమ్మారిని కట్టడి చేయగలిగారు. ప్రయివేటు ఆరోగ్య రక్షణ వ్యవస్థ ఉన్న పెట్టుబడిదారీ దేశాల్లో ఎంత గొప్ప ఆరోగ్య సాంకేతిక పరిజ్ఞానం ఉనప్పటికీ అవి ఈ విషయంలో పరమ దరిద్రంగా వ్యవహరించాయి. దీనికి అమెరికా ఒక ఉదాహరణ......

......సోషలిజం ఎంత నిస్తేజమైన స్థితిలో ఉన్నా, రూపాంతరం చెంది ఉన్నా, ఆసక్తిగొల్పకుండా ఉన్నా కూడా కరోనా మహమ్మారిని ఎదుర్కొనడంలో అదే మంచి ఆయుధం. భారత దేశం సోషలిస్టు మార్గం విడిచిపెట్టి ఉండవచ్చుగాక, కానీ మన లాంటి దేశంలో కూడా ప్రజారోగ్య రక్షణ విషయంలో సోషలిజమే ఆశా దీపం.

**(రచయిత అఖిలభారత వైద్య విజ్ఞాన సంస్థ –ఎయిమ్స్ లో ఆర్థోపెడిక్ విభాగం ప్రొఫెసర్. 2020 అక్టోబర్‌లో ఇండియన్ ఎక్స్‌ప్రెస్ పత్రికలో ఆయన "సోషలిజం మరియు కరోనా మహమ్మారి" అన్న శీర్షికతో రాసిన వ్యాసం నుండి ఈ వాక్యాలు గ్రహించబడ్డాయి)**

### చందా వివరాలు

విడిప్రతిక: **రూ.10,** సంవత్సర చందా:**రూ.100,** పోస్టు ద్వారా **రూ. 120**

పోస్టు ద్వారా లేదా ఏజెంటు ద్వారా తెప్పించుకోవచ్చు.
లేదా మీ స్థానిక పార్టీ కార్యాలయంలో సంప్రదించండి.
ప్రజాశక్తి బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలలోనూ లభిస్తాయి.

### చిరునామా

**మేనేజర్,**
**మార్క్సిస్టు (సైద్ధాంతిక మాసపత్రిక),**
**ప్రజాశక్తి భవనం, అమరారెడ్డి కాలనీ,**
**అరవింద స్కూల్ వద్ద, తాడేపల్లి ,**
**పిన్ : 522501, గుంటూరు జిల్లా.**
**సెల్: 9490098977**

e m a i l : marxistap@gmail.com
venkataraosankarapu@gmail.com

Printed and Published by B.V. Raghavulu on behalf of CPIM AP Committee. Printed at Prajasakti Printers & Publishers Private Ltd. D .No 14-12-19, Krishna Nagar, Tadepalli (M) Guntur Dt. 9490098977.
Editor : S. Venkatarao, RNI Reg.No. APTEL/2006/17554. Vol.15, No.12. Published on May 1, 2021